# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 22 మార్చి 2025 | సంపుటి: 9 | సంచిక: 85 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## బలపడ్డ రూపాయి



2

## బెట్టింగ్‌కు మరో యువకుడి బలి



2

### బుద్ధి మాంద్యం, అజ్ఞానం.. అన్న హరీష్ వ్యాఖ్యలపై

# అసెంబ్లీలో దుమారం



### సీఎంకు జ్ఞానం లేదనా? మాకెవరికీ జ్ఞానం లేదనా? : డిప్యూటీ సీఎం భట్టి

వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హరీష్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల కోసమే రోడ్లు వేశారని కోమటి రెడ్డి కామెంట్

సడక్‌లు సరిగ్గ లేవని పిల్లనిస్తలేరు: స్పీకర్ ప్రసాద్ కుమార్

హైదరాబాద్, మనం బ్యూరో: బుద్ధి మాంద్యం, అజ్ఞానం అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో దుమారం రేపాయి. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శుక్రవారం హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఆర్థిక వృద్ధి తగ్గిపోతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పథకాలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేస్తోందనీ, ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. దేశమంతా ఆర్థిక మాంద్యం ఉందని ప్రభుత్వం బడ్జెట్‌లో అబద్ధాలు చెప్పారనీ, దేశంలో ఏ రాష్ట్రంలో లేని మాంద్యం తెలంగాణలో ఉందా ? అని ప్రశ్నించారు. ఆర్థిక మాంద్యం ప్రపంచంలో కాదు, ప్రభుత్వ పెద్దల బుద్ధిలో ఉందని వ్యాఖ్యానించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో ఆదాయం తగ్గింది. తెలంగాణ ...మిగతా 2లో

## మాది వాస్తవాన్ని ప్రతిబింబించే బడ్జెట్

- మీలాగా మేం అడ్డగోలు అప్పులు చేయం
- ఆర్థిక క్రమశిక్షణ పాటించని బీఆర్ఎస్ మాపై భారం మోపింది
- పదేండ్లలో రూ.16.70 లక్షల కోట్లు ఖరు పెట్టి ఏం సాధించారు ?
- అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చకు డిప్యూటీ సీఎం భట్టి సమాధానం

2





### తక్కువ వడ్డీకి

# రుణాలివ్వండి

### నాబార్డు చైర్మన్ షాజీకి సీఎం విజ్ఞప్తి

### కొత్త జిల్లాల్లో డీసీసీబీలు ఏర్పాటు చేయాలన్న షాజీ

హైదరాబాద్, మనం బ్యూరో: ఆర్ఐడిఎఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీని కోరారు. మైక్రో ఇరిగేషన్‌కు నిధులు పెంచాలనీ, కో-ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌తో నాబార్డ్ చైర్మన్ షాజీ శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని కోరారు. ఐకేపీ, ...మిగతా 2లో

## సీఎంతో హరీష్ రావు, పద్మారావు భేటీ

- కుటుంబ సమేతంగా రేవంత్‌ను కలిసిన మల్లారెడ్డి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలవడంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చలు

హైదరాబాద్, మనం బ్యూరో:

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బడ్జెట్‌పై వాడివేడిగా చర్చలు జరుగుతుండగా శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్‌రావు, పద్మారావు గౌడ్ కలవడం రాజకీయ చర్చకు దారితీసింది. అరగంటకు పైగా జరిగిన ఈ భేటీ అనంతరం హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. మేము వెళ్లే సరికే సీఎం గదిలో చాలా మంది ఉన్నారు. 15 నిమిషాల పాటు రేవంత్ రెడ్డితో ఏమీ మాట్లాడలేదు. ఆ తరువాత ...మిగతా 2లో

## నిమిషానికి కోటి, రోజుకు రూ. 1,700 కోట్ల అప్పు

### తెలంగాణ రుణం రూ. 8.6 లక్షల కోట్లు

### ఒక్కో వ్యక్తిపై రుణభారం రూ. 2.27 లక్షలు



- అప్పులు చేస్తూ ఉంటే అభివృద్ధి సంగతేమిటి?
- ఎన్డీయే హయాంలో రాష్ట్రాలకు నిధుల వాటా పెరిగింది : ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిరోజు సుమారు రూ. 1,700 కోట్లకు పైగా అప్పు చేస్తోందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం అప్పు రూ. 8.6 లక్షల కోట్లకు చేరిందని ఆయన పేర్కొన్నారు. శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమిషానికి రూ. 1 కోటికి పైగా అప్పు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తిపై రుణభారం రూ. 2.27 లక్షలుగా ఉందని వెల్లడించారు. ఇంత భారీ స్థాయిలో రుణాలు ఉంటే తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. యూపీఏ హయాం కంటే ఎన్డీయే హయాంలో ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రాలకు పెరిగాయని ఆయన స్పష్టం చేశారు. యూపీఏ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో వాటా 32 శాతం మాత్రమే ఉండగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వాటాను 10 శాతం పెంచి 42 శాతానికి చేర్చారని గుర్తు చేశారు.

# చెన్నై చేరిన సీఎం



### రేవంత్‌తో పాటు మహేశ్ గౌడ్ కూడా..

### నేడు డీలిమిటేషన్‌పై అఖిలపక్షం

హైదరాబాద్, మనం బ్యూరో : తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి తమిళనాడు రాజధాని చెన్నై చేరుకున్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో శనివారం డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా నిర్వహించనున్న అఖిల పక్ష సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. అలాగే, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం చెన్నై వెళ్లారు. ఈ మేరకు రెండు రాష్ట్రాల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చెన్నై పర్యటన ముగించుకుని తిరిగి హైదరాబాద్ చేరే వరకూ ఇరు రాష్ట్రాల పోలీసులు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. కాగా, కేంద్ర ప్రభుత్వం త్వరలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టనున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ ప్రక్రియను తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, హక్కులు దెబ్బతింటాయని సీఎం స్టాలిన్ ఆరోపిస్తున్నారు. అవసరమైతే రాజ్యాంగ సవరణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. పునర్విభజన జరిగితే 1971 జనాభా లెక్కల ప్రకారం జరగాలనీ, ఇందుకు అవసరమైతే రాజ్యాంగ సవరణ జరగాలని అంటున్నారు. ఈ అంశంపై చర్చించేందుకు ఈనెల 22న చెన్నైకు రావాలని ఏడు రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించారు. ఈమేరకు ఆఖిలపక్ష సమావేశంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి బృందం చెన్నై వెళ్లింది.



## వడగండ్ల వాన

### పలు జిల్లాల్లో ఈదురు గాలులు

### తడిసిన ధాన్యం.. రాలిన మామిడిపూత, కాయ

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలోని పలు జిల్లాల్లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. నిజామాబాద్, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఈ వర్షానికి పలు ప్రాంతాల్లో వరి ధాన్యం తడిసి ముద్దయింది. పలుచోట్ల మామిడి తోటల్లో పూత, పిందెలు నేలరాలాయి. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో భారీగా వడగండ్ల వాన కురిసింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగండ్ల వాన కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ముందే హెచ్చరించింది. రానున్న ...మిగతా 2లో

## మీ సంపాదన కోసం సమాజాన్ని నాశనం చేస్తరా?

నేను చెబితే కోకాకోలా యాడ్‌కు చిరు గుడ్ బై చెప్పిండు?

బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో సినీ తారల వైఖరిపై సీపీఐ నారాయణ మండిపాటు

2

### కర్నాటకలో 'హనీ ట్రాప్'

# వ్యవహారం



### అసెంబ్లీ నుంచి 18 మంది బీజేపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్

బెంగళూరు: కర్ణాటకలో మంత్రులు సహా అనేక మంది ముఖ్యనేతలే లక్ష్యంగా కొనసాగుతోన్న 'హనీ ట్రాప్' వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. జాతీయ స్థాయి నేతలు సహా 48 మంది రాజకీయ నాయకులు ఇందులో బాధితులుగా ఉన్నారంటూ ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. దీనిపై శుక్రవారం కర్ణాటక అసెంబ్లీ దద్దరిల్లింది. సమావేశాల వేళ ప్రతిపక్ష భాజపా నేతలు ఈ అంశాన్ని లేవనెత్తడంతో తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. దాంతో సభా కార్యక్రమాలకు అడ్డుపడిన 18 మంది భాజపా ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తూ తీర్మానం చేశారు. ఆరు నెలల పాటు వారిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. 'హనీ ట్రాప్' వ్యవహారాన్ని ఈ రోజు భాజపా నేతలు లేవనెత్తారు. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇంతటి ముఖ్యమైన విచారణను పక్కనపెట్టి ప్రభుత్వం ముస్లిం కోటా బిల్లును పాస్ ...మిగతా 2లో

## అత్యాచారంపై తప్పుడు తీర్పు

- హైకోర్టు న్యాయమూర్తి ఆర్డర్‌పై కేంద్ర మంత్రి స్పందన
- ప్రముఖులు, మహిళా సంఘాల విమర్శలు
- తీర్పును పరిశీలించాలని సుప్రీంకు విన్నపం



2

ప్రమాదంలో ప్రమాదం..

### జడ్జి గారింట్లో బయట పడ్డ

# నోట్ల కట్టలు

### ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నివాసంలో ఘటన

ఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. దీన్ని ...మిగతా 2లో



## 10 పరీక్షలు ప్రశాంతం

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలో పదో తరగతి పరీక్షలు శుక్రవారంనాడు ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ఎక్కడా.. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద డీఈఓ, ఎంఈఓ, తహసీల్దారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచారు. ఏదైనా సమస్య వస్తే వేంటనే వారి దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు తెలిపారు. మొత్తం 2,650 పరీక్షా కేంద్రాల్లో 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. విద్యార్థులను తనిఖీలు చేసి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఈసారి 24 పేజీల బుక్‌లెట్ విధానం అందుబాటులోకి వచ్చింది. ఏప్రిల్ 4తో ఎగ్జామ్స్ ముగుస్తాయి.






# అమెరికా విద్యాశాఖ మూసివేత

- ఉత్తర్వులపై సంతకం చేసిన ట్రంప్
- అత్యంత విధ్వంసకర, వినాశకర చర్య అని ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ విమర్శ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ ప్రభుత్వ వ్యయం తగ్గింపుపై దృష్టిపెట్టారు. అందులో భాగంగా ప్రభుత్వ సిబ్బందిని తొలగిస్తూ వస్తునానరు. ఇదే కోవలో ఇటీవల విద్యాశాఖలోని ఉద్యోగాల్లో భారీగా కోతలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు దానికి మించిన చర్య ఒకటి చేపట్టారు. విద్యాశాఖను మూసివేశారు. ఈమేరకు గురువారం ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. శ్వేత సౌధంలో పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. అనంతరం విద్యాశాఖ మూసివేత ఆర్డర్లపై ఆయన సంతకం చేశారు. 'అతి త్వరలోనే దీన్ని అమలుచేస్తాం. విద్యాశాఖ ద్వారా మాకు ఎలాంటి మేలు జరగదు. ఈ శాఖ అధికారాలను రాష్ట్రాలకు తిరిగివ్వాలని ...మిగతా 2లో

## బుద్ధి మాంద్యం, అజ్ఞానం.. అన్న హరీష్ వ్యాఖ్యలపై

# అసెంబ్లీలో దుమారం

(మొదటి పేజీ తరువాయి)

రైజింగ్ అంటూ సీఎం నినాదం ఇస్తున్నారు, రైజింగ్ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఈ దశలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని బుద్ధి మాంద్యం అనే పదాన్ని వాడటం సరికాదనీ, దానిని ఉపసంహరించుకోవాలనీ, అలా మాట్లాడటం సభ హుందాతనాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. దీనికి హరీష్ రావు స్పందిస్తూ ముఖ్యమంత్రి బట్టలూడదీసి కొడ్తం అని ఇదే సభలో అంటే వారికి మీరెందుకు చెప్పలేదు ? నేను బుద్ధి మాంద్యం అంటే మీ ఆలోచన విధానంలో తప్పుంది అంటున్నారు. అది తప్పయితే, వారి విజ్ఞతకే వదిలేస్తున్నా అని వ్యాఖ్యానించారు.

దీంతో డిప్యూటీ సీఎం భట్టి జోక్యం చేసుకుంటూ ముఖ్యమంత్రిని ఉద్దేశించి కూడా అజ్ఞానం వల్ల అన్నారు. అంటే సీఎంకు జ్ఞానం లేదనా? మాకెవరికీ జ్ఞానం లేదనా? అంటూ ప్రశ్నించారు. సభానాయకుడిని పట్టుకుని మాట్లాడే మాటలు ఇలా మాట్లాడటం కరక్టేనా? హరీష్ రావు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రోడ్లు వేయలేదనీ, కేవలం గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట సెగ్మెంట్లకే వేసుకున్నారని విమర్శించారు. వాటి నిర్మాణానికి నిబంధనలకు విరుద్ధంగా సింగరేణి నిధులను వాడుకున్నారని గుర్తు చేశారు. కమీషన్లు రావనే ఉద్దేశంతోనే రాష్ట్రంలోని మిగతా జిల్లాలకు రోడ్లు వేయలేదని విమర్శించారు. ఈ దశలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుంటూ మా వికారాబాద్ జిల్లాలో రోడ్లు సక్కగలేవని పిల్లనిచ్చేటట్టులేరు...అలాంటి పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. హరీష్ రావు తన ప్రసంగం కొనసాగిస్తూ కృష్ణా జలాలను ఒప్పందానికి విరుద్ధంగా ఏపీ తరలించుకుని పోతున్నా ప్రభుత్వం ఏమీ చేయలేకపోయిందని విమర్శించారు. దీంతో శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని నీళ్లకు నీళ్లు పాలకు పాలు అన్నది చర్చిద్దామనీ, కృష్ణా జలాల విషయంలో ఎవరి హయాంలో తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందో చర్చిద్దామని సమాధానం చెప్పడంతో సభ సద్దుమణిగింది.

## కర్ణాటకలో 'హనీ ట్రాప్' వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

చేయడాన్ని విమర్శిస్తూ.. స్పీకర్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. భాజపా నేతల తీరుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకసారి కేసు నమోదై.. దర్యాప్తు ప్రారంభమైతే హనీట్రాప్లో ఎవరి ప్రమేయం ఉన్నట్లు తేలినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రానికి చెందిన అనేకమంది రాజకీయ నేతలు హనీ ట్రాప్ లో చిక్కుకుపోయారని కర్ణాటక సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న ఇటీవల అసెంబ్లీలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు తెలిసినంతవరకు కనీసం 48 మంది ఇందులో బాధితులుగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. సీడీలు, పెన్ డ్రైవ్ లలో వారి అసభ్య వీడియోలు ఉన్నాయన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైన విషయం కాదన్నారు. అన్ని రాజకీయ పక్షాలకు చెందినవారు ఈ బాధితుల్లో ఉన్నారన్నారు. అంతకుముందు ఇదే అంశంపై మంత్రి సతీశ్ జార్కిహోళీ మాట్లాడుతూ.. ఒక మంత్రిపై రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే, ఇది రాష్ట్రానికి కొత్త కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారని ఆయన తెలియజేశారు.

## బలపడ్డ రూపాయి

**హైదరాబాద్, మార్చి 21:** దేశీయ ఆర్థిక వ్యవస్థకు మంచి రోజులు వచ్చాయా? అంటే, ఎంతోకొంత మంచే అని చెప్పవచ్చంటున్నారు ఆర్థిక నిపుణులు. రెండు సంవత్సరాల తరువాత అమెరికా డాలర్ తో పోలిస్తే భారత రూపాయి బలపడ్డది. 2025 మార్చి నెలలో బ్లూమ్‌బెర్గ్ డేటా ప్రకారం రూపాయి 39 పైసల పెరిగి 85.98 వద్ద ముగిసింది. వరుసగా ఎనిమిది రోజుల పాటు రూపాయి లాభపడుతూ, ఈ వారం ఉత్తమ స్థాయి లాభాలను నమోదు చేయడం గమనార్హం. జనవరి 2023 తర్వాత రూపాయి ఈ వారపు లాభాల్లో అత్యుత్తమంగా నమోదైంది. డాలర్ ఇండెక్స్ పతనం నేపథ్యంలో మార్చిలో ఇప్పటివరకు రూపాయి 1.78 శాతం పెరిగింది. దీంతోపాటు ఫెడ్ రేట్ల విషయంలో కూడా ఎలాంటి పెరుగుదల లేకపోవడం, డాలర్ తగ్గడంతో రూపాయి విలువ పెరిగింది. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు కూడా రెండో రోజు వరుసగా పెరిగాయి. డబ్ల్యూటీఐ ముడి చమురు ధర 0.19 శాతం పెరిగి 67.94 డాలర్ల వద్ద నమోదైంది. డాలర్ బలహీనత నేపథ్యంలో మార్కెట్ లో రూపాయి మదుపరులకు ఆశాజనకమైన పరిణామాలను అందించింది.

## మాది వాస్తవాన్ని ప్రతిబింబించే బడ్జెట్

**హైదరాబాద్, మనం బ్యూరో :** 2025-26 ఆర్థిక సంవత్సరానికి అసెంబ్లీలో వాస్తవాన్ని ప్రతిబింబించే బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్కమార్క అన్నారు. కేసీఆర్ సారథ్యంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అడ్డగోలుగా అప్పులు తెచ్చిందని మండిపడ్డారు. గత పదేళ్లలో మొత్తం రూ.16.70 లక్షల కోట్లు ఖర్చు చేసి ఏం సాధించారని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా శుక్రవారం జరిగిన చర్చకు డిప్యూటీ సీఎం భట్టి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన భట్టి మీరు తెచ్చిన రూ.16.70 లక్షల కోట్ల అప్పులతో నాగార్జునసాగర్ నిర్మించారా? ఎస్ఆర్ఎస్పీ నిర్మించారా? ఓఆర్ఆర్ నిర్మించారా? లేక ఎయిర్‌పోర్టు నిర్మించారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజక్టుకు మాత్రమే రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారు. అదీ కూలిపోయింది. సింగరేణికి రూ.77 వేల కోట్లు బకాయి పెట్టి పోయారు. పదేండ్లలో ఏ గ్రామంలోనైనా రెండు పడకగదుల ఇండ్లు నిర్మించారా ? అసెంబ్లీ ఆమోదం లేకుండా రూ.2.30 లక్షల కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని స్వయంగా కాగ్ నివేదికలో తప్పు పట్టలేదా అని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఏనాడూ నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదనీ, భారీగా బడ్జెట్ పెట్టినా నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఓఆర్ఆర్‌ను రూ.7 వేల కోట్లకే 30 ఏళ్ల కాలానికి అమ్ముకున్నారు. దొడ్డిదారిన ఓఆర్ఆర్, ప్రభుత్వ భూములను అడ్డగోలుగా అమ్ముకున్నారు. తరువాత వచ్చే ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయాన్ని కూడా ముందే తీసుకున్నారు. కేసీఆర్ నెరవేర్చని హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేశారని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ చేయకుండా ఒక జనరేషన్ మొత్తాన్ని నాశనం చేశారు. పదేళ్ల పాటు కీలక విభాగాలలో ఉద్యోగాల భర్తీ చేపట్టకపోవడంతో ఇటు నిరుద్యోగులు, అటు మ్యాన్ పవర్ లేక సంబంధిత విభాగాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. గత బీఆరెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్యాప్ రావడం వల్ల సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులకు కోత పడటం వల్ల ఆ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున నష్టపోయారని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నదే యువత కోసం, మేం అధికారంలోకి రాగానే 58 వేలకు పైగా ఉద్యోగాలిచ్చాం. ఉద్యోగాలు రాని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించడానికి రాజీవ్ యువ వికాసం పేరుతో రూ.6000 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాం. ఈడబ్ల్యూఎస్ కింద యువతకు కూడా స్వయం ఉపాధి పథకాలు అందించడానికి ఈబడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించామనీ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు.

## మీ సంపాదన కోసం సమాజాన్ని నాశనం చేస్తారా?

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో సినీ తారల పేర్లు తెరపైకి రావడం పట్ల అత్యంత సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. అయితే, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే యాడ్స్‌లో గతంలో మెగాస్టార్ చిరంజీవి ఓసారి కోకాకోలా డ్రింక్‌కు ప్రచారం చేశాడని, కానీ, అది సమాజానికి హితం కాదు కాబట్టి దాన్ని బంద్‌చేయాలని నేను లేఖ ఖితో ఆయన మానేశారని నారాయణ తెలిపారు. ఇటువంటి స్ఫూర్తినే అందరూ కొనసాగించాలని ఆయన సూచించారు. ఢిల్లీలోని ఆంధ్రా భవన్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ ద్వారా వచ్చిన ఖ్యాతిని అడ్డం పెట్టుకొని డబ్బు రపాదన వ్యామోహంతో అనైతిక చర్యలకు పాల్పడదాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. సినీ పరిశ్రమలో సక్రమంగా వచ్చే సంపాదన ఉన్నవారు కూడా మరింత సంపాదన కోసం సమాజాన్ని పక్కదారి పట్టించే అనేక అనైతిక ప్రకటనల్లో నటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకే తెలియకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశామని ఒకరు, చట్ట పరంగా అవకాశం ఉంది కాబట్టే చేశామని ఒకరు చెబుతున్నారని మండిపడ్డారు. బెట్టింగ్ యాప్‌లకు వేలాది మంది యువత బలవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నా... వాటిని ఇంకా ప్రమోట్ చేయడం నేరమేనని, వీరిపై ప్రభుత్వం కఠినంగానే చర్యలు తీసుకోవాలన్నారు.

## సీఎంతో హరీష్ రావు, పద్మారావు భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సీతాఫల్‌మండిలో జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు విషయంపై ముఖ్యమంత్రితో చర్చించామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ సీతాఫల్‌మండి కళాశాలకు రూ.32 కోట్లు కేటాయించారనీ, ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయనీ, ఈ పనులను వెంటనే ప్రారంభించాలని కోరినట్లు చెప్పారు. సీఎం వెంటనే వేం నరేందర్ రెడ్డికి ఓ పేపర్ ఇచ్చి ఆ పనులు పూర్తి చేయమని చెప్పారు. పద్మారావు రమ్మన్నాడు కాబట్టే నేను వెళ్లానని హరీష్ రావు వెల్లడించారు. ఇక డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో పెట్టిన మీటింగ్‌ను బహిష్కరించామనీ, చెన్నైలో జరిగే మీటింగ్‌ను కాంగ్రెస్ ఆర్గనైజ్ చేయడం లేదు కాబట్టే హాజరవుతున్నామని తెలిపారు. డీఎంకే మాకు ఫ్రెండ్లీ పార్టీ సమావేశానికి వాళ్లు ఆహ్వానించారు అందుకే వెళుతున్నామని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై పీసీ ఘోష్ కమిటీ నివేదిక గురించి తనకు తెలియదనీ, అది ఎప్పుడు వస్తుందో కూడా గుర్తు లేదని వ్యాఖ్యానించారు. డీ లిమిటేషన్‌తో దక్షిణాదికి జరుగుతున్న అన్యాయంపై ముందుగా మాట్లాడిందే బీఆర్ఎస్ అనీ, ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన స్టాండ్ లేదు, క్లారిటీ లేదని హరీష్ రావు విమర్శించారు. అలాగే, మాజీ మంత్రి మల్లారెడ్డి ఆయన అల్లుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కుటుంబ సమేతంగా సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. మెడికల్ కళాశాలల్లో సీట్ల కోసం సీఎంను కలిసినట్లు సమావేశం అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు.

## బెట్టింగ్‌కు మరో యువకుడి బలి

**మంథని, మార్చి 21:** బెట్టింగ్ లో నష్టపోయి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపల్లి జిల్లాలో చోటుచేసుకుంది. మంథని మండలం విలోచవరం గ్రామానికి చెందిన కోరబోయిన సాయి తేజ (25) ప్రేమ వివాహం చేసుకొని గోదావరిఖనిలోని మార్కండేయ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతడికి ఇద్దరు పిల్లలు కాగా.. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ లకు అలవాటు పడి రూ.10 లక్షలకు పైగా అప్పులపాలయ్యాడు.ఈ క్రమంలో మార్చి 18న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా.. కుటుంబ సభ్యులు హుటాహుటిన కరీంనగర్ లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 'కరప్షన్‌కి' కేరాఫ్ బీఆర్ఎస్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చ శుక్రవారంనాడు అత్యంత వాడీవేడిగా జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, మంత్రి సీతక్క నడుమ తీవ్ర మాటల యుద్ధం సాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రాష్ట్ర పరువుతు తీస్తున్నారంటూ కవిత విమర్శలు చేశారు. దీంతో మంత్రి సీతక్క ఆమె వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు. రాష్ట్ర పరువు తీసింది ఎవరు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలోనే అవినీతి ఉందంటూ కవిత చేసిన వ్యాఖ్యలకు మంత్రి సీతక్క స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మీ కుటుంబమే రాష్ట్ర పరువు తీసిందని... మాకు ఢిల్లీ వ్యాపారాలు తెలియవన్నారు. ఢిల్లీ వ్యాపారాలతో రాష్ట్రం పరువు తీసింది మీరు, మీ కుటుంబం అని కవితనుద్దేశించి సీతక్క విమర్శించారు. కాంగ్రెస్ పార్టీది త్యాగాల చరిత్ర అన్నారు.

ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆందోళన 'కరప్షన్‌కి' కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ అని సీతక్క విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఐదేళ్లలో ఒక్క మహిళా మంత్రి కూడా లేరని గుర్తు చేశారు. మహిళా కమిషన్కి సభ్యులు లేరు.. మహిళలు పొదుపు చేసుకున్న 1800 కోట్ల అభయహస్తం నిధులు ఇవ్వలేదు.. పావలా వడ్డీ ఇవ్వలేదు. మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన రూ. 3700 కోట్ల వడ్డీలు చెల్లించలేదని సీతక్క ఆరోపించారు. తెలంగాణను బీఆర్ఎస్ సర్కారు సస్యశ్యామలం చేస్తే.. రైతులు ఎందుకు ఇబ్బందులు పడ్డారని మంత్రి ప్రశ్నించారు. తాము పంట కాలువలు మూసివేసినట్లుగా బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఇష్టానుసారం ఎస్టిమేషన్స్ పెంచి దోచుకున్నారిన ఆరోపించారు. మీరు నోటిఫికేషన్లు వేస్తే నియామకాలు ఎవరు అడ్డుకున్నారని కవితను మంత్రి ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో తాము చేస్తున్నామని.. అధికారంలోకి వచ్చిన తర్వాత 59 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. పదేళ్లలో పేదలకు ఎన్ని ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. ప్రజలకు ఏం చేయలేదనే వారు తమను అధికారంలోకి కూర్చోబెట్టారని మంత్రి సీతక్క అన్నారు. తాము అధికారంలోకి వచ్చి 15 నెలలే అయిందని.. అప్పుడే అన్నీ అయిపోవాలంటూ అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పేర్లను పథకాలకు పెడితే తప్పేంటని కవితను సీతక్క ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఉద్యోగ భృఇస్తామని ఇవ్వలేదు.. ఇలా అనేక హామీలను తుంగలో తొక్కింది బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేయలేదని బీఆర్ఎస్ పార్టీపై మండిపడ్డారు. ఇలాంటి మీరు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదంటూ హితవు పలికారు.

**బడ్జెపై మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన...**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు శాసనమండలి ఆవరణలో వినూత్న నిరసన తెలిపారు. అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం అంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేశారు. అప్పులు ఆకాశంలో, అభివృద్ధి పాతాళంలో అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. రూ లక్ష 58 వేల కోట్ల అప్పు చేసి ఎంతమంది మహిళలకు రూ.2500 ఇచ్చారని ప్రశ్నించారు. రూ.లక్ష 58 వేల కోట్ల అప్పు చేసి ఎంతమంది వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారన్నారు. ఎంత మంది ఆడపిల్లలకు స్కూటీలు ఇచ్చారని, తులం బంగారం ఎంతమందికి ఇచ్చారని నినదించారు. 15 నెలల్లో రూ.1.58 లక్షల కోట్లు అప్పుచేసినా అభిమాత్రం సున్నా అని విమర్శించారు.

అనంతరం మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. శాసనమండలిలో ప్రశ్నోత్తరాలు రద్దు చేయడం ఖండిస్తున్నామన్నారు. సభలో ప్రజల సమస్యలు చర్చించడం లేదని, కేవలం బిల్లులు ప్రవేశపెట్టడం పాస్ చేయించుకోవడమే జరుగుతున్నదని మండిపడ్డారు. ప్రశ్నోత్తరాల వల్ల ప్రజల సమస్యలు సభ దృష్టికి వచ్చేవన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తూతూ మంత్రంగా సభను నడిపిస్తున్నరని, పనిగంటలు తగ్గించారన్నారు. సభలో చర్చించే అవకాశం లేకున్నా ప్రజా క్షేత్రంలో పోరాడుతామని స్పష్టం చేశారు.

15 నెలలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష 58 వేల కోట్ల అప్పు చేశామని చెబుతున్నారని, 9 ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు కేవలం 4 లక్షల 17 వేల కోట్లు అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. రేవంత్ రెడ్డి 15 నెలల్లోనే లక్ష 58 వేల కోట్ల అప్పు చేశారని, పదే పదే ప్రజల్లో కేసీఆర్‌ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది సభను, ప్రజలను తప్పు పట్టించడమేమనని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రతి అప్పుకు కరెక్ట్ లెక్కలు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, ఖర్చులపై శ్వేతపత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై ప్రభుత్వం చేసిన అప్పులను ఎండగడుతామన్నారు.

## జడ్జి గారింట్లో బయట పడ్డ నోట్ల కట్టలు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్పేందుకు వెళ్లిన అగ్నిమాపక సిబ్బందికి అక్కడ భారీఎత్తున డబ్బు కనిపించింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటన గురించి.. ఈ నెల 14వ తేదీన అగ్ని ప్రమాదం జరగడంతో ఆయన కుటుంబసభ్యులు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు ఫోన్ చేశారు. వారు వచ్చి అగ్నికీలలను ఆర్పేశాక.. అక్కడ భారీఎత్తున నోట్ల కట్టలు కనిపించాయి. దీంతో ఉన్నతాధికారులొచ్చి వాటిని స్వాధీనం చేసుకొన్నారు. అది మొత్తం లెక్కల్లో చూపని నగదుగా గుర్తించారు. ఈ విషయం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నాకు విషయం తెలియడంతో దీన్ని తీవ్రంగా పరిగణించి వెంటనే కొలీజియం సమావేశం ఏర్పాటుచేశారు. జస్టిస్ వర్మను అలహాబాద్ కు బదిలీ చేయాలని కొలీజియం నిర్ణయించింది. గతంలో అక్కడే పనిచేసి జస్టిస్ వర్మ 2021లో బదిలీపై ఢిల్లీ హైకోర్టుకు వచ్చారు.ఐదుగురు సభ్యులున్న కొలీజియంలో కొందరు జస్టిస్ వర్మ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించారు. కేవలం బదిలీతోనే న్యాయశాఖ ఇమేజ్ తిరిగిరాదన్న అభిప్రాయం వ్యక్తంచేశారు. ఆయన్ను రాజీనామా చేయాలని కోరడమో లేదా సీజేఐ అంతర్గత విచారణ చేపట్టడమో చేయాలని అభిప్రాయ పడ్డారు. ఈ సంచలనోదంతం నేపథ్యంలో 2008 ఆగస్టు 13వ తేదీన జరిగిన ఘటన ఒకటి చర్చల్లోకి వచ్చింది. నాటి పంజాబ్-హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్జిత్ కౌర్ ఇంటి ఎదుట రూ.15 లక్షల నోట్లు ఉన్న బాక్సును కొందరు వ్యక్తులుంచారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆ తర్వాత ఈ కేసును సీబీఐకు అప్పగించారు. దర్యాప్తు అనంతరం 2011 మార్చిలో ఉత్తరాఖండ్ హైకోర్ట్ జడ్జి జస్టిస్ నిర్మల్ యాదవ్ పై అభియోగాలు నమోదు చేశారు. ఓ కేసులో తీర్పు నిమిత్తం నిర్మల్ యాదవ్ కు ఇవ్వాల్సిన డబ్బును పొరబాటున జస్టిస్ నిర్మల్జిత్ కౌర్ ఇంటి వద్ద పెట్టినట్లు తేలింది.

## వడగండ్ల వాన



(మొదటి పేజీ తరువాయి)

రోజుల్లో కూడా పలు జిల్లాల్లో వడగండ్ల వాన కురిసే అవకాశముంది. నేడు, రేపు మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడా వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలాఉంటే, ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

### ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చూడాలె

**అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**

ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఈదురుగాలులు, వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయా జిల్లాల్లో అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలనీ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ, ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

## అత్యాచారంపై తప్పుడు తీర్పు

**ఢిల్లీ,మార్చి 21:** అత్యాచార కేసు విచారణ సందర్భంగా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి ఖండించారు. మహిళ ఛాతిని పట్టుకుని ఆమె పైజామా బొందు లాగి తెంచేయడం అత్యాచారం లేదా అత్యాచార యత్నం కాదంటూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా ఇచ్చిన తీర్పును కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె ఇది తప్పుడు తీర్పని అన్నారు. ఆ తీర్పు సమ్మతం కాదని పేర్కొన్నారు. దానిని పరిశీలించాలని సుప్రీంకోర్టును కోరారు. ఇలాంటి తీర్పు సమాజానికి తప్పుడు సందేశాన్ని పంపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు గమనించాలని ఆమె కోరారు.2021 నవంబరు నాటి లైంగిక వేధింపుల కేసు ఇది. ఉత్తరప్రదేశ్‌లోని కసగంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ, తన 11 ఏళ్ల (ఘటన జరిగే నాటికి) కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగివస్తుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వారిని సమీపించారు. బాలికను ఇంటి దగ్గర దింపుతామని నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో ఆ యువకులు అమ్మాయిపై అత్యాచారానికి యత్నించారు. ఆమెను అసభ్యంగా తాకుతూ వేధింపులకు గురిచేశారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్నవారు రావడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.

చట్టానికి సంబంధించి ఓనమాలైనా తెలుసా?



విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో నిందితులపై కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసు అలహాబాద్ హైకోర్టుకు చేరింది. ఇటీవల దీనిపై విచారణ జరిపిన జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. మహిళ ఛాతీని తాకినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదంటూ నిందితులకు అనుకూలంగా తీర్పు వెలువరించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి స్పందించారు. కాగా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఇచ్చిన ఈ వివాదస్పద తీర్పుపై పలు పార్టీలకు చెందిన మహిళా ఎంపీలు, నాయకురాళ్లు స్పందించారు. 'చాలా దురదృష్టకరం. తీర్పులో చేసిన వ్యాఖ్యల పట్ల నేను చాలా దిగ్భ్రాంతికి గురయ్యా. ఇది చాలా అవమానకరమైన దృష్టాంతం. ఆ వ్యక్తులు చేసిన చర్యను అత్యాచారానికి పాల్పడే చర్యగా ఎందుకు పరిగణించడం లేదు? ఈ తీర్పు వెనుక ఉన్న లాజిక్ నాకు అర్థం కావడం లేదు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది' అని ఆప్ ఎంపీ, ఢిల్లీ మహిళా కమిషన్ మాజీ చీఫ్ స్వాతి మలివాల్ అన్నారు. మరోవైపు దేశంలో మహిళలను పూర్తిగా నిర్లక్ష్యం చేసే విధానం చాలా అసహ్యంగా ఉందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ జూన్ మాలియా విమర్శించారు. దీనిని మనం అధిగమించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ మహిళా న్యాయవాది ఇందిరా జైసింగ్ కూడా ఈ తీర్పుపై స్పందించారు. సుప్రీంకోర్టు సుమోటోగా దీనిని స్వీకరించాలని ఆమె కోరారు.

## అమెరికా విద్యాశాఖ మూసివేత

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించుకున్నాం' అని పేర్కొన్నారు. అయితే, విద్యార్థుల ఫీజుల రాయితీలు, కొన్ని ముఖ్యమైన పథకాలను కొనసాగిస్తామన్నారు. ఇక, ఈ చర్యను డెమోక్రట్లు తీవ్రంగా విమర్శించారు. ట్రంప్ తీసుకున్న అత్యంత విధ్వంసకర, వినాశకరమైన చర్యల్లో ఇది ఒకటిగా వారు పేర్కొన్నారు.

ఇక, విద్యాశాఖ అధికారాలను తిరిగి రాష్ట్రాలకు అప్పగించే అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు విద్యాశాఖ మంత్రి లిండా మెక్మాన్ తెలిపారు. అదే సమయంలో దేశ ప్రజలకు అందుతోన్న సేవల్లో ఎక్కడా అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు.

అమెరికా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తానని అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. దానిలోభాగంగా ఆ శాఖలోని సిబ్బందిలో సగం మందిని తొలగించే ప్రయత్నాల్లో ఉన్నామని గతంలోనే ప్రభుత్వం తెలిపింది. విద్యాశాఖ మంత్రిగా లిండా మెక్మాన్ బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజుల్లోనే ఆ పని మొదలుపెట్టారు. ''ట్రంప్ నాకు ఇచ్చిన ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. విద్యాశాఖను మూసివేసేందుకు మేం కాంగ్రెస్ తో కలిసి పనిచేయాల్సి ఉంటుందని తెలుసు. కానీ ఇప్పుడు తీసుకున్న నిర్ణయం అవసరానికి మించి ఉన్నవారిపై కత్తెరవేయడం కిందికే వస్తుంది'' అని లిండా ఇటీవల పేర్కొన్నారు. విద్యాశాఖను తొలగించి, దానిని రాష్ట్రాలకు అప్పగిస్తానని చెప్పారు. ట్రంప్ బాధ్యతలు స్వీకరించే నాటికి విద్యాశాఖలో 4,100 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో 600 మంది స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయడానికి ముందుకొచ్చారు. కాగా, ఇప్పుడు మొత్తం అందరూ ఇంటికి పోవాల్సిన పరిస్థితి వచ్చింది.

## తక్కువ వడ్డీకి రుణాలివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

గోడౌన్స్, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి రాష్ట్రంలో మిల్లింగ్ కెపాసిటీని పెంచేందుకు సహకరించాలనీ, ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు స్కీమ్స్ నిధులు మార్చ్ 31లోగా ఉపయోగించుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. నాబార్డు పరిధిలోని స్కీములన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువ ఉపయోగించుకోవాలనీ, స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్ల నిర్వహణను నాబార్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. కొత్త గ్రామ పంచాయతీలకు రూరల్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## తండ్రి హత్య కేసులో కూతురు పిటిషన్

- **నాలుగేళ్లుగా కేసు విచారణ.. పురోగతి లేదు?**
- **తదుపరి విచారణ 4 వారాలకు కోర్టు వాయిదా**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో ఆయన కూతురు సునీత పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో ఆమె సీబీఐని ప్రతివాదిగా చేర్చారు. సీబీఐ కోర్టులో తన తండ్రి హత్య కేసును రోజువారీగా విచారించేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇప్పటికే దాదాపు నాలుగేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతున్నప్పటికీ పురోగతి ఏమీ లేదని, సునీత ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో విచారణ సందర్భంగా సునీత తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. 2019 మార్చి 14వ తేదీ అర్ధరాత్రి హత్య జరిగిందని, విచారణ జరిపిన సీబీఐ అధికారులు ఇప్పటికే రెండు ఛార్జీషీట్లు దాఖలు చేశారని పేర్కొన్నారు. సీబీఐ కోర్టులో విచారణ కొనసాగుతోందని, దీనిని ఆరు నెలల్లో ముగించేలా కోర్టును ఆదేశించాలని కోరారు. సీబీఐ అధికారులు హార్డ్ డిస్క్‌లను ప్రతివాదులకు ఇచ్చారని, అవి తెరుచుకోవడం లేదని, దీంతో పదిహేను నెలలుగా విచారణ ముందుకు సాగడం లేదని హైకోర్టుకు తెలిపారు. సునీత ప్రధానంగా సీబీఐ అధికారులతో పాటు తన తండ్రి హత్య కేసులో నిందితులుగా ఉన్నవారందరినీ ప్రతివాదులుగా చేర్చారు.

# గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల ప్రదానం

- తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

కాప్రా, మార్చి 21 (మనం న్యూస్): సికింద్రాబాద్, జవహర్ నగర్, ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (ఏ సి డి ఎస్) తన బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (బిడిఎస్), మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (ఎండీఎస్) విద్యార్థుల కోసం 19వ గ్రాడ్యుయేషన్ వేడుకను నిర్వహించింది. విద్యార్థులు ముఖ్య అతిథిగా, తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ నుండి డిగ్రీలను అందుకున్నారు. అధికారికంగా ప్రొఫెషనల్ డెంటల్ కమ్యూనిటీలోకి స్వాగతం పలికారు. ఈ వేడుకలో అధ్యాపకులు, విశిష్ట అతిథులు, గ్రాడ్యుయేట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు. తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా (టి ఏ ఎస్ ఏ) జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జి ఓసి), ఏ సి డి ఎస్ చైర్మన్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా గ్రాడ్యుయేట్లను వారి విద్యా విజయాలు, దంత వృత్తికి అర్థవంతంగా దోహద




పడటానికి వారి సంసిద్ధతను ప్రశంసించారు. ఏ సి డి ఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమతా కౌశిక్ కళాశాల నివేదికను సమర్పించారు, కళాశాల యొక్క శ్రేష్ఠత వారసత్వాన్ని, దంతవైద్య రంగంలో భవిష్యత్ నాయకులను రూపొందించడంలో దాని కీలక పాత్రను నొక్కి చెప్పారు. దంత విద్యలో చాలా కాలంగా అత్యుత్తమ ప్రతిభకు దారితీసింది, దేశంలోని అగ్ర దంత కళాశాలలలో ఒకటిగా నాక్ 'ఎ' గ్రేడ్ గుర్తింపుతో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్లో స్థిరంగా స్థానం సంపాదించిన జంట నగరాల్లోని ఏకైక కళాశాల ఇది అని అన్నారు. సేవ పట్ల బలమైన నిబద్ధతతో, సమాజం యొక్క ఆరోగ్యం, శ్రేయస్సును పెంపొందించడం ద్వారా అర్థవంతమైన ప్రభావాన్ని చూపుతూనే ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాపరంగా, పాఠ్యేతర కార్యకలాపాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, పతకాల ప్రదానం కూడా జరిగింది, మొత్తం మీద ఉత్తమ ఎండీఎస్ విద్యార్థిగా 'పాట్రన్స్ రోలింగ్ ట్రోఫీ, దక్షిణ్ భారత్ ఏరియా'ను పీరియాడోంటిక్స్ విభాగం నుండి డాక్టర్ సురభి భదౌరియాకు ప్రదానం చేశారు. ఉత్తమ ఆల్ రౌండ్ విద్యార్థిగా డాక్టర్ టెరెస్సా గ్రెగొరీ 'చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీ'ని, విద్యాశాస్త్రంలో ఉత్తమ బీడీఎస్ విద్యార్థిగా డాక్టర్ సారా రహీల్ 'జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ రోలింగ్ ట్రోఫీ'ని అందుకున్నారు.

# పెళ్లి బరాత్‌లో ఘర్షణ

- ఓ యువకుడికి కత్తిపోట్లు
- అసుపత్రికి తరలింపు
- హబీబ్ నగర్ పీఎస్‌లో కేసు నమోదు దర్యాప్తు చెపట్టిన పోలీసులు





హైదరాబాద్, మనం ప్రతినిధి : ఓ నూతన వధూవరుల జంట ఒక్కటవుతున్న వెళా.. ఓ వైపు బందువుల కళ్లలో ఆనందం.. మరోవైపు బంధుమిత్రుల సందడితో పెళ్లి ఇంట్లో సంబురాలు.. సంతోషంతో వారంతా డాన్సులు చేస్తున్న సందర్భం అది. ఉన్నట్టుండి ఓ దారినపోయే దానయ్య, వారితో.. తనకేం సంబందం లేకపోయిన, పెళ్లి జరుగుతున్న ఇంటికి చేరుకోని అసభ్యకరంగా ప్రవర్తించసాగాడు. అంతటితో అగకుండ.. అక్కడ నిల్చున్న, బరాత్‌లో డాన్సులు చేస్తున్న మహిళలను అసభ్యకరంగా చిత్రికరిస్తున్నారు. ఇది గమనించిన బంధువొకరు, అసలు నీవు ఎవరు? ఎందుకు రికార్డు చేస్తున్నావు? అసభ్యకరంగా ఉన్న ఫోటోలు, అభ్యంతకరంగా ఉన్న ఫోటోలు ఎందుకు తీస్తున్నావ్? అంటూ నిలదీశారు?. దీంతో పట్టరాని అవేశంతో పెళ్లి ఇంట్లో బంధువులతో గొడవకు దిగారు. అసభ్యకరంగా ప్రవర్తించాడు. చెప్పలేని పదజాలంతో బండ భూతులతో వారిని దూషిస్తూ.. నాన హంగామా సృష్టించాడు. మీ అంతు చూస్తా? నేనేవరో తెలియదా? నా పేరు వింటేనే కాలనీలో హడల్ అంటూ?.. బెదిరించసాగాడు. అక్కడే ఉన్న ఓ యువకుడు ఎయ్.. ముందు నీవు ఫోన్ బంద్ చేయ్ అని గట్టిగా వారించడంతో.. పట్టరాని కోపంతో ఒక్కసారిగా అగ్రహవేశానికి లోనైన అ గుర్తు తెలియని వ్యక్తి.. పెళ్లి మండపానికి సమీపంలోని తన ఇంటికేళ్లి కత్తి తీసుకొని వచ్చి గొడవకు దిగారు. అడ్డువచ్చిన బంధువులపైకి మీద మీదకి వెళ్లారు. అంతకుముందు తనను నిలవరించే ప్రయత్నం చేసిన గౌతమ్ అనే యువకుడిపై.. కత్తితో దాడికి దిగారు. దీంతో గౌతమ్‌కు తీవ్రగాయలయ్యాయి. వేంటనే దాడీలో గాయపడ్డ వ్యక్తిని హుటహుటిన నాంపల్లి కేర్ అసుపత్రికి తరలించారు. స్కానింగులు, ఎంఎలేసీ చేశాక.. గాయపడిన యువకుడికి డాక్టర్లు చికిత్స అందించారు. దాడీ వార్త దావనంలా వ్యాపించడంతో దాడీకి పాల్పడిన వ్యక్తిని రాజేందర్‌గా గుర్తించినట్లు కాలనీకి చేందిన కొందరు చెప్పారు. భాదితుని తరపునా బందువులంతా వెళ్లి.. హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడీ చేసిన వ్యక్తి గురించి పోలీసులకు సమాచారం అందించారు. అయితే, దాడీకీ పాల్పడిన రాజేందర్ పచ్చి త్రాగుబోతు అని అదే కాలనీలో నివాసం ఉంటారని, అతను జులాయిగా తిరుగుతారని, గంజాయి సేవిస్తారని అక్కడి స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు. మధ్యం, గంజాయి మత్తులో గత కొంత కాలంగా నిత్యం ఇలాంటి దారుణాలకే దిగుతున్నారని కాలనీ వాసులు సైతం చేప్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పోలీసులు అటువైపుగా రాలేదని, కనీసం కన్నేత్తి కూడా చూడలేదని అకతాయిలపై దృష్టి సారించలేదని స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు. దాడీకి పాల్పడిని దుండగుడు రాజేందర్‌పై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని, అమాయక యువతి, యువకులతో పాటు కాలనీలో ప్రశాంత వాతవరణం నెలకొల్పే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గౌతమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చెపట్టినట్లు హబీబ్ నగర్ పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు.

## జీతాలు చెల్లించాలంటూ కాంట్రాక్టర్ కార్యాలయం ముందు ధర్నా



రంగారెడ్డి, మార్చి 21 (మనం న్యూస్): తమకు రావలసిన 3 నెలల జీతాలు చెల్లించాలంటు కర్మన్ ఘాట్ గాయత్రి నగర్ లోని కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి కార్యాలయం ముందు శుక్రవారం ఎల్బీనగర్ జోన్ పరిధిలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ స్ట్రీట్ లైట్స్ ఎలక్ట్రీషియన్స్, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే హైదరాబాద్ నగరం లో బతికేది ఎలా అని అన్నారు. ఇదే విషయంపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. వెంటనే జీతాలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, రాజు, రవి, సత్యం, శేఖర్ ,రవి శ్రీను, కుమార్, శ్రీనివాస్, 40 మంది ఎలక్ట్రీషియన్స్, హెల్పర్లు పాల్గొన్నారు.

# ఫార్చ్యూన్ టయోటా కార్స్ గ్రామీణ మహోత్సవం షోరూం

- ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి



రంగారెడ్డి,మార్చి 21( మనం న్యూస్): నాగార్జున కాలనీ,రాగన్న గూడ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రక్కన మార్చి 21, 22,వ తేదీలో ఉగాది, రంజాన్ పండగ శుభాకాంక్షల సందర్భంగా ఆఫర్లో ఫార్చ్యూన్ టయోటా కార్స్ గ్రామీణ మహోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఓపెన్ చేశారు. ఫార్చ్యూన్, టయోటా, షోరూం షేర్ గూడ, నాగారం బ్రాంచ్ జనరల్ మేనేజర్ మధుసూదన్ మాట్లాడుతూ, ఇందులో కొత్త కార్ డిస్ప్లే గ్లాంజా, టైసర్, రూమియన్, హైర్డర్, ఇన్నోవా మరియు ఎక్స్చేంజ్ మేళా, సర్వీస్ క్యాంపు ఉంటుందని వారు అన్నారు. ఈ రెండు రోజులలో స్పాట్ బుకింగ్స్లో ఆఫర్లో కస్టమర్లు 1 లక్ష 40 వేల రూపాయలు ప్రయోజనాలను పొందవచ్చని అన్నారు. ఈ రెండు రోజులలో స్పాట్ బుకింగ్ చేసుకున్న వారు అదనంగా పదివేల రూపాయలు డిస్కౌంట్ పొందుతారు. టయోటా కార్ల ఎక్స్‌రూమ్ ధర 6.86 లక్షల నుండి ప్రారంభమవుతుంది. కార్ల కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త కుర్మ శివకుమార్, టిపిసిసి సభ్యులు కాకుమాను సునీల్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్, సీనియర్ నాయకులు, కుంట గోపాల్ రెడ్డి, ధనరాజ్ గౌడ్, పుల్ల గుర్రం విజయానంద రెడ్డి, మేతరి దర్శన్, ఫార్చ్యూన్ టయోటా వైస్ ప్రెసిడెంట్ రమణ, జనరల్ మేనేజర్ మధుసూదన్, మార్కెటింగ్ హెడ్ శైలేందర్, మార్కెటింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఆరోగ్య ప్రదాయిని
# ముఖ్యమంత్రి సహాయనిధి



- చిలుక ఉపేందర్ రెడ్డి

రంగారెడ్డి, మార్చి 21 (మనం న్యూస్): పేద ప్రజలకు ఆరోగ్య ప్రదాయిని ముఖ్యమంత్రి సహాయనిధి అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజక వర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కి చెందిన ఆలుకొండ అంజలి గత కొన్ని రోజులు క్రితం అనారోగ్యం కారణంగా ప్రవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకోని కోలుకున్నది. ప్రజా ప్రభుత్వంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ భాధ్యులు కిచ్చెన్నగారి లక్ష్మా రెడ్డి సౌజన్యంతో, టి పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 60000 వేల రూపాయల చెక్కును వారికి అందచేశారు. ఈ సందర్భంగా చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసానిస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఓ వరం లాంటిదని, ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ పగడాల శ్రీశైలం, పెద్దవూర సైదులు, రేణుక, లింగ స్వామి, జయశ్రీ, పగడాల ఏల్లన్న, పగిళ్ళ అంజి, సంతోష్, శ్వేత, ప్రశాంత్, వసుదేవుల నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# బీ.ఆర్.ఎస్ మార్నింగ్ వాక్



గండిపేట, మార్చి 21(మనంన్యూస్): బీఆర్ఎస్ మార్నింగ్ వాక్‌లో భాగంగా శుక్రవారం పుప్పాలగుడా శ్రీ లక్ష్మినరసింహ స్వామి నగర్ వీదులలో ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనావాసాల మధ్యలో ఈ.ఐ.పీ.ఎల్ రెడీ మిక్స్ ప్లాంట్ నడుపుతున్న కారణంగా దుమ్ము, ధూళి, శబ్ద, వాయు కాలుశ్యాలతో చిన్నా పెద్దలు అనారోగ్య పాలవడం, నిద్ర లేమితో బాధపడుతూ ఇట్టి సమస్యల గురించి పలుమార్లు స్థానిక నాయకులకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నప్పటికీ స్పందన లేదని వాపోయారు. రెడీ మిక్స్ ప్లాంట్ లేబర్ క్యాంప్ గుడిసెలు వేసిన కారణంగా పుప్పాలగూడ గ్రామ స్మశాన వాటికకు పాత కాలం నుండి ఉన్న బండ్ల బాట కబ్జాకు గురి కావడం, స్వచ్చత పాటించక పోవడం, రాత్రి పూట అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు తెలిపారు. షేక్పేట్ నుంచి ఓ.ఆర్.ఆర్ సర్వీస్ రోడ్డు వరకు చేపట్ట వలసిన రేడియేల్ రోడ్ (నెంబర్ 5) అసంపూర్తిగా ఉన్న కారణంగా మణికొండ ప్రజానీకం తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నారని కావున హెచ్.ఎం.డి.ఏ అధికారులు ఈ రోడ్డు పనిని త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీకి మంచినీరు నిర్ణీత సమయంలో రాకుండా, వచ్చినా అరగంట నుంచి 45 నిమిషాలు రావడం వలన సరిపోవడం లేదని తెలియ పరచారు. ఇక్కడ దాదాపు 70 నుంచి 80 వీధి కుక్కల కారణంగా పిల్లలు పెద్దల్లు చాలా ఇబ్బంది పడుతున్నారు కాబట్టి మున్సిపాలిటీ వారు సత్వరమే స్పందించి వీధి శునకాలకు షెల్టర్ హోమ్స్ ఏర్పాటు చేయ వలసిందిగా కోరడమైనది. రహదారులకు మున్సిపాలిటీ ప్యాచ్ వర్క్ చేయించని కారణంగా స్థానికులే ప్యాచ్ వర్కు చేసినట్టు తెలిపారు. ఇక రోడ్డు లెవెల్ పాటించని కారణంగా వర్షాకాలంలో కొన్ని చోట్ల మోకాళ్ళ లోతు నీళ్లు నిలుస్తున్నవని చెప్పినారు. మున్సిపాలిటీ వారు రోడ్లు శుభ్రం చేసే కార్యక్రమం నెలకి మూడు లేక నాలుగు సార్లు మాత్రమే చేస్తున్నారని స్థానికులు తెలియజేశారు.కావున పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, హైదరాబాద్ వాటర్ వర్క్స్, హెచ్.ఎం.డి.ఏ మరియు మణికొండ మున్సిపాలిటీ అధికారులందరూ పై సమస్యలకు పరిష్కార దిశగా వెంటనే చర్యలు చేపట్టాలని మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేందర్నాధ్ రెడ్డి, సంగం శ్రీకాంత్, దిలీప్, కిరణ్ యాలాల, భాను చందర్, సుమనళిని, సుమన్, బొడ్డు శ్రీధర్, మహేందర్, తిరుపతి తదితరులుతెలిపారు.

## తాగునీటి సరఫరాను పెంచాలి


MANIKONDA QUARTERS
WEAKER SECTIONS COLONY
D.No.4-64/4, MANIKONDA - 500089

Dated the 21st March, 2025

To
The General Manager,
O AND M DIVISION 18,
HMWSSB Manikonda.

Respected Sir,

Sub: - Laying of 6 inches drinking water pipe line – Request – Regarding.

Thanking you,

Yours sincerely,

గండిపేట, మార్చి 21(మనంన్యూస్): ప్రజా ప్రయోగార్థం పాత లైన్ స్థానంలో కొత్తగా 6 లేదా 8 ఇంచీల పైప్ లైన్ వేసి నీటి సరఫరా పెంచాలని స్థానికులు భాను చందర్, హుస్సేన్, దీపక్ సింగ్, భరత్, దిపక్, సంగం శ్రీకాంత్‌లు కోరారు. ఈ విషయమై మణికొండ జలమండలి 18 వ డివిజన్ అధికారిని కలసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణికొండ మునిసిపాలిటీ ప్రథమంగా ఉన్న ఆ ప్రాంతంలో 1987 వ సంవత్సరంలో నందమూరి తారక రామారావు కరకమలములచే మధ్యతరగతి ప్రజలకు 90 గజాల వైశాల్యం గల ప్లాట్ లను వితరణ చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆ చిన్నపాటి స్థలంలో మధ్య తరగతి కుటుంబ సభ్యుల సంఖ్యా పరంగా పెరుగుతూ వచ్చినను త్రాగు నీటి సరఫరాకు ఎప్పుడో పాత కాలంలో వేసిన 4 ఇంచిలా పైప్ లైన్ ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదని ఆయనకు వివరించారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



చేవెళ్ల , మార్చి 21(మనం న్యూస్): చేవెళ్ల లోని కేవిఆర్ గ్రౌండ్లో గత రెండు వారాల నుంచి నిర్వహించిన క్రికెట్ టోర్న మెంటు శుక్రవారంతో ముగిసింది. ఈ టోర్నమెంటులో ఫైనల్లో రామన్నగూడ - ఊరేళ్ల జట్లు తలపడగా ఊరెళ్ల జట్టు విజేతగా నిలిచింది. దీంతో ఊరేళ్ల జట్టుకు రూ.50వేలు, రామన్నగూడ జట్టుకు రూ. 25వేలు నగదు, ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అందజేశారు. అలాగే ప్రతిభ కనబరిచిన క్రీడా కారులకు మెడల్స్, ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ.... చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. టోర్నమెంటు నిర్వాహకుడు పెద్దోళ్ల దయాకర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి శివ ప్రసాద్, భాజపా నాయకులు వెంకట్ రెడ్డి, వైభవ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఊరేళ్ళ గ్రామం మాజీ సర్పంచ్లు జహంగీర్, నర్సింలు, బారాస మండల అధ్యక్షులు ప్రభాకర్ నాయకులు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతో ఉపయోగం

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



రంగారెడ్డి, మార్చి 21 (మనం న్యూస్): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఎంతో ఉపయోగమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ గణేష్ పురి కాలనీ కి చెందిన గౌరవ్ గౌడ్(24) గత కొన్ని రోజులుగా వెన్నుముక సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి కుటుంబసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ని సంప్రదించడం జరిగింది.స్పందించిన సుదీర్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వారి కుటుంబసభ్యులకు ఎల్.ఓ.సీ(లెటర్ ఆఫ్ క్రెడిట్) క్రింద 2,00,000(రెండు లక్షల రూపాయలు)మంజూరు చేయించారు.ఈ సందర్భంగా మంజూరు పత్రాన్ని సుదీర్ రెడ్డి చేతులమీదుగా బాధిత తల్లి సంధ్య కి అందజేశారు. కార్యక్రమంలో బి అర్ ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## రాజభూపాల్ గౌడ్ కి సన్మానం

గండిపేట, మార్చి 21(మనంన్యూస్): రంగారెడ్డి జిల్లా (రూరల్) భారతీయ జనతా పార్టీ నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు కొండకల్ నరేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ సి.బిరప్ప, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జే సిద్దప్ప, భారతీయ జనతా పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు బి రవి కాంత్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ కందుల శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు జి వినోద్, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బీ శివ కుమార్, మున్సిపాలిటీ కార్యదర్శి ఈ నర్సింగరావు, డి రాజేష్, మధు ఓర్స్, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# డీఎస్సీలో ఎంపికైన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ కి సన్మానం

హైదరాబాద్, మార్చి 21(మనంన్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా అందరూ ఐఈఆర్పిలు కలిసి నూతన డీఎస్సీలో ఎంపికైన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ కి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఐఈ కోఆర్డినేటర్ పెసర లింగారెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాలో నూతన జిల్లా కమిటీ తెలంగాణ ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ గా జిల్లా గౌరవ అధ్యక్షులు రామచంద్ర , జిల్లా ప్రధాన కార్యదర్శులుగా కాపర్తి సుజాత , స్టేట్ కమిటీ మెంబర్స్ సుధామణి , సంధ్యారాణి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# అందాల పోటీలు కాదు ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- మాజీ చైర్మన్ దేవి ప్రసాద్ రావు



రంగారెడ్డి మార్చి 21 (మనం న్యూస్): దేశ వ్యాప్తంగా మహిళలు అందాల పోటీలకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటాలు చేసిన సంగతి కాంగ్రెస్ కు తెలియదా అని మొదలు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలి అని బెవరజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాదరావు అన్నారు. శుక్రవారం అయిన మాట్లాడుతూ కారుణ్య నియామకాల సందర్భంగా రవీంద్ర భారతి లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగం బీ ఆర్ ఎస్ పార్టీపై విష ప్రచారం చేయడానికి ఉపయోగించుకోవడం దుర్మార్గం అని అన్నారు .ప్రపంచ అందాల పోటీలు వద్దంటే ప్రభుత్వం ఎందుకు బీ ఆర్ ఎస్ పై ఎదురు దాడి చేస్తోంది. టూరిజం పేర ఎలాంటి అశ్లీల కార్యక్రమాలకైనా అనుమతి ఇస్తారా? మహిళల పక్షాన బాధ్యత గల ప్రతిపక్షం గా ప్రశ్నిస్తే ఎదురు దాడి చేస్తారా అని అన్నారు.నూతనంగా ఉద్యోగంలో చేరుతున్న కారుణ్య ఉద్యోగులకు బాధ్యతలు, తెలంగాణ సంస్క ృతి తో పాటు పని సంస్క ృతి గురించి, తెలంగాణ సామాజిక జీవన విధానం, అసమానతలు, జరిగిన సామాజిక ఉద్యమాల చరిత్ర అవగాహన కల్పిస్తే బాగుండును అన్నారు. బీ ఆర్ ఎస్ పై రాజకీయ విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం. రాష్ట్రం లో 3/24 నుండే ఉద్యోగుల రిటైర్ మెంట్ ప్రారంభమైంది, పెన్షనర్స్ కు ప్రభుత్వం ఇచ్చే ప్రయోజనాలు గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిందని చెప్పడం అవగాహన రాహిత్యం, పాలన పై పట్టు కాదు ప్రజల పట్ల గౌరవం ఉండాలి. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే కేటీఆర్ హరీష్ రావు ను బెదిరించడం ఏడవ గ్యారెంటీ హామీ అమలు చేయడమే ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టడమే,952 నూతనంగా ఉద్యోగాలు కల్పించడం స్వాగతిస్తాం కానీ ప్రభుత్వ కార్యక్రమాలలో రాజకీయ ఉపన్యాసాలు ఇచ్చి రాష్ట్ర భవిష్యత్ కోసం నిరంతరం కృషి చేసే యువ ఉద్యోగుల మనసులు కలుషితం చేస్తే ఊరుకోము. ఇప్పటికే 8000 కోట్లు పెన్షనర్స్ కు పెండింగ్ లో ఉండగా మరో పదివేలు రిటైర్ మెంట్ అవుతున్నారు. వారికి ఇవ్వలిసిన 8000 కోట్లు ప్రతి నెల 300 కోట్లు చెల్లిస్తే ఎన్ని ఏండ్లు చెల్లిస్తారు, ఇప్పటికే అనేక మంది ఉద్యోగులు కోర్ట్ లో న్యాయం కోసం ఆశ్రయిస్తున్నారు. చివరికి వారికి ఇవ్వలిసిన ప్రయోజనాల కోసం కార్యాలయాలు వేలం వేసే రోజులు వస్తాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పి ఆర్ సి ఎగ్గొట్టే పనిలో ప్రభుత్వం ఇలాంటి ప్రచారానికి దిగడం సరికాదు. కరువు భత్యం కూడా ఇవ్వని ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగుల సమస్యల పై దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం.

## మనసే.... కవిత్వం..!!



అక్షరం జ్వలించే దీపిక
నా భావం అందులో ప్రతీక
నిరంతర ప్రవాహం గీతిక
నా మనసు నివేదన వేదిక...!!

కవితల విత్తనాలను జల్లి
నేలమ్మ ఋణం తీర్చుకుంటా
అక్షర చుక్కను నింగికి విసిరి
కవిత వర్షమును కురిపిస్తాను....!!

కన్నీటితో అక్షరాలను శుభ్రపరిచి
కాగితాలపై భద్ర పరుచుకుంటా
బావ చిత్రాలను మనోఫలకంపై గీసి
ఇంద్రధనస్సులో రంగులను అద్దుతాను..!!

షడ్రుచుల విందు భోజనం వండి
పాఠకుల మనోవికాసానికి రుచి చూపిస్తా
రసజ్ఞత కలిగిన వాక్యములతో
నవరసములు ఒలికించే ప్రయత్నం చేస్తా..!!

కంటితో చూసిన దృశ్యాలను
అక్షర రూపముతో చిత్రించి పంచుతా
పువ్వుల రెక్కల్లో దాగిన తేనెల కోసం
ఈగల ప్రతి హృదయం పై వాలిపోతా..

కమ్మని కవిత్వంతో అమ్మలా లాలించి
ఆప్యాయంగా చనుబాల రుచి చూపిస్తా
అమ్మ నేర్పిన కమ్మని మాటలతో
అందమైన అక్షర మాలలు అల్లు కుంటాను...!!

చైతన్యానికి సరికొత్త నిఘంటువు కోసం
మానవత్వానికి కొత్త పదం సృష్టిస్తా
అవసరమైతే అక్షర ప్రమిదలో ఇంధనమై
ఒంట్లో రక్తం ఉన్నంతవరకు ధార పోస్తాను..!!

**- కొప్పుల ప్రసాద్**
9885066235

# నీటి సంక్షోభం తీరేదెన్నడో....!



భవిష్యత్తులో జరిగే యుద్ధాలు ఇతర దేశాల భూభాగాల కోసమో, అగ్రాధిపత్యం కోసమో జరగబోవు. జలం కోసం జనాన్ని చంపే రోజులు రాబోతున్నాయి.చుక్క నీటి కోసం పట్టపగలే చుక్కలు కనపడే కాలం రాబోతున్నది. గొంతు తడుపుకోవడం కోసం గొంతులు కోసే దుర్దినాలు రాబోతున్నాయి. జలం కోసం జనంలో హాహాకారాలు మిన్నంటే రోజులు దగ్గర పడ్డాయి. వివిధ దేశాల మధ్య, ప్రజల మధ్య,ప్రాంతాల మధ్య జల జగడాలు హోరెత్తి, భయనక పరిస్థితులు ఏర్పడ బోతున్నాయి. స్నానాలు మాని,రసాయనాలతో శరీరాలపై లేపనాలు పూసుకునే దుర్దినాలు దగ్గరలో ఉన్నాయి. పారిశ్రామిక,సాంకేతిక ప్రగతితో ముందుకు దూసుకు పోతూ, అంతరిక్షంలో విహరిస్తున్న మానవ ఆలోచనలు తరిగిపోతున్న జలసంపదను కాపాడలేక పోవడం విచారకరం. భూగోళాన్ని వదలి ఖగోళం వైపు దృష్టి సారించిన మానవ జీవులపై ప్రకృతి ప్రకోపించబోతున్నది. మానవ తప్పిదాలే మారణ హోమాలై, మానవాళిని మింగేయడానికి సంసిద్ధంగా ఉన్నాయి. జీవించడానికి అనుకూలమైన భూ గ్రహాన్ని నీరు లేకుండా చేసి నిర్జీవంగా మార్చే చర్యలతో యావత్ మానవ ప్రపంచం మూల్యం చెల్లించక తప్పని పరిస్థితులు భూమిపై తాండవిస్తున్నాయి. జనానికి జీవనాధారమైన జలాన్ని మాయం చేసి, భవిష్యత్తును శాసించాలని చేసే ప్రయత్నాలు భీతి గొల్పుతున్నాయి.ఈ సమస్త సృష్టి జలం అనే ఇంధనంతో ముడిపడి ఉంది. సకల జీవరాశుల మనుగడకు వివిధ రూపాల్లో నీరు అవసరం. మనిషి జీవించడానికి అత్యంత ఆవశ్యకం ప్రాణవాయువు. అలాంటి ప్రాణ వాయువును అందించే చెట్లు పచ్చదనంతో కళకళలాడాలంటే నీరు అవసరం. నీరు లేనిదే ప్రకృతిలో పచ్చదనానికి తావుండదు. పచ్చదనం లేనిదే ప్రాణి కోటి లేదు. కాలుష్యాన్ని హరించి,మనం పీల్చే గాలిని పరిశుభ్రంగా తయారు చేసే సహజ సిద్ధమైన యంత్రాంగం ప్రకృతిలోనే ఇమిడి ఉంది.ప్రకృతి లో పచ్చదనాన్ని పరిరక్షించి, వాతావరణ సమతుల్యతను కాపాడి మానవ అస్థిత్వాన్ని ఈ భూగోళంపై పదికాలాలపాటు నిలపాలంటే ప్రాణాధారమైన నీటి వనరులను కాపాడు కోవాలి.ఈ ప్రపంచాన్ని భవిష్యత్తులో శాసించేది ధనం కాదు' జలం'. జలం లేని జన జీవితాలు అల్లకల్లోలమై అలమటించక తప్పదు. ఇప్పటి వరకు ఈ సువిశాల ప్రపంచంలో రాజ్యాధికారం కోసం,సామ్రాజ్య విస్తరణ కోసం,పంతాలు పట్టింపుల కోసం,తమ పరాక్రమాన్ని ప్రదర్శించడం కోసం,తమ దేశం యొక్క గొప్పదనాన్ని చాటిచెప్పడం కోసం వీరత్వాన్ని ప్రదర్శించి,తమకున్న దేశ భక్తిని చాటుకోవడానికి ఎన్నో యుద్ధాలు జరిగాయి. జరుగుతున్నాయి. భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరిగే అవకాశాలున్నాయి. భూమండంలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ, నీటి వినియోగం సక్రమంగా లేకపోవడం వలన నీటి సమస్య ఏర్పడుతున్నది.భూ మండలంపై నీటి శాతం అధికంగా ఉన్నప్పటికీ ఇందులో కూడా 97 శాతం సముద్రాల్లో ఉప్పు నీటి రూపంలో ఉంది. భూమిపై ఉండే నీటిలో కేవలం మూడు శాతం మాత్రమే వివిధ రకాల అవసరాలకు పనికొస్తుంది. ఈ మూడు శాతం నీటిలో నిజంగా మనం వినియోగించడానికి అనువైన నీరు కేవలం ఒక శాతం మాత్రమే.భూతలంపై నాల్గింట మూడొంతుల నీటిని సముద్రాలు,సరస్సులు,నదులు ఆక్రమించాయి.భూమి అనేక విస్ఫోటనాల ఫలితంగా ఏర్పడిందని, భూమి ఏర్పడక ముందు ధూళితో కూడిన మేఘాలు ఉండేవని,భూమి ఏర్పడిన తర్వాతనే నీరు ఏర్పడిందనే వాదన ఉంది.నాలుగున్నర బిలియన్ల సంవత్సరాల క్రితం భూమి ఏర్పడిందని చెబుతారు. భూమి ఆవిర్భావ సమయంలో భూ ఉపరితలం అత్యంత వేడిని కలిగి ఉంది. ఆ తర్వాత అనేక సంవత్సరాల పాటు భూగోళం పై వర్షాలు పడి సముద్రాలు ఏర్పడ్డాయి.భూమిపై వాతావరణం ఏర్పడిన తర్వాత జీవరాశులు ఉద్భవించాయి. కంటికి కనిపించని క్రిముల నుండి జంతువుల వరకు జీవరాశుల ఆవిర్భావం జరిగింది.మొక్కల వలన పచ్చదనం ఏర్పడింది.ఇది వాతావరణ సమతుల్యతకు ఎంతగానే దోహదం చేసింది.పెరిగిన జనాభాకు,వారి అవసరాలకు నీరు అవసరం. నీరు లేకుండా ఈ ప్రపంచంలో మానవ అవసరాలు తీరవు.పట్టణీకరణ వలన, జీవన ప్రమాణాల మెరుగుదల వలన



పరిశుభ్రమైన నీటిని వినియోగించే వారు ప్రపంచంలో అధికంగా ఉన్నారు. ప్రపంచంలో చైనా,అమెరికా,బ్రెజిల్,రష్యా,మెక్సికో,భారత్,ఇంగ్లాండ్,ఫ్రాన్స్,కెనడా,ఆస్ట్రేలియా వంటి దేశాలు అధికంగా నీటిని ఉపయోగించే దేశాల జాబితాలో ఉన్నాయి. చైనా,అమెరికా దేశాలు రెండూ ఎక్కువ నీటిని వినియోగిస్తున్నాయి. దేశంలో అనేక నగరాలు తీవ్రమైన నీటి కొరత ఎదుర్కొంటున్నాయి. బెంగళూరు, చెన్నై, ముంబై, ఢిల్లీ వంటి నగరాలు అధిక నీటి కొరతను ఎదుర్కొనే జాబితాలో ఉన్నాయి.

వేగవంతమైన నగరీకరణ వలన ముంబై నగరం నీటి కొరతను ఎదుర్కొంటున్నది. ప్రత్యామ్నాయ నీటి వనరులను అన్వేషించక పోవడం వలన, నీటి నిర్వహణ సామర్థ్యం సరిగా లేక సరస్సులు ఎండిపోవడం వలన ముంబై నగరం నీటి ఎద్దడికి గురౌతున్నది. భవిష్యత్తులో ఈ నగరం మరింతగా నీటి కొరతను ఎదుర్కొనే అవకాశముంది. జైపూర్ లో జనాభా పెరుగుదల, వేగవంతమైన పారిశ్రామీకరణ వలన నీటి అవసరాలు పెరిగి పోయాయి. దీనివలన నీటి కొరత పెరిగి,భవిష్యత్తులో నీటి సంక్షోభం తీవ్ర స్థాయికి పెరిగే అవకాశముంది.లక్నోలో గొట్టపు బావుల ద్వారా అధిక మొత్తంలో భూగర్భ జలాలను తోడి నీటిని సరఫరా చేయడం జరుగుతున్నది. పెరుగుతున్న పట్టణీకరణ,నదులు,ఉపనదులు ఎండి పోవడం వంటి కారణాలు లక్నో నీటి సంక్షోభానికి మూలం.

చైన్నై నగరం గతంలో ఎన్నో నీటి సంక్షోభాలను చవిచూసింది. ఒకానొక దశలో 'సాంబారు' వాడకాన్ని కూడా మానుకోవాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం సూచించడం జరిగింది. అయితే గత కొద్ది సంవత్సరాలుగా చెన్నై నగరంలో కురిసిన భారీ వర్షాల వలన కొంత వరకు నీటి సమస్య తీరినప్పటికీ, విపరీతమైన పారిశ్రామీకరణ,పట్టణీకరణ వలన చైన్నై నగరం భవిష్యత్తులో తీవ్రమైన నీటి సమస్యను ఎదుర్కొనే రాష్ట్రాల్లో ముందుండే అవకాశముంది.ఢిల్లీలో యమునా నది నుండి, భూగర్భ జలాల నుండి నీటి సరఫరా జరుగుతున్నది. యమునా నది కాలుష్యభరితం కావడం,భూగర్భ జలాలు క్షీణించడం వలన రాబోయే కాలంలో ప్రతీ ఏటా ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలకు నీటి కష్టాలు తప్పడం లేదు.

హైదరాబాదు,ఢిల్లీ,చెన్నై,లక్నో వంటి నగరాలు నీటి కొరతను ఎదుర్కొనే జాబితాలో ఉన్నాయి. భూగర్భ జలాల క్షీణత వలన,విచ్చలవిడి నీటి వాడకం వలన రాబోయే రెండు దశాబ్దాల కాలంలో ఢిల్లీ,కోల్ కతా, ఇండోర్,అమృత్ సర్,విశాఖ పట్నం వంటి నగరాలు నీటి ఎద్దడికి గురికాబోతున్నాయని కొన్ని అంచనాలు సూచిస్తున్నాయి.దక్షిణాది రాష్ట్రాలన్నీ ఈ వేసవిలో తీవ్రనీటి సమస్యను ఎదుర్కోబోతున్నాయి. ఇప్పటికే నీటి సమస్య జఠిలంగా మారింది.వర్తమానం చవిచూస్తున్న త్రాగునీటి కొరత భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి. త్రాగు నీటికే ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో పంటలకు సరిపడా సాగు నీటిని అందించడం రాబోయే కాలంలో కష్టసాధ్యం కావచ్చు. ఇప్పటికే ప్రపంచంలోను, మన దేశంలో కూడా నీటి కోసం గొడవలు పడిన సందర్భాలను చూసాం.భవిష్యత్తులో నీటి కొరత కారణంగా జల జగడాలు ముదిరే అవకాశముంది.నీటి కొరత లేని కాలంలో రాష్ట్రాల మధ్య ఎలాంటి గొడవలు రావు.సాగునీటికి,త్రాగునీటికి ఇబ్బంది కలిగినప్పుడే రాష్ట్రాల మధ్య యుద్ధ వాతావరణాన్ని తలపించే విధంగా గొడవలు ఏర్పడుతున్నాయి.వివిధ రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకం విషయంలో తలెత్తే వివాదాల పరిష్కారం కోసం ఏర్పడిన ట్రిబ్యునల్స్ మరియు నదీ జలాల బోర్డులు నీటి సమస్యల పరిష్కారంలో త్వరితగతిన చొరవ చూపాలి.కర్నాటక, తమిళనాడు,కేరళ రాష్ట్రాల మధ్య ఏర్పడుతున్న కావేరి జలవివాదం,కేరళ, తమిళనాడు రాష్ట్రాల మధ్య పెరియార్ జలవివాదం,మహారాష్ట్ర,కర్ణాటక ఆంధ్రప్రదేశ్,తెలంగాణ మధ్య కృష్ణా నదీ జలాల సమస్యలు తలెత్తుతున్నాయి. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నాగార్జున సాగర్ ప్రాజెక్టు కేంద్ర బిందువుగా అప్పుడప్పుడూ కొన సాగుతున్న కృష్ణా జలాల వివాదాన్ని ఇరురాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం మరియు వాటర్ ట్రిబ్యునల్ సమన్వయంతో శాంతియుత వాతావరణంలో పరిష్కరించు కోవాలి.తమిళనాడు,కేరళ,కర్ణాటక రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతానికి విస్తరించబడిన వేలాది చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల కావేరి నదీ పరివాహక ప్రాంతం తరచూ జల జగడాలకు కారణం కావడం చూస్తున్నాం. కర్ణాటకలో పుట్టి తమిళనాడు గుండా ప్రవహించే కావేరి నదీ జలాల విషయంలో నీటి కొరత ఏర్పడుతున్న సందర్భంలో ఇరు రాష్ట్రాల్లో యుద్ధవాతావరణం ఏర్పడి, శాంతిభద్రతల సమస్య తలెత్తిన సందర్భాలెన్నో ఉన్నాయి. కావేరి వాటర్ ట్రిబ్యునల్ కూడా ఈ విషయంలో విఫలమవుతున్నది. పలు సందర్భాల్లో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని,తమిళనాడుకు నీటీని విడుదల చేసిన సందర్భాలున్నాయి.కర్ణాటక లోని కృష్ణానదిపై నిర్మించిన అల్మట్టి డ్యాం ఎత్తు విషయంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి,కర్ణాటక రాష్ట్రానికి మధ్య అనేక వివాదాలు చెలరేగాయి. కృష్ణాజలాలను దిగువకు రాకుండా చేయడం, వరదలు వస్తే దిగువకు వదిలేయడం తరచూ జరుగుతున్నది. కృష్ణానదీ పరివాహక ప్రాంతం లోని ఉభయ తెలుగు రాష్ట్రాలపై అల్మట్టి డ్యాం తీవ్ర ప్రభావం చూపిస్తున్న మాట వాస్తవం. బాబ్లీ ప్రాజెక్టు విషయంలో అప్పట్లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మరియు మహారాష్ట్రల మధ్య గొడవలు జరిగిన సంగతి మరచి పోలేము. రాష్ట్రాల మధ్య జరిగే జల వివాదాలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి .ఎన్నో రాష్ట్రాల మధ్య ప్రాజెక్టుల విషయంలోను,నదీ జలాల పంపిణీ విషయంలోను ఏర్పడుతున్న వివాదాలు సామరస్యంగా పరిష్కారం కావాలి.

**(మార్చి 22, ప్రపంచ జల దినోత్సవం)**

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# విశ్వ రహస్యాల శోధనలో ఐన్‌స్టీన్..!



ఐన్‌స్టీన్ వ్యక్తిత్వపు సారం, అతని అతి సాధారణత్వం అతని విజ్ఞాన సారం, కళాతత్వం-సౌందర్య దృష్టి అంటారు హాఫ్ మన్. విభిన్న రంగాల్లోని వారి ప్రతిభ ఈ శతాబ్దపు నీలి గగనాన ఇంద్రధనుస్సులా సైన్స్ పాఠాలు నేర్పుతోంది యావత్ ప్రపంచానికి.ఆయనను అనుసరిస్తూనే నూతనత్వం కోసం అన్వేషిస్తుంది.ప్రస్తుత ఆధునిక నవతరం. ఐన్ స్టీన్ మెదడుపై శాస్త్రీయ పరిశోధనలు జరుగుతున్నాయంటే వారి ఆలోచనలు విశ్వాన్వేషణలో ఎంతలా ప్రాధాన్యతను సంతరించుకున్నాయో మనమే అర్థం చేసుకోవాలి.శ్రీశ్రీ మాటల్లో 'ఆ మార్గం అనితర సాధ్యం'. విశ్వ రహస్యాల పేటికను విపాటనం చేసిన ఐన్‌స్టీన్ నభూతో నభవిష్యతి. 'ఒక్క క్షణం పాటు మీ చేతిని కుంపటి మీద పెట్టండి ఒక గంటలా' కనిపిస్తుంది. 'ఒక అమ్మాయితో గంటసేపు సరదాగా గడపండి ఒక్క క్షణం'లా అనిపిస్తుంది అదే సాపేక్షత అంటూ తనదైన శైలిలో మనందర్నీ ప్రభావితం చేస్తున్నారు.

కంప్యూటర్లు, ఇంటర్నెట్, క్వాంటం ఫిజిక్స్,అణు విద్యుత్‌లతో సహా నేటి కృత్రిమ మేధ, రోబోటిక్ కంప్యూటింగ్, స్ట్రింగ్ థియరీ, విశ్వ వ్యాకోచం, గురుత్వాకర్షణ తరంగాలు, బ్లాక్ హోల్స్, డార్క్ ఎనర్జీ, బిగ్ బ్యాంగ్ వంటి ఎన్నో ఆధునిక శాస్త్ర సాంకేతిక పదాలకు ఆయన ఆలోచనలే పునాది రాళ్ళు. 'నా ఈ వ్యాసాలు విప్లవాత్మక మార్పులకు నాంది ప్రస్తావన అవుతాయి'అంటూ 1905 లో 'Theory of Relativity'తో గుమాస్తా అయిన ఓ అనామక యువకుడు తన ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించారు. 2005 సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి సైతం ఆ అనామక వ్యక్తి ఆత్మ విశ్వాసానికి నిదర్శనంగా 2005ను ఐన్ స్టీన్ సంవత్సరంగా, అంతర్జాతీయ భౌతిక శాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది.'ఫిజిక్స్ ఫర్ టుమారో' ప్రపంచ గీతమై కోట్లాది గెలాక్సీల గుండెల్లో ప్రతిధ్వనించింది.

ఫిజిక్స్‌లో ఒక నోబెల్ బహుమతి గెలిచిన ఓ గొప్ప శాస్త్రవేత్తగా మాత్రమే ఐన్‌స్టీన్ ను మనం పరిమితం చేయలేము. అనంత మేధాశక్తి సామర్థ్యంతో పాటు మానవత, నైతికత కల్గిన తత్వవేత్తగా, స్వతంత్రం, న్యాయం, సమానత్వాల పట్ల అచంచలమైన విశ్వాసం గల విలక్షణమైన వ్యక్తిగా, అన్నింటికీ మించి విశ్వ శాంతి కాముకుడిగా ఆయనలోని సమగ్ర మూర్తిమత్వపు వ్యక్తితత్వం భిన్న మానవీయ, శాస్త్రీయ కోణాల్లో యావత్ ప్రపంచం చూసింది .నేటితరంలో కూడా యువత కొన్ని సందర్భాల్లో 'అబ్బో వీడో పెద్ద ఐన్ స్టీన్' అని అంటున్నారంటే ఆయన ప్రాభవం ఇంకా కొన్ని శతాబ్దాలు ఇలానే కొనసాగుతుందేమోనని అనిపిస్తుంది. ప్రాథమిక భౌతిక రాశులుగా వున్న పొడవు, ద్రవ్యరాశి మరియు కాలానికి కాంతివేగంతో ముడిపెట్టి న్యూటన్ కాలానికి ముగింపు పలికాడు ఐన్‌స్టీన్. చిన్నప్పుడు తన తండ్రి ఇచ్చిన నావికా దిక్సూచి, రేఖాగణితం పుస్తకం ల నుంచి స్ఫూర్తి పొంది నేడు స్పేస్ అండ్ టైమ్‌కే దిక్సూచిగా ఎదిగారు. ద్రవ్యం శక్తిగాను, శక్తి ద్రవ్యం గాను మారవచ్చని E=mc2తో విశ్వ గమనానికే సాపేక్షతతో కొత్త ఫిజిక్స్ నేర్పారు. ఇంతలా శతాబ్దాల కాలాన్ని కాంతివేగంతో పరిగెత్తించి...'నేను కొత్తగా కనుగొన్నది ఏమీలేదు. సృష్టించింది ఏమీ లేదు. నేను, నా పూర్వీకుల భుజాలపై నుండి మరింత దూరం స్పష్టంగా చూడగలిగాను.అంతే' అంటారు అ'మాయ'కంగా ఐన్‌స్టీన్.

1905లో 'ఆన్ ది ఎలక్ట్రో డైనమిక్స్ ఆఫ్ మూవింగ్ బాడీస్'పరిశోధనా పత్రంతో ఆధునిక విజ్ఞానంపై అనంత ప్రభావం చూపిన ఐన్ స్టీన్ గమనం అంతా సాపేక్షమే అనీ,శూన్యాకాశంలో కాంతి వేగం విలువ స్థిరంగా వుంటుందని ప్రతిపాదించారు.నేటి యువ శాస్త్రవేత్తలకు 'కాంతి వేగాన్ని మించే వేగం' ఓ శాస్త్రీయ సవాల్ గా మారిందని చెప్పవచ్చు. ఫోటో విద్యుత్ ఫలితం ప్రయోగ నిరూపణతో నోబెల్ గెలిచిన ఐన్‌స్టీన్ 'జ్ఞానం, నైపుణ్యం మాత్రమే మానవాళికి గౌరవకరమైన జీవితాన్ని ఇవ్వలేవు.ఉన్నతమైన నైతిక ప్రమాణాలు,విలువలు కలవారిని ఎంతో ఆరాధించడం మానవతకు సహజం'అంటారు.

'We should be thankful to the Indians who taught us how to count, without which no worthwhile scientific discovery would have been possible' అంటూ మనం అందించిన 'శూన్యం'గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విఖ్యాత భారతీయ తత్వవేత్త, ఆసియా ఖండంలోనే తొలి నోబెల్ విజేత రవీంద్రనాథ్ ఠాగూర్‌తో కూడా ఐన్ స్టీన్‌కు 'ఆన్ ది నేచర్ ఆఫ్ రియాలిటీ'తో సంభాషణ జరిగింది. సైన్స్, ప్రకృతి, ఆధ్యాత్మికత, చైతన్యం, తత్వశాస్త్రం వంటి అంశాలపై వారి మధ్య సత్యాన్వేషణ జరిగింది. సిగ్మండ్ ఫ్రాయిడ్, మహాత్మా గాంధీ వంటి విఖ్యాత ప్రముఖులతో కలిసి విశ్వ శాంతి కోసం తన ప్రయత్నాలను కొనసాగించారు. 'ఇటువంటి వ్యక్తి ఒకరు సజీవంగా రక్త మాంసాలతో ఈ నేలపై నడయాడా డంటే భవిష్యత్తు తరాలు నమ్మలేక పోతాయేమో'అంటూ గాంధీజీ కి ఆయన ఇచ్చిన అక్షర నివాళి విశ్వ వనంలో ఏనాటికీ ఎవ్వరూ చెరపలేని శిలా శాసనం. గాంధీజీ, ఐన్ స్టీన్ ఇద్దరూ ప్రత్యక్షంగా కలవాలనుకున్న ప్పటికీ కాలం ఎందుకో వాళ్ళిద్దరినీ కలవకుండా చేసింది. విశ్వావిర్భావానికి సంబంధించిన ఎన్నో శాస్త్రీయ అంశాలు భగవద్గీతలో వున్నాయని, ఫోటాన్ శక్తి మారుతుందని గుర్తించి నిరూపించిన సి.వి.రామన్ ఆలోచనా విధానం తనను ఎంతగానో ప్రభావితం చేసిందని ఐన్‌స్టీన్ అన్నట్లుగా చరిత్రలో చెప్పడం జరిగింది.



నిత్యం అధిపత్యం, నియంతృత్వ, అమానుష అజ్ఞాన,ఆయుధ చర్యలతో,యుద్ధాలతో మానవ మనుగడ ఆధునికత పేరుతో అనాగరికంగా వ్యవహరిస్తున్న ప్రస్తుత తరుణంలో ఐన్ స్టీన్ జీవన విధానం, వ్యక్తిత్వపు పాఠాలు నేడు మనమంతా అనుసరించాల్సిన సమయం ఆసన్నమైంది. తన సూత్రంతో ఆటం బాంబు కనుగొని లక్షల ప్రాణాలు తీయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు ఐన్‌స్టీన్. విశ్వశాంతి కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ ఉపయోగపడాలని తన జీవితాంతం సందేశం యిచ్చారు. ఇక మళ్ళీ ప్రపంచ యుద్ధాలు జరిగితే రాళ్ళు,కర్రలు మాత్రమే మిగులుతాయని గట్టిగానే ఆనాడే హెచ్చరించిన విశ్వ మానవుడు ఐన్ స్టీన్. మానసిక ప్రశాంతత కోసం వయొలిన్ తో సమయాన్ని కేటాయించిన ఆయన NON VIOLENCE కావాలని దశాబ్దాలుగా పోరాటం చేశారు.'నాకు ప్రత్యేక నైపుణ్యం లేదు. అంతులేని జిజ్ఞాస మాత్రమే వుంది'అన్న ఆయన స్ఫూర్తి వచనాలతో, విశ్వం విస్తరణ సాక్షిగా విజ్ఞాన్వేషణలో విశ్వహద్దులను చెరిపేస్తూ, విశ్వశాంతి జలపాతాలను కురిపిస్తూ మనమంతా ప్రేమ మంత్రాన్ని జపిస్తూ, సత్యం మార్గం లో మా'నవ'మనుగడను కొనసాగిద్దాం. సృష్టి రహస్యాలపై మన సంతకాలను ముద్రిద్దాం.

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
9394749536

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@ gmail.com** మెయిల్ అడ్రస్‌కు పంపగలరు. **- ఎడిటర్**

# నదుల రక్షణకు ఉద్యమం అవసరం



నదులను కాపాడటం, వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి అంతర్జాతీయ నదుల నెట్‌వర్క్ ద్వారా 2005 మార్చి 14న మొదటిసారిగా ప్రపంచ నదుల దినోత్సవం జరుపుకున్నారు. 2025 అంతర్జాతీయ నదుల దినోత్సవం యొక్క సారాంశము 'మన నదులు, మన భవిష్యత్తు'. పర్యావరణ వ్యవస్థలు, జీవవైవిధ్యం, మానవ జీవనోపాధిని నిలబెట్టడంలో నదుల ప్రాముఖ్యతను స్మరించుకోవడానికి పర్యావరణవేత్తలు, సంఘాలు, రాజకీయ నాయకులు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. నదులు పర్యావరణ వ్యవస్థకు కీలకమైనవని. అవి వరద నియంత్రణ, వాతావరణ మార్పు, జీవవైవిధ్యానికి కూడా సహాయపడతాయి. కానీ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నదులు ప్రమాదంలో ఉన్నాయి. వాతావరణ మార్పు,బాధ్యతారహిత అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల అవి మరింతగా విచ్ఛిన్నం, కలుషితమవుతూ బలహీనపడుతున్నాయి. నదులు ప్రమాదంలో ఉన్నప్పుడు, మన సమిష్టి భవిష్యత్తు కూడా అంతే ప్రమాదంలో ఉంది. ఆరోగ్యకరమైన నదులు, పరిశుభ్రమైన నీటిని పొందడం మనందరినీ కలిపే ప్రాథమిక మానవ హక్కులు. మంచినీటి జాతులు 1970 నుండి 83% క్షీణతను చూశాయి.

ప్రపంచవ్యాప్తంగా నదుల క్షీణత, కాలుష్యం ఒక ముఖ్యమైన పర్యావరణ సమస్య. ఇది ప్రధానంగా పారిశ్రామిక వ్యర్థాలు, శుద్ధి చేయని మురుగునీరు, వ్యవసాయ ప్రవాహం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పట్టణీకరణ, అటవీ నిర్మూలన, తగ్గిన నీటి వడపోత పెరిగిన కోత, వాతావరణ మార్పు మొదలైన కారణాల వల్ల సంభవిస్తుంది. గంగా,యమునా (భారతదేశం), సిటారమ్ (ఇండోనేషియా),యాంగ్జీ (చైనా)మతంజా-రియాచు (అర్జెంటీనా) వంటి ప్రధాన నదులు ప్రపంచవ్యాప్తంగా అత్యంత కలుషితమైనవిగా పరిగణించబడుతున్నాయి, ఇవి తరచుగా కలుషితమైన నీటి వనరుల కారణంగా జీవవైవిధ్యం కోల్పోవడం, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు, పర్యావరణ అంతరాయం, జల జీవులు మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. వాతావరణ మార్పు, భూ వినియోగం వల్ల ప్రపంచవ్యాప్తంగా 402 బేసిన్లలో నదీ ప్రవాహం తగ్గింది. ఇది 2000 సంవత్సరం నుండి ఐదు రెట్లు పెరుగుదల. పరిశోధకులు 89 దేశాలలో 75,000 కంటే ఎక్కువ నీటి వనరులను సర్వే చేశారు. 40 శాతానికి పైగా తీవ్రంగా కలుషితమైందని కనుగొన్నారు. ఒక నివేదిక ప్రకారం 90 దేశాలు, ముఖ్యంగా ఆఫ్రికా, మధ్య, ఆగ్నేయాసియాలో నదీ క్షీణతను ఎదుర్కొంటున్నాయి. 2030 నాటికి మానవాళిలో సగానికి పైగా కరువు, వరదలు, మురుగునీటి కాలుష్యం, తగినంత నీటి నాణ్యత లేని దేశాలలో నివసిస్తారు. 47 దేశాలు అంతర్ జల వనరుల నిర్వహణ (IWRM)ని పూర్తిగా చేరుకున్నాయి. 63 దేశాలు అంతర్ జల వనరుల నిర్వహణ అమలును వేగవంతం చేయాలి. అయితే 73 దేశాలు అంతర్ జల వనరుల నిర్వహణ కోసం పరిమిత సామర్థ్యాన్ని మాత్రమే కలిగి ఉన్నాయి. ప్రస్తుత పురోగతి రేటు ప్రకారం, ప్రపంచం 2049 నాటికి స్థిరమైన నీటి నిర్వహణను సాధిస్తుంది. దీని అర్థం 2030 నాటికి 100 కంటే ఎక్కువ దేశాలలో కనీసం 3.3 బిలియన్ల మంది ప్రజలు నీటి డిమాండ్లను సమతుల్యం చేయడానికి అసమర్థమైన పాలనను కలిగి ఉండే అవకాశం ఉంది.

భారతదేశంలో నదీ క్షీణత కాలుష్యం ఒక ముఖ్యమైన పర్యావరణ సమస్య, ప్రధానంగా శుద్ధి చేయని మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు మరియు సరికాని వ్యర్థాలను పారవేయడం వల్ల ఇది సంభవిస్తుంది. గంగా మరియు యమునా వంటి ప్రధాన నదులలో జలచరాలకు హాని కలిగిస్తుంది.

60% కంటే ఎక్కువ మురుగునీరు నేరుగా నదులలోకి విడుదలవుతుంది. భారతదేశంలోని ప్రధాన నగరాలు రోజుకు 38,354 మిలియన్ లీటర్ల మురుగునీటిని ఉత్పత్తి చేస్తాయి, కానీ పట్టణ మురుగునీటి శుద్ధి సామర్థ్యం 11,786 లీటర్లు మాత్రమే. భారతదేశంలో సగటు వార్షిక వర్షపాతం దాదాపు 4000 బిలియన్ క్యూబిక్ మీటర్లు అయినప్పటికీ, మౌలిక సదుపాయాల లేకపోవడం వల్ల దాదాపు 1122 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి వనరులు మాత్రమే వినియోగానికి అందుబాటులో ఉన్నాయి. కాలుష్యం నీటి నాణ్యతను క్షీణింపజేస్తుంది కాబట్టి ఈ నీటిలో ఎక్కువ భాగం సురక్షితం కాదు. నీటి కాలుష్యం భారతీయ వినియోగదారులకు, దాని పరిశ్రమకు వ్యవసాయానికి అందుబాటులో ఉన్న నీటి మొత్తాన్ని తీవ్రంగా పరిమితం చేస్తుంది.

భారతదేశంలో నదీ నిర్వహణను ప్రధానంగా జల్ శక్తి మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తుంది, ఇది గంగా పునరుజ్జీవన ప్రాజెక్ట్, భూగర్భజల రీఛార్జ్ కార్యక్రమాల వంటి ద్వారా నదులతో సహా నీటి వనరులను సంరక్షించడం, నిర్వహించడంపై దృష్టి పెడుతుంది, బ్రహ్మపుత్ర బోర్డు వంటి కీలక సంస్థలు బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థ వంటి నిర్దిష్ట నదీ పరీవాహక ప్రాంతాలను నిర్వహిస్తాయి. నదులను రక్షించడానికి భారత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. నమామి గంగా కార్యక్రమం (2014), నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా (NMCG) ప్రధానంగా భారతదేశంలో అత్యంత కలుషితమైన నదులలో ఒకటైన గంగాను శుభ్రపరచడం, పునరుజ్జీవింపజేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మిషన్ కోసం 20,000 కోట్లు (సుమారుగా) కేటాయించారు. కాలుష్య నియంత్రణ మురుగునీటి శుద్ధి మరియు ఘన వ్యర్థాల నిర్వహణ వంటి ఇతర చర్యల ద్వారా నదులలో నీటి నాణ్యతను మెరుగుపరచడానికి జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక (NRCP) ప్రవేశపెట్టబడింది. స్వచ్ఛ భారత్ అభియాన్ (క్లీన్ ఇండియా మిషన్) జాతీయ స్థాయిలో పరిశుభ్రతను సాధించడం, కాలుష్యాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశం అంతటా నదుల ఆరోగ్యాన్ని పునరుద్ధరించడానికి, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్ట నదుల పునరుజ్జీవన ప్రణాళికలను అభివృద్ధి చేయమని ప్రోత్సహించబడ్డాయి. నదుల కాలుష్య స్థాయిలను పర్యవేక్షించడంలో మరియు కాలుష్యాన్ని నియంత్రించడానికి నిబంధనలను అమలు చేయడంలో కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (CPCB) ద్వారా కాలుష్య నియంత్రణ చర్యలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

రాష్ట్ర స్థాయి చొరవలు వ్యక్తిగత రాష్ట్రాలు కూడా తమ అధికార పరిధిలోని నిర్దిష్ట నదులను లక్ష్యంగా చేసుకుని కార్యక్రమాలను ప్రారంభించాయి. అటవీకరణ నదీ తీర రక్షణ నదీ పర్యావరణ వ్యవస్థల చుట్టూ పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరిస్తుంది. ప్రజా అవగాహన, సమాజ భాగస్వామ్యం ఈ ప్రయత్నాలలో కీలకమైన భాగం. ప్రత్యామ్నాయ నీటి వనరులను ప్రోత్సహించడం నీటి వెలికితీత కోసం నదులపై ఆధారపడటాన్ని తగ్గించడం. స్థిరమైన నీటి నిర్వహణ పర్యావరణ సమతుల్యత కోసం నదులలో తగినంత నీటి ప్రవాహం నిర్ధారించడం మొదలైన చర్యలు తీసుకుంది.

ప్రపంచవ్యాప్తంగా కాలుష్యం, అతి దోపిడీ పర్యావరణ క్షీణత నుండి నదులను రక్షించడానికి అనేక ముఖ్యమైన ఉద్యమాలు ఉద్భవించాయి. ఈ ఉద్యమాలు అవగాహన పెంచడంలో, విధాన మార్పుల కోసం వాదించడంలో, నదులు, నీటి పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ కోసం ప్రపంచ చర్యను ప్రేరేపించడంలో కీలక పాత్ర పోషించాయి. 1973లో చిప్కో ఉద్యమం (భారతదేశం), వివిధ దేశాలలో ది రివర్ బేసిన్ ప్రొటెక్షన్ మూవ్‌మెంట్, ది డ్యామ్ రిమూవల్ మూవ్‌మెంట్ (USA), ది రియో+20 సమ్మిట్ (2012), ది అమెజాన్ రివర్ ప్రొటెక్షన్ మూవ్‌మెంట్ (బ్రెజిల్), ది కొలరాడో రివర్ ప్రొటెక్షన్ మూవ్‌మెంట్ (USA మరియు మెక్సికో), ది మెకాంగ్ రివర్ ప్రొటెక్షన్ మూవ్‌మెంట్ (ఆగ్నేయాసియా), ది సేవ్ ది అమెజాన్ రివర్ మూవ్‌మెంట్ (గ్లోబల్), వివిధ దేశాలలో ది సేవ్ అవర్ రివర్స్ క్యాంపెయిన్, ది వాటర్‌కీపర్ అలయన్స్ (గ్లోబల్), ది లోయిర్ రివర్ ప్రొటెక్షన్ క్యాంపెయిన్ (ఫ్రాన్స్) వంటి కొన్ని ముఖ్యమైన ఉద్యమాలు ఉన్నాయి. నదులను రక్షించడం పర్యావరణ వ్యవస్థలను నిలబెట్టడానికి మాత్రమే కాకుండా సాంస్కృతిక వారసత్వం, స్థానిక జీవనోపాధి, విస్తృత పర్యావరణాన్ని కాపాడటానికి కూడా కీలకమని ఈ ఉద్యమాలు నిరూపించాయి. నదులను రక్షించడం అనేది కేవలం స్థానిక ఆందోళన మాత్రమే కాదు, అంతర్జాతీయ సహకారం స్థిరమైన నీటి నిర్వహణకు నిబద్ధత కలిగిగి ఉండడం ప్రపంచ బాధ్యత.

ఐక్యరాజసమితి జనరల్ అసెంబ్లీ 2021-2030ని పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దంగా ప్రకటించింది. పర్యావరణ వ్యవస్థల నష్టం, క్షీణతను నివారించడం, దీని లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా మెరుగైన మురుగునీటి శుద్ధి, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ, స్థిరమైన వ్యవసాయం, ప్రజా అవగాహన ప్రచారాలు, నదుల పునరుద్ధరణ ప్రాజెక్టులు మొదలైన చర్యలను ఇది నొక్కి చెప్పింది. అదే సమయంలో కాలుష్యం లేకుండా సమర్థవంతమైన నదీ నిర్వహణకు పర్యావరణ ఆరోగ్యం, సామాజిక అవసరాలు, ఆర్థిక అభివృద్ధిని సమతుల్యం చేసే సమగ్ర స్థిరమైన విధానం అవసరం. శుభ్రమైన, ఆరోగ్యకరమైన నదీ వ్యవస్థ సమాజాల జీవన నాణ్యతను మెరుగుపరచడమే కాకుండా జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ స్థితిస్థాపకత మొత్తం పర్యావరణ శ్రేయస్సుకు కూడా దోహదపడుతుంది. కాలానుగుణంగా ఈ లక్ష్యాలను సాధించడానికి సంఘాలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థల చురుకైన భాగస్వామ్యం బలమైన ఉద్యమం రూపంలో చాలా ముఖ్యమైనది.

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



● కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్,మార్చి21( మనం బ్యూరో) :** నిరంతర సాధన తో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులు రాణించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్, ప్రాంతీయ క్రీడా పాఠశాలలోని స్విమ్మింగ్ పూల్ ఆధునికరించారు. క్రీడా పాఠశాలలో యోగా కేంద్రం నిర్మించారు. జిమ్నాస్టిక్స్, యోగ, అథ్లెటిక్స్, జూడో వంటి క్రీడల కోసం అవసరమైన పరికరాలను సమకూర్చారు. క్రీడాకారులకు వసతులు, సౌకర్యాలు కల్పించారు. ఆధునికరించిన తర్వాత స్విమ్మింగ్ పూల్, క్రీడా పాఠశాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఇక్కడ సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్ వద్ద ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటాలని సూచించారు. స్పోర్ట్స్ స్కూల్ వద్ద విద్యార్థుల కోసం ఎటువంటి సౌకర్యాలు అవసరం ఉన్నా సమకూర్చాలని ఆదేశించారు. యోగ, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, జూడో వంటి క్రీడల కోసం అవసరమైన పరికరాలను ప్రాంతీయ క్రీడా పాఠశాలలో సమకూర్చామని, విద్యార్థులు ఈ సదుపాయాలను వినియోగించుకొని క్రీడారంగంలో మరింత రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా కరీంనగర్ ప్రాంతీయ పాఠశాల విద్యార్థుల అథ్లెటిక్స్, యోగ, జూడో, జిమ్నాస్టిక్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# పత్రికల ఎంపానెల్మెంట్ వెంటనే చేపట్టాలి

● తెలంగాణ ప్రెస్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
● తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ మంచిర్యాల జిల్లా కమిటీ ఎన్నిక



**మంచిర్యాల, మార్చి 21 (మనం న్యూస్):** ప్రభుత్వం ఎప్పటికప్పుడు తాత్కాలికమైన నిర ్ణయాలు తీసుకోకుండా జర్నలిస్టుల సంబంధిత అవసరాలను పరిగణలోకి తీసుకొని ఒక సమగ్రమైన మీడియా పాలసీని రూపొందించి దేశానికే ఆదర్శంగా నిలవాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగొని అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ మంచిర్యాల జిల్లా కమిటీ ఎన్నిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగొని ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రావిర్భావం కోసం అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం రావడంలో కీలక పాత్ర పోషించిన పత్రికలు మరియు ఛానల్ సమస్యల పై ప్రభుత్వం వెంటనే స్పందించి గత ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎంపానెల్మెంట్ వెంటనే చేపట్టి రుణభారంతో బ్రతుకులీడుస్తున్న పాత్రికేయులను ఆదుకోవాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగొని అన్నారు. ఈ సందర్భంగా టి. ఎస్. జె. యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న యూనియన్లు జర్నలిస్టు ల సంక్షేమం కోసం కాకుండా తమ వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితమయ్యాని అలా కాకుండా తాము ఒక ప్రత్యామ్నాయ జర్నలిస్టు ఉద్యమ నిర్మాణానికి శ్రీకారం చూట్టామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అవునూరి సంపత్, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కె .సురేష్ పాల్గొన్నారు. ఓరంరేవిరంరవాకిలొ జిల్లా అధ్యక్షుడిగా యు.రాజు పటేల్, ప్రధాన కార్యదర్శిగా కె.అరుణ్ కుమార్, కోశాధికారిగా ఎం.మనోజ్, ఉపాధ్యక్షులుగా బి.రాజశేఖర్, ఆర్.అరుణ్ కుమార్, కే. సారయ్య, బి. శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా టి. శ్రీనివాస్ ఎం వినోద్ ఏ సత్యనారాయణ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాము, సూర్యనారాయణ, వెంకటేష్, లక్ష్మణ్, ఈసీ మెంబర్లుగా బి. వెంకటేష్, బి. రవీందర్, రాజేశ్వరరావు, షంషీద్, సతీష్ లు ఎన్నికయ్యారు.

## ఎస్పీని కలిసిన జర్నలిస్టులు



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, మార్చి 21 (మనం న్యూస్) :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ గీత సాహెబ్ ను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం హెచ్143 జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా, టెంజు అధ్యక్షులు యిరుకుల ప్రవీణ్ ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ జి సాహెబ్ కు శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో జర్నలిస్టులకు పోలీసులకు అవినాభావ సంబంధం ఉంటుందని అన్నారు. ప్రజా సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. తదనాంతరం జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ జిల్లాలోని జర్నలిస్టుల పలు సమస్యల తో పాటు వివిధ అంశాల ను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి సామల్ల గట్టుతోపాటు వివిధ ప్రెస్ క్లబ్ ల అధ్యక్ష, కార్యదర్శులు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్గానిక్ వేస్ట్ మేనేజ్మెంట్ టెక్నాలజీస్ ప్రదర్శన




**కరీంనగర్ టౌన్, మార్చి21 ( మనం న్యూస్) :** స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ కళాభారతిలో ఆర్గానిక్ వేస్ట్ మేనేజ్మెంట్ టెక్నాలజీస్ ప్రదర్శనను శుక్రవారం ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటి నుండి వెలువడే ఆహార వ్యర్థాలు, తడి, పొడి చెత్తను ఎరువుగా మార్చే యంత్రాలు, పరికరాలను ఇక్కడ ప్రదర్శించారు. వివిధ రాష్ట్రాల నుండి, హైదరాబాద్ నుండి వచ్చిన వివిధ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చెత్తను ఎరువుగా మార్చే పరికరాల గురించి వివరించారు.జిల్లా కలెక్టర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి పమేలా సత్పతి ఈ ప్రదర్శనకు హాజరయ్యారు. ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. పి.పి.టి ప్రదర్శనను లైవ్ డెమోను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి అపార్ట్మెంట్ల నుండి వెలువడే ఆహార వ్యర్థాల ద్వారా చిన్న పరికరాలతో ఎటువంటి ఖర్చు లేకుండా చెత్తను ఎరువుగా మార్చవచ్చని అన్నారు. వచ్చిన ఎరువును మొక్కల సంరక్షణకు వినియోగించుకోవచ్చని, తద్వారా ప్రకృతిని సంరక్షించిన వారమవుతామని అన్నారు. వివిధ ప్రాంతాల్లో చెత్తను ఎరువుగా మారుస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలను అభినందించారు.

ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ వాజ్పేయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు

● పటిష్ఠ బందోబస్తు నడుమ పరీక్షలు నిర్వహణ



**గంగాధర, మార్చి 21( మనం న్యూస్)** గంగాధర మండలంలో పదవతరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా 4 కేంద్రాలలో పటిష్ఠ బందోబస్తు నడుమ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన పది పరీక్షలకు మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలలో చదువుతున్న 731 విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు పరీక్ష తొలిరోజు కావడంతో నిర్ణీత సమయానికి కన్నా గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల తో పరీక్షా కేంద్రాల బయట సందడి నెలకొంది. తమ పిల్లలు ధైర్యంగా పరీక్షలు రాసేలా అన్ని జాగ్రత్తలు చెప్పిన తల్లిదండ్రులు వారికి ఆల్ ద బెస్ట్ చెప్పి లోనికి పంపించారు. విద్యార్థులు సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి తీసుకురాకుండా ఇన్విజిలేటర్లు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి పరీక్ష హాలులోకి పంపారు.

పరీక్ష కేంద్రాలలో మరుగు దొడ్లు, విద్యుత్ సౌకర్యం, వైద్య శాఖ పరిధిలో వైద్య శిభిరాలు, తాగునీరు వంటి అన్ని సౌకర్యాలు కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా పదవ తరగతి పరీక్షల తొలి రోజు 731 విద్యార్థులకు గాను గంగాధర ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఒక విద్యార్థి గైర్హాజరు అయినట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ రావు తెలిపారు.

## గంగాధర నూతన ఎస్ఐగా వంశీ కృష్ణ



**గంగాధర, మార్చి 21, ( మనం న్యూస్) :** గంగాధర మండల నూతన ఎస్ఐగా జి. వంశీ కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గంగాధర పోలీస్ స్టేషన్లో పని చేసిన ఎస్ఐ గడ్డం నరేందర్ రెడ్డి కరీంనగర్ హెడ్ క్వార్టర్స్ రిజర్వుడ్ గా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కరీంనగర్ లోని సిఎస్బిలో ఎస్ఐగా పని చేసిన జి. వంశీ కృష్ణ గంగాధర పోలీస్ స్టేషన్ కు బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా ఎస్స్రై మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ పై ప్రత్యేకంగా నిఘ ఉంచడం జరుగుతుందని, చోరీల నియంత్రణకు, పేకాట, మాదకద్రవ్యాల నియంత్రణపై ఉక్కుపాదం మోపనున్నట్లు వారు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

# కరీంనగర్‌కు బడ్జెట్ లో 800 కోట్లు కేటాయించాం

● నువ్వు బద్దలు కొట్టాల్సింది కేసీఆర్ ఫామ్ హౌస్ గేట్లను..
● వాస్తవాలు వక్రీకరించి మాట్లాడితే పుట్టగతులుండవు
● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్



**కరీంనగర్, మార్చి21( మనం బ్యూరో):** బడ్జెట్ లో కరీంనగర్ కు దాదాపు ఎనిమిది వందల కోట్లు కేటాయించినా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కరీంనగర్ కు గుండు సున్నా అని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆర్ అండ్ బి అతిధి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కు 179 కోట్లు,శాతవాహన యూనివర్సిటీకి 35 కోట్లు,వరంగల్ కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్స్ కు 41 కోట్లు శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ఫ్లడ్ ఫ్లో కెనాల్ కు 548 కోట్లు కేటాయించడం జరిగిందని మానేర్ రివర్ ఫ్రంట్ కు గతంలో కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు కాలేదని అందుకే కేటాయించలేదని గంగుల కమలాకర్ కళ్లున్న కబోదిలాగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కరీంనగర్ రూరల్ మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీళ్లిచ్చే విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని గతంలో తాగునీటికి సాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడ్డప్పుడు మేము ధర్నాలు చేసినా పట్టించుకోలేదని కరీంనగర్ లో త్రాగు నీటికి ఇబ్బంది కలిగి పంప్ హౌస్ లో బూస్టర్లకు కూడా నీళ్లు అందని పరిస్థితి ఉంటే మున్సిపల్ ముందు ధర్నాలు చేశామని ఆరోజు పట్టించుకోని గంగుల ఇప్పుడు ఆ అవసరం ఏర్పడకున్నా విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.
స్మార్ట్ సిటీ పనులలో అవినీతి,కేబుల్ బ్రిడ్జి ప్రారంభించిన నెలకే అప్రోచ్ రోడ్డు కుంగడం,కేబుల్ బ్రిడ్జి కి ఆరు కోట్లతో పెట్టిన డైనమిక్ లైట్లు పనిచేయకపోవడం, సుందరీకరణ పేరుతో కోట్లు ఖర్చు చేయడం ఇవన్నీ మీవల్లే సాధ్యమైందని దుయ్యబట్టారు.గతంలో పింకు చొక్కా వాళ్ళకే బిసి బంధు,దళిత బంధు ఇచ్చారని ఇప్పుడు రాజీవ్ యువ వికాసం ద్వారా అర్హులైన వారందరికీ రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి మంత్రులు శ్రీధర్ బాబు,ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తామని నరేందర్ రెడ్డి అన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో శ్రవణ్ నాయక్,కాంరెడ్డి రాంరెడ్డి, స్వామి గౌడ్,దన్న సింగ్,ఆర్ష మల్లేశం,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,కుర్ర పోచయ్య,దండి రవీందర్,కీర్తి కుమార్,పెద్దిగారి తిరుపతి,మామిడి సత్య నారా యణ రెడ్డి, అనిల్ కుమార్,హ నీఫ్, సాయిరాం, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలీలను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ . బాలరాజు




**మంచిర్యాల, మార్చి 21( మనం న్యూస్):** సివిల్ సప్లై కార్పొరేషన్ లో పని చేస్తున్న హమాలి కార్మికులను నాలుగవ తరగతి ఉద్యోగుల గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ . బాలరాజు అన్నారు. శుక్రవారం రోజున సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బోగే ఉపేందర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా జెండాను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ . బాలరాజు ఆవిష్కరించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక,కర్షక,ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను విడదీసి కార్పొరేట్లకు అనుకూలంగా 4 కోడ్ లను తయారు చేశారన్నారు . కార్మికులను కట్టు బానిసలుగా చేసారని, కార్మిక వ్యతిరేక నాలుగు కోడులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యజమాన్య సంస్థ సివిల్ సప్లై కార్పొరేషన్ లో హమాలీలు, స్వీపర్లు ,దినసరి కూలీల కంటే ధారణమైన పరిస్థితిలో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బడా వ్యాపారులకు వందల కోట్ల లు రాయితీలు ఇచ్చే ప్రభుత్వం పేద ప్రజలకు అన్నం పెట్టి సివిల్ సప్లై కార్పొరేషన్ను సేవా దృక్పథంతో కాకుండా వ్యాపార కోణంలో చూడటం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై కార్పొరేషన్ గత ప్రభుత్వ బకాయిలను బహిర్గతం చేయాలని.మిల్లర్ల నుంఛి రావలసిన 11వేల కోట్లు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై కార్పొరేషన్ లో పనిచేస్తున్న హమాలీలు స్వీపర్లకు పెరిగిన ధరలకు అనుకూలంగా రేట్లు పెంచాలని, ఎఫ్.సి.ఐ మాదిరిగా హమాలీలకు నాలుగో తరగతి ఉద్యోగుల గుర్తించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, బోనస్ 10 వేలకు పెంచాలని, రిటైర్డ్ అయిన హమాలీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్స్ సౌకర్యం కల్పిం చాలని,గోడౌన్లలో కార్మికుల అవసరాన్ని బట్టి కార్మికులు తీసుకుని అధికారం కల్పించాలన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులు తమ సమస్యలను పరిష్కారం కోసం జరిగే ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు,కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, నాయకులు సుధాకర్,బుదాజి,దత్తు, సత్య నారా యణ, శంకర్, కొమురక్క, అమృత, తిరుపతి పాల్గొన్నారు.

# బిసి సంఘాల కృతజ్ఞత సభ సంబురాలు




**మంచిర్యాల, మార్చి 21( మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర శాసనసభలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమో దించినందున మంచిర్యాల జిల్లా కేంద్రంలో భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ , బీసీ సంఘాల ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డికి శుక్ర వారం కృతజ్ఞత సభ ఏర్పాటు చేసి సంబరాలు చేసుకున్నారు. ఉద్యమ కారుల ఐక్యవేదిక నాయకుడు వెంకటయ్య మాట్లాడుతూ, గతదశాబ్దాల కాలంగా విద్య ఉద్యో గాలు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిం చాలని రాష్ట్రస్థాయిలో జాతీయ స్థాయిలో బీసీ సంఘాలు చేస్తున్న పోరాటాలు ఫలించి కాంగ్రెస్ఇచ్చిన మాటకు కట్టుబడి బీసీలకు సామాజిక న్యాయం చేసిందని అన్నారు. సిఎంకి, మంత్రివర్గ సభ్యులకు, శాసనసభలోని అన్ని పార్టీల శాసన సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు . సిఎంబీసీ ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తూ 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్ట భద్రత కల్పిస్తూ పార్లమెంట్లో బీసీ బిల్లు ఆమోదించే విధంగా కృషి చేయగలరని ,ప్రధానిమోడీకి సిఎం లేఖ రాయడం పట్ల కూడా బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కృతజ్ఞత సభలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య తో పాటు ఉపా ధ్యక్షులు బూర్ల జ్ఞాని, కార్యదర్శులు ఏ.రాజేశం, చంద్రయ్య, బీసీ సంఘాల నాయకులు సత్యనారాయణ, గోపతి లక్ష్మి, బి.దామోదర్,బి మల్లయ్య,పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

● జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి,మార్చి 21 (మనం న్యూస్) :** జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఓటర్ జాబితా సవరణ పై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ జాబితా సవరణ పకడ్బందీగా జరగాలని, ప్రజాస్వామ్య విలువలు నెలకొల్పేందుకు ఓటర్ జాబితా చాలా కీలకమని, సరైన ఓటర్ జాబితాతో ఎన్నికల నిర్వహిస్తే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అన్నారు.ఓటర్ జాబితా, పారదర్శకమైన పోలింగ్ సిబ్బంది, ఈవిఎం యంత్రాలు, బ్యాలెట్ ఎన్నికల వ్యవస్థకు కీలకమని కలెక్టర్ అన్నారు. ఎన్నికల సమయంలో కాకుండా ఓటర్ జాబితా సవరణ పై రాజకీయ నాయకుల ప్రతినిధులు ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.మన జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా కొంతమందికి ఓట్లు ఉన్నట్లు వస్తున్న ఫిర్యాదులను జాతీయ ఓటర్ సర్వీస్ పోర్టల్ వివరాలు పరిశీలిస్తూ పరిష్కరిస్తామని అన్నారు. ప్రజాప్రతినిధుల చట్టం 1950 సెక్షన్ 31 ప్రకారం ఓటర్ నమోదు సమయంలో తప్పుడు సమాచారం అందిస్తే నేరమని, మోసపూరిత ఉద్దేశాలతో రెండు చోట్ల ఓటు హక్కు కల్గి ఉండే ఓటర్ల వివరాలు ఆదారాలతో అందిస్తే తప్పనిసరిగా విచారించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.మన రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వీటి పరిధిలో ఇప్పటివరకు 2 లక్షల 30 వేల 157 మంది పురుష ఓటర్లు, 2 లక్షల 47 వేల 977 మంది మహిళా ఓటర్లు, 38 మంది ఇతరులు మొత్తం 4 లక్షల 77 వేల 182 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.గత అసెంబ్లీ, పార్లమెంట్ , ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు వ్యయ వివరాలు నిర్దిష్ట సమయంలో నమోదు చేయాలని , లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోతారని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా సవరణపై ఎటువంటి సందేహాలు ఫిర్యాదులు సూచనలు ఉన్న తెలియజేయాలని అన్నారు.ఈ సమావేశంలో సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు రాధాబాయి రాజేశ్వర్ భాజాపా పార్టీ ప్రతినిధి నాగుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సంపత్, భారస పార్టీ ప్రతినిధి రాజన్న, బి.ఎస్.పి పార్టీ ప్రతినిధి రమేష్, సి.పి.ఐ(ఎం) పార్టీ ప్రతినిధి రమణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బంది రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సహాయం అందించేందుకు తంజీమ్




- **మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ ఏనాడూ పట్టించుకోలే**

**సిద్దిపేట, మార్చి 21(మనం న్యూస్ ప్రతినిధి):** నిరుపేద ముస్లింల అభివృద్ధి కోసం పని చేయాల్సిన తంజీమ్ పెద్దలు ఒక పార్టీ మెప్పు కోసం పని చేస్తుండడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఇమామొద్దీన్ అన్నారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని కొంతమంది ఉదార స్వభావంతో ఇచ్చే రంజాన్ తోఫాలను బిఆర్ఎస్ నాయకులే ఇస్తున్నట్టుగా తంజీమ్ పెద్దలు చిత్రీకరించే పద్ధతి ఇకనైనా మానుకుంటే మంచిదన్నారు. దాతల సహకారంతో వచ్చిన తోఫాలను శుక్రవారం నాడు నిరుపేద ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఇమామొద్దీన్ మాట్లాడుతూ ఇప్పటికైనా తంజీమ్ పెద్దలు బిఆర్ఎస్ పార్టీ మెప్పు కోసం పని చేయకుండా నిరుపేద ముస్లింల అభివృద్ధి కోసం పని చేస్తే బాగుంటుం దన్నారు. ఎమ్మెల్సీగా పది సంవత్సరాల పాటు కొన సాగిన ఫారూఖ్ హుస్సేన్ ముస్లిం సమాజ అభివృద్ధికి చేసిందేమీ లేదని, బిఆర్ఎస్ నాయకుల భూ కబ్జాలు, అవినీతిని బట్టబయలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాహబ్, యువజన పట్టన అధ్యక్షలు గయజుద్దీన్, ఎన్ఎస్.యుఐ జిల్లా అధ్యక్షులు అజ్మత్, రాషాద్, సలీమ్, అజ్మత్ అలీలు పాల్గొన్నారు.

## గీతం, హైదరాబాద్ ఎంబీఏకు ప్రతిష్టాత్మక ఎన్‌బీఏ అక్రిడిటేషన్

- **మూడేళ్ల పాటు, జూన్ 30. 2028 వరకు మంజూరు**



**పటాన్‌చెరు, మార్చి 21 (మనం న్యూస్) :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ శిఖలో మరో కలికితురాయి చేరింది. హైదరాబాద్ ప్రాంగణంలోని స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహిస్తున్న మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) కోర్సుకు ప్రతిష్టాత్మక నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ), న్యూఢిల్లీ మంజూరు చేసినట్టు విశ్వవిద్యాలయ వర్గాలు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించాయి. ఈ గుర్తింపు జూన్ 30, 2028 వరకు మూడేళ్ల పాటు అమలులో ఉంటుందని తెలిపారు.

డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయ హోదాను 2007లో పొందిన తరువాత గీతం అందుకున్న మొదటి ఎన్‌బీఏ అక్రిడిటేషన్ ఇదని, వర్సిటీ చరిత్రలో ఇదో మైలురాయిగా నిలిచిపోతుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ గుర్తింపు విద్యా నైపుణ్యం, బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యలో ఉన్నత ప్రమాణాల పట్ల సంస్థ యొక్క నిబద్ధతను నొక్కి చెబుతోంద న్నారు.హైదరాబాద్ ప్రాంగణంలోని ఎంబీఏ అధ్యాపకులు, అక్రిడిటేషన్ బృందాలను ఐక్యూఏసీ, అక్రిడిటేషన్ అండ్ ర్యాంకింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజా ప్రభు, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.మంజునాథాచారి హృదయపూర్వకంగా అభినందించారని, వారి అవిశ్రాంతి కృషి, అంకితభావం ఈ గౌరవనీయమైన గుర్తింపును పొందడంలో కీలక పాత్ర పోషించినట్టు తెలియజేశారు.ఈ విజయం పట్ల గీతం ఉన్నత నాయకత్వం తమ హర్షాన్ని వెలిబుచ్చింది. విద్యా నైపుణ్యం, నిరంతర అభివృద్ధి పట్ల అచంచలమైన నిబద్ధతను ఈ గుర్తింపు వెల్లడిస్తోందని ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా తదితరులు అభిప్రాయపడినట్టు వివరించారు.బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యలో ప్రముఖ సంస్థగా గీతం స్థానాన్ని ఈ గుర్తింపు పునరుద్ఘాటిస్తోందని, జ్ఞానం, నైపుణ్యాలు, ప్రపంచ దృక్పథాలతో కూడిన భవిష్యత్ వ్యాపార నాయకులను అభివృద్ధి చేయాలనే గీతం లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గీతంలో ఉత్సాహభరితంగా 'అంతర్జాతీయ సంతోష దినోత్సవం' అంతర్జాతీయ సంతోష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆనందాన్ని సృష్టించే (క్రాఫ్టింగ్ జాయ్) కార్యక్రమాన్ని గీతం విద్యార్థి విభాగం ఉడాన్ నిర్వహించింది. సృజనాత్మకత, చైతన్యంతో కూడిన ఉత్తేజకరమైన వేడుక కోసం విద్యార్థులను డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఒకచోట చేర్చింది. వేడుకలలో భాగంగా, ఫ్లాష్ డ్యాన్స్, బంకమట్టితో బొమ్మల తయారీతో పాటు పుస్తక పఠన కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వీయ వ్యక్తీకరణ, ఇతరులతో తమ అనుభవాలను పంచుకోవడంలో విద్యార్థులు మునిగిపోయారు. నిరాడంబరంగా నృత్యం చేయడం, సంక్లిష్టమైన బంకమట్టి నమూనాలను రూపొందించడం, సున్నితమైన కాగితపు పువ్వులను రూపొందించడం వంటి ప్రతి పని తమ సొంతం అనే భావనను, భావోద్వేగ అనుభూతిని పెంపొందించింది. ప్రశాంతమైన పుస్తకపఠన కార్యక్రమం, అందులో పాల్గొన్న వారిని ఉత్తేజితులను చేయడంతో పాటు స్ఫూర్తిదాయకంగా ఉంచింది.

## బొగ్గు గనుల కోసం భూమి ఇచ్చే భూయజ మానుల మనవరాలు కూడా ఉద్యోగానికి అర్హురాలు



- **బాంబే హైకోర్టు నాగ్పూర్ బెంచ్ ఒక ఉత్తర్వు**

**మంచిర్యాల, మార్చి 21( మనం న్యూస్):** బొగ్గు గని కోసం భూమి ఇచ్చిన భూమి యజమానుల మనవరాళ్లకు కూడా ఉద్యోగాలు లభిస్తాయని, ఈ మేరకు బాంబే హైకోర్టు నాగ్పూర్ బెంచ్ ఒక ఉత్తర్వు జారీ చేసింది.దాంతో బొగ్గు గనుల ఏర్పాటు కోసం భూములు ఇచ్చిన భూ యజ మానులు , వారి మనవరాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు .వివరాల ప్రకారం కుసుమ్ నామ్దేవ్ ఖాడే అనే భూమి కోల్పోయిన వ్యక్తి కోల్ ఇండియా లిమిటెడ్కు వ్యతిరేకంగా ఉపాధిని డిమాండ్ చేస్తూ బాంబే హైకోర్టు నాగ్పూర్ బెంచ్లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ దాఖలు చేయడంలో ఎచ్ఎంఎస్ నాయకుడు శివకుమార్ యాదవ్ సహాయం చేశారు. పిటిషనర్ తాతగారి భూమిని వెస్టన్ కోల్ఫీలడ్స్ లిమిటెడ్ 17, అక్టోబర్ ,2014 న స్వాధీనం చేసుకుంది.మనవరాలు కుసుమ్ నామ్దేవ్ ఖాడే భూసేకరణకు బదులుగా వెస్టన్ కోల్ ఫీల్ లిమిటెడ్లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంది, కానీ మనవరాలికి ఉద్యోగం ఇవ్వకూడదనే నిబంధనను పేర్కొంటూ యాజమాన్యం ఆ దరఖాస్తు తిరస్కరించింది.ఎచ్ఎంఎస్ నాయకుడు శివకుమార్ యాదవ్ ప్రయత్నాలతో, ఈ విషయానికి సంబంధించి నాగ్పూర్ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఈ కేసును విచారించిన హైకోర్టు 11 ,మార్చి , 2025న ఈ విషయంపై తీర్పు వెలువరించింది. మనవరాలిని కుటుంబంలో భాగంగా పరిగణించరాదని వెస్టన్ కోల్ ఫీలడ్స్ లిమిటెడ్ సర్క్యులర్లో జారీ చేసిన ప్రకటనపై హైకోర్టు తన నిర్ణయంలో వ్యాఖ్యానించింది. హైకోర్టు డబ్ల్యూ సిఎల్ సర్క్యులర్ను లింగ పక్షపాత విధానాన్ని కలిగి ఉందని పరిగణించింది. డబ్ల్యూ సీఎల్ సర్క్యులర్ను తిరస్కరిస్తూనే, మనవరాలికి కూడా ఉద్యోగం కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాగా సింగరేణి బొగ్గుగనుల్లో వారసులుగా కొడుకు,అల్లుడు ,కోడలు,కూతురు లకు ఉద్యోగాలు ఇస్తున్నారు . మరి ఇక నుంచి మనవరాలు కు కూడా ఉద్యోగాలు ఇస్తారా చూడాలి . అయితే బాంబే హైకోర్టు నాగ్పూర్ బెంచ్ ఉత్తర్వు ప్రకారం భూములు ఇచ్చిన మనవరాలు కు ఉద్యోగాలు ఇవ్వాలని ఇచ్చిన తీర్పు కాబట్టి కేవలం భూములు ఇచ్చిన మనవరాలు కు మాత్రమె ఉద్యోగాలు ఇస్తారా.. లేక వేరే రకంగా ఉద్యోగ అవకశాలు కలిపిస్తారా చూడాలి మరి.

# సంగారెడ్డిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**మున్సిపల్ అధికారులు మిషన్ భగీరథ సిబ్బందితో కలెక్టర్ సమీక్ష**



**సంగారెడ్డి మార్చి 27 (మనం న్యూస్ ప్రతినిధి):** సంగారెడ్డి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా , నిరంతరంగా శుద్ధమైన త్రాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ ఇంజనీర్లు, మున్సిపల్ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. శుక్రవారం మిషన్ భగీరథ ఇంజనీర్లు , మున్సిపల్ కమిషనర్లతో కలిసి పట్టణం లోని డ్రైవర్స్ కాలనీ లోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ వద్ద సమీక్ష సమావేశాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు ముఖ్యంగా వేసవిలో నీటి ఎద్దడి సమస్య ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలంలో నీటి అవసరాలకు అనుగుణంగా తగినన్ని వాటర్ ట్యాంకులను సిద్ధం చేయాలని సూచించారు. అంతేకాకుండా, ప్రత్యామ్నాయ నీటి వనరులను ఉపయోగించి పట్టణం , గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాను నిరంతరంగా కొనసాగించాలని ,జిల్లా లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు . పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించడమే కాకుండా, నీటి వృధాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అమృత జల్ 2.0 పథకం కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో డ్రైవర్స్ కాలనీ లోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ పరిశీలించారు. పట్టణ ప్రజలకు ప్రతి రోజు తాగునీరు సరఫరా చేసే విధానాన్ని , రాజంపేట ఫిల్టర్ బెడ్ను సందర్శించి వాటర్ క్లీనింగ్ ప్రక్రియ, నీటి నిల్వ వివరాలను అడిగితెలుసుకున్నారు . మిక్సింగ్, క్లోరినేషన్ ప్లాంట్ల నిర్వహణపై సమగ్ర అవగాహన కలిగివుండాలని అన్నారు . సంగారెడ్డి పట్టణంలో సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేకంగా, వేసవి కాలంలో పట్టణ పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి సరఫరాతో పాటు పట్టణంలోని పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపర్చేందుకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ ఈ రఘువీర్ , ఈ ఈ విజయలక్ష్మి , మునిసిపల్ కమిషనర్ ఎస్ సి వి కె చవాన్ , మునిసిపల్ డిప్యూటీ ఇంజనీరింగ్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ , పబ్లిక్ హెల్త్ అధికారి కృష్ణ మోహన్ , ఏ ఈ రఘువీర్ , అద్దికారి అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రెనే హాస్పిటల్‌లో చర్మ, కాస్మోటిక్ వైద్య సేవలు



**కరీంనగర్ టౌన్,మార్చి21( మనం న్యూస్)** స్థానిక రెనే హాస్పిటల్లో హైదరాబాద్ కి చెందిన డా. రీతూ రావు చర్మ కాస్మోటిక్ వైద్య సేవల విభాగాన్ని సీనియర్ ఇన్ఫర్టిలిటీ వైద్యురాలు, రెనే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.బంగారి రజనీ ప్రియదర్శిని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.బంగారి రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ నేడు చాలా మంది ఎదుర్కొంటున్న కాస్మోటిక్ ,చర్మ సమస్యలకు హైదరాబాద్ కి వెళ్ళాల్సి వస్తుందన్నారు. అతి తక్కువ ఖర్చులో అందించే విధంగా సామాన్యునికి కూడా అసమాన వైద్యం రెనే హాస్పిటల్ లో హైదరాబాద్ కి చెందిన డా.రీతూ రావు వైద్య సేవల ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

ఈ సదవకాశాన్ని ఉమ్మడి తెలంగాణా ప్రజలందరూ వినియోగించు కోవాలని అన్నారు. కాస్మోడర్మటాలజిస్ట్ డా.రీతూ రావు మాట్లాడుతూ నేడు ఎంతో మంది చిన్న వయసులోనే కాస్మోటిక్ సమస్యలు అంటే జుట్టు రాలిపోవడం, బట్టతల రావడం, పలు రకాల చర్మ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని వారు హైదరాబాద్ లాంటి పట్టణాలకు వచ్చి వైద్యం చేయించుకునే సమయం , స్థోమత లేని కారణంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కి చెందిన ఆడబిడ్డగా తను ఇక్కడి ప్రజలకు కాస్మోటిక్ వైద్య సేవలు అందించాలి అన్న సంకల్పంతో ప్రతి నెల నాల్గవ శుక్రవారం స్థానిక రెనే హాస్పిటల్ లో అందుబాటులో ఉంటానని అన్నారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఫాగ్సీ అధ్యక్షురాలు, సీనియర్ స్త్రీల వైద్య నిపుణురాలు డా.స్వీతీ అనూప్ రావు, ఇండియన్ మెడికల్ అసోసియేన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్, సీనియర్ జనరల్ సర్జన్ డా.అనూప్ రావు, తెలంగాణా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు డా.బి. ఎన్.రావు, రెనే హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రవీంద్రా చారి, గుండె వైద్య నిపుణులు డా.దినకర్, సీనియర్ ఫీజీషియన్ డా.నిఖిల్ లక్ష్మణ్, డీన్ డా. మునీష్, డా.కృష్ణా రెడ్డి, డా. లతీశ్ రెడ్డి, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్ , హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి స్థల పరిశీలన

- **త్వరలోనే భూ సేకరణ... పనుల ప్రారంభం**
- **సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి**



**దుబ్బాక, మార్చి 21, (మనం న్యూస్):** ప్రజలకు, అడ్వకేట్లకు అనుగుణంగా ఉండే విధంగా దుబ్బాక నియోజకవర్గ కేంద్రంలో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడానికి అవసరమైన భూ సేకరణ త్వరగా పూర్తి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం కోసం అవసరమైన స్థల పరిశీలనకై శుక్రవారం నాడు జిల్లా జడ్జి సాయి రమాదేవి, ఆర్డీఓ సదానందంలతో కలిసి కలెక్టర్ దుబ్బాక పట్టణంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని పాత ప్రభుత్వాసుపత్రి, ప్రస్తుత కోర్టు ఆవరణతోపాటు సబ్ ట్రెజరీ కార్యాలయాలను పరిశీలించారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనల ప్రకారం కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి అన్ని విధాలుగా సరిపోయేలా ఉండేందుకు తప్పనిసరిగా నాలుగు ఎకరాల స్థలం ఉండాలని, అందుకు అనుగుణంగా దుబ్బాకలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలం పరిశీలించి సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలించినట్లయితే మూడెకరాల వరకు స్థలం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 1 ఎకరం 32 గుంటల భూమిని కోర్టుకు అప్పగించడం జరిగిందని, మిగతా భూమిని ఆర్డీఓ, ఆర్ అండ్ బి శాఖ అధికారులు పర్యవేక్షించి ప్రస్తుత కోర్టు ఆవరణ వరకు దారి నిర్మించేలా కాంప్లెక్స్ స్ట్రక్చర్ రూపొందించి అందించినట్లయితే త్వరలోనే అవసరమైన భూ సేకరణ పూర్తి చేసి కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా కోర్టుకు వచ్చే ప్రజలతోపాటు ఇక్కడి అడ్వకేట్లకు ఎంతగానో సదుపాయంగా ఉంటుందన్నారు. ఆయన వెంట ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



- **పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు**
- **పరీక్ష కేంద్రాలు పరిశీలించిన జిల్లా అధికారులు**

**సిద్దిపేట, మార్చి 21, (మనం న్యూస్ ప్రతినిధి) :** సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు శుక్రవారం రోజున ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలు ప్రశాంతంగా సాగేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 163 బి.ఎన్.ఎస్.స్ సెక్షన్ అమలు చేశారు. కాగా పరీక్షలు జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్, అడిషనల్ కలెక్టర్లు మొదటి రోజు సిద్దిపేట జిల్లా కేంద్రంలో పరిశీలించారు. పోలీస్ కమీషనర్ రంగధాంపల్లి జెడ్పిహెచ్.ఎస్. పాఠశాల, ఎస్.ఆర్.కే. టెక్నో స్కూల్, జిల్లా కలెక్టర్ శ్రీ చైతన్య పాఠశాల, ఎస్.ఆర్.కె. డిజి హై స్కూల్, పారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలు సందర్శించగా, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఇందిరానగర్ జెడ్పి హెచ్.ఎస్., ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 79 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమీషనర్ తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, మంచినీరు, మెడికల్ క్యాంపు నిర్వహించి ఓఆర్.ఎస్ ప్యాకెట్లు విద్యార్థులకు అందుబాటులో ఉంచాలన్నారు.

## గోదావరి కన్నీటి గోస



- **రామగుండం మాజీ శాసనసభ్యుడు కోరుగంటి చందర్**

**సిద్దిపేట అర్బన్, మార్చి 21, (మనం న్యూస్) :** కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తెలంగాణలో ప్రతి రైతన్న పాడిపంటలతో ఆనందంగా ఉండాలని మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని రామగుండం మాజీ శాసనసభ్యుడు పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుగంటి చందర్ అన్నారు. గోదావరి కన్నీటి గోస పేరుతో ఐదు రోజులుగా చేపట్టిన మహా పాదయాత్ర శుక్రవారం సిద్దిపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. పెద్ద ప్రభుత్వ హయాంలో నిర్మించిన మేడిగడ్డ కాళేశ్వరం ప్రాజెక్టు గండి పడనుంది అని అబద్ధ ప్రచారం చేసి ఇప్పుడు రైతులకు సాగునీరు తాగునీరు ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారు. తెలంగాణలో ఏ ఒక్క రైతు ఆత్మహత్య చేసుకోకూడదు అని మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ దశదిశలు మారిస్తే కాంగ్రెస్ దాన్ని తప్పుదోవ పట్టడం సిగ్గుచేటు అన్నారు. గోదావరి నది 365 రోజులు సజీవంగా ఉండేదని అసమర్థ కాంగ్రెస్ పాలన వల్ల గోదావరి నది ఎండిపోయింది అన్నారు. ఎండిపోయిన గోదావరి నుండి 180 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజల సంక్షేమంపై ఆలోచించాలన్నారు. గతంలో గోదావరిలో ఎలా నీళ్లు ఉన్నాయో అలా నీళ్ళు రావాలని లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

## రాయితీపై వ్యవసాయ పనిముట్లు

- **జిల్లా వ్యవసాయ అధికారి రాధిక**



**సిద్దిపేట, మార్చి 21, (మనం న్యూస్ ప్రతినిధి):** జిల్లాలోని మహిళా రైతులందరికి 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వం 50 శాతం రాయితీపై ప్రత్యేకించి మహిళా రైతులకు వ్యవసాయ పనిముట్లను అందించనుందని తెలిపారు. వివిధ రకాలైన ట్రాక్టర్ అనుబంధ పనిముట్లతోపాటు డ్రోన్, స్ప్రేయర్లు, ప్లాంట్ ప్రొటెక్షన్ పనిముట్లు, పవర్ వీడర్లు వంటి వాటితోపాటు వివిధ రకాల పనిముట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రాయితీ పొందాలనుకునే మహిళా రైతులు దరఖాస్తు పత్రంతోపాటు భూమి పాస్ బుక్, ఆధార్ కార్డును జత చేయాల్సి ఉంటుందని, పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకునే రైతుల పేరున తప్పనిసరిగా భూమి ఉండాలన్నారు.

## బీసీ మహాసభ విజయవంతం

- **శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు**



**మంచిర్యాల, మార్చి 21( మనం న్యూస్):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో ప్రథమ బీసీ మహాసభ ఏరియాలో బీసీ మహాసభ కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించగా, అందరు బిసి ఉద్యోగుల ఐక్యత, శ్రమ ఫలితంగా విజయ వంతమైందని, ఈ ఐక్యతను గుర్తించి, సింగరేణి లోని 11 ఏరియాలకు లైజనింగ్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారని శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాకు లైజన్ ఆఫీసర్ గా నియమితులైన ఎస్ఓటు జి.ఎం. సత్యనారాయణను శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సింగరేణి బీసీ అధికారులు, ఉద్యోగులు జీఎం ఆఫీస్ కార్యాలయం లోఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ,గత ఏడాది అక్టోబర్ నుంచి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలో బీసీ మహాసభ కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించగా, మన ఐక్యత, శ్రమ ఫలితంగా ప్రథమ బీసీ మహాసభ విజయవంతం , ఈ నియామకం అని అన్నారు . ఇక ముందు కూడా ఇదే విధంగా ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు . ఈ సన్మాన కార్యక్రమం బీసీ ఉద్యోగుల ఐక్యతకు మరో మైలురాయిగా నిలిచిందని, భవిష్యత్తులో హక్కుల సాధన కోసం సమష్టిగా ముందుకు సాగాలని, మరిన్ని విజయాలను సాధించాలని నాయకులు, సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అధికారులు, నాయకులు, ఉద్యోగ సోదరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో నాయకులు ముస్కె సమ్మయ్య ,డీజీఎం (పర్సనల్) అరవింద్ రావు, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ (ఐటీ మేనేజర్) శ్రీనివాస్,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్,సీనియర్ అండర్ మేనేజర్ కొత్తపల్లి రవీందర్,అడిషనల్ మేనేజర్లు శ్రీధర్, హనుమాన్ గౌడ్,డివైపీఎంలు రాజేశ్వరరావు, కాంతారావు, రాజేష్ , రఘురాం, సీనియర్ పీఓ రణదీప్ గౌడ్, సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం బ్రాంచ్ కార్యదర్శులు బి. మారుతి, బద్రి బుచ్చయ్య, ట్రెజరర్ మల్లేష్,అమరగొండ మహేష్,సంతోష్, వినోద్, లక్ష్మణ్, రామ్ చందర్, సందీప్, సత్యం, విజయ్ కుమార్, సారంగపాణి, కుమారస్వామి, కన్నం సాంబయ్య, కోతి శ్రీధర్, తిరుపతి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇటుక బట్టీలు ఇక్కడ...అధికారులఎక్కడ..?

- వసూళ్ల పైనే శ్రద్ధ..ఆక్రమాల అడ్డుకట్టపై లేదు..
- అలసత్వంలో విద్యుత్,చైల్ వెల్ఫేర్ రెవెన్యూ,ఆటవీశాఖలు...
- లక్షల్లో ప్రభుత్వానికి నష్ట వాటిల్లుతున్న పట్టని అధికారులు



లక్ష్మీదేవిపల్లి,మార్చి 21 (మనం న్యూస్)ః మండలంలో ఇటుకబట్టీలకి మట్టిని తోడుతున్నారు..అడవుల్లో నుంచి చెట్లు నరికి కలపను ఆక్రమంగా తరలించి మండిస్తున్నారు.అదే ఇటుక బట్టిల్లో బాల కార్మికులను సైతం వినియోగిస్తున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. ఇలా అక్రమంగానే ఇటుక బట్టీల నిర్వాహణ జరుగుతుందనేది బహిరంగ రహస్యం..ఇలా లక్షల్లో రూపాయలను ఆర్జించడానికి కలపను,మట్టిని బట్టీల యజమానులు ఇష్టం వచ్చినట్లు ఉపయోగిస్తున్నా సంబంధిత శాఖల అధికారులలో ఏ ఒక్క అధికారి కూడా కన్నెత్తి చూడకపోవడం విశేషం.ఇటుక బట్టిల వ్యాపారులు అధికారులకు మామూళ్లను సమర్పించడం వల్లే వారి వ్యాపారానికి వంత పాడుతున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. వీరిలో రెవెన్యూ, ఫారెస్టు, విద్యుత్ శాఖ అధికారులు అండదండలు మెండుగా ఉండటంతోనే ఇలా యథేర్చగా ఏవరి భయం లేకుండా పనుల కొనసాగిస్తున్నారని తెలుస్తోంది.పెద్ద ఎత్తున మట్టిని,కలపను వినియోగిస్తు పర్యావరణానికి హానిని కలిగిస్తున్నప్పటికి అధికారుల్లో చలనం లేదని, ప్రకృతి ప్రేమికులు మండిపడుతున్నారు.ఆక్రమ ఇటుకబట్టీలపై అధికారులకు ఎందుకు అంత ఉదాసీనత అనేది 100 డాలర్ల ప్రశ్నగా మిగిలుతుంది.అధికారుల్లో కొందరు అమ్యామ్యాలకు అలవాటు పడి వాళ్ల దగ్గర నుండి పసూళ్ల పైన శ్రద్ధ చూపుతున్నారు. కాని ఆక్రమాలపై దృష్టిని సారించడం ఆశ్రమాలకు అడ్డుకట్ట వేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని హేమచంద్రపురం అనిశెట్టిపల్లిలో ఇటుకబట్టి యజమానులు తాము అటుకలను తయారు చేయడానికి అక్రమ మార్గంలో మట్టిని, కలపను ఆయా అధికారులకు మామూళ్లను అందజేస్తున్నామని మమ్మల్ని ఏ అధికారులు అడిగే దర్యం చేయరని బట్టిల యజమానులు అంటున్నారంటేనే అర్ధం అవుతుంది. ఇటుకబట్టీల దారులతో కొంతమంది అధికారుల కు సంబంధాలు ఏంటని పలువురు చర్చించుకుంటున్నారు.

**అక్రమ ఇటుకబట్టీల యజమానులపై చర్యలు శూన్యం..**

లక్ష్మీదేవిపల్లిలోని హేమచంద్రపురం అనిశెట్టిపల్లి పరిధిలోని ఎనిమిది ఇటుకబట్టీలకు అక్రమంగా మట్టిని,కలపను ఉపయోగిస్తున్నారని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన చర్యలు శూన్యమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై ఫిర్యాదు చేసినా పత్రిక కథనాలు వస్తున్న కాని సంబంధిత ఏ అధికారి స్పందించకపోగా ఆయా ఇటుకల తయారి యజమానుల నుండి మూముళ్లను వసూల్ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.ఒక వేల ఎవరైన అధికారులు వస్తే ముందస్తుగా సమాచారం ఇటుకబట్టి యజమానులకు ఆయా శాఖలలో పనిచేసే అధికారులోని కిందిస్థాయి సిబ్బంది లో కొందరు బట్టి యజమానులకు సమాచారం ఇస్తున్నారని,మద్య వర్తిగా వ్యవహరించి మామూళ్లను అందజేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటుకల తయారిలో ఆక్రమంగా మట్టిని, కలపను వినయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత





మధిర,మార్చి21(మనం న్యూస్): మార్చి 24 ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ కళావతి భాయ్ మరియు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వి సుబ్బారావు ఆదేశాల మేరకు మధిర కస్తూరిబా ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు అయినా వారానికి మించిన దగ్గు , ఆకలి మందగించడం బరువు తగ్గడం సాయంత్రం జ్వరం రావడం చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు తెమడ పరీక్ష చేయించుకోవాలని, క్షయ అంటువ్యాధి కనుక ఇతరులకు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకొని మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి క్షయ వ్యాధి నిర్మూలనకు కృషిచేయాలని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు .ఈ కార్యక్రమంలో డాక్టర్ పృధ్వి నాయక్, టీబి నోడల్ ఆఫీసర్ విజయ్ కుమార్ , సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ సందీప్ సీనియర్ ట్రీట్మెంట్ ల్యాబ్ సూపర్వైజర్ శివ, ప్రిన్సిపల్ శిరీష హెల్త్ సూపర్వైజర్ కొండయ్య హెచ్.వి సుబ్బలక్ష్మి స్టాఫ్ నర్స్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## తొలి రోజు పది పరీక్షలు ప్రశాంతం

- పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 21(మనం ప్రతినిధి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం పదవ తరగతి పరీక్షల ప్రారంభంలో భాగంగా తొలిరోజు కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని లిటిల్ బరడ్స్ పాఠశాల మరియు పాల్వంచలోని కేటీపీఎస్ కాలనీలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఏర్పాటుచేసిన వసతులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష రాసే తరగతులను, సీసీ కెమెరాలు అమరిక, పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు మరియు విద్యార్థులు కూర్చుని పరీక్ష రాసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన బెంచీలను గమనించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పరిక్షా కేంద్రాల చుట్టూ ప్రహరీ గోడలు సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలని చిత్తు కాగితాలు లేకుండా, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిబంధన ప్రకారం వసతులు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లకు లోను కాకుండా పరీక్షలు మంచిగా రాయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా మొదటిరోజు ఉదయం 9:30 గంటల నుండి ప్రారంభమైన పరీక్షలు మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగాయని, జిల్లావ్యాప్తంగా 12,269 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 99% హాజరు నమోదు అయిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలకు విద్యార్థులందరూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారని, తొలి రోజు విద్యార్థులందరూ ప్రశాంతంగా పరీక్షలు రాశారని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులు ఒత్తిడికి గురు కాకుండా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పరీక్ష కేంద్ర సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు

- అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి



ఖమ్మం, మార్చి-21(మనం ప్రతినిధి): అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకులు సకాలంలో ఋణాలు అందించి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అన్నారు. 2024-25 వార్షిక ఋణ ప్రణాళికలో డిసెంబర్ 2024 వరకు 3610.49 కోట్లు స్వల్పకాలిక పంట ఋణాలుగా అందచేయడం జరిగిందని, వ్యవసాయ టర్మ్ ఋణాలుగా వ్యవసాయ రంగానికి 1801.04 కోట్లు బ్యాంకుల ద్వారా ఇవ్వడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ ఋణాలను సకాలంలో అందించి లక్ష్యాలను సాధించాలని, రైతులు పంట ఋణాలు సకాలంలో చెల్లించేలా అధికారులు క్షేత్ర స్థాయిలో శ్రద్ధ కనబరచాలని అదనపు కలెక్టర్ తెలిపారు. సూక్ష్మ ఋణాల క్రింద సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలకు గాను 1569.82 కోట్లు ఇవ్వడం జరిగౌదని, విద్యా ఋణాలుగా 24.63 కోట్లు, గృహ ఋణాలుగా 73.97 కోట్లు అందించడం జరిగిందని ఆయన అన్నారు. ప్రాధాన్యతా రంగాలకు మొత్తంగా 7818.81 కోట్లు అందించడం జరిగిందని తెలిపారు. అప్రాధాన్యత రంగాలకు 3644.19 కోట్లు అందించినట్లు, మొత్తంగా జిల్లాలో 11463 కోట్లు డిసెంబర్, 2024 మాసము వరకు బ్యాంకుల ద్వారా అందించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు సకాలంలో ఋణాలు అందచేసి లబ్దిదారులకు ప్రయోజనం కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో 891 మహిళా సంఘాలకు 2024-25 సంవత్సరానికి రూ. 17769.95 లక్షల బ్యాంక్ లింకేజీ ఋణాలు ఇప్పటి వరకు అందించామన్నారు. అర్హత ఉన్న సంఘాలకు ఋణాలు అందించాలని తెలిపారు. పి.ఎం.ఇ.జి.పి., పి.ఎం.ఎఫ్.ఎం.ఇ. ఋణాలు లబ్దిదారులకు సకాలంలో అందించాలని ఆయన సూచించారు. పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి లబ్దిదారులకు కిసాన్ క్రెడిట్ ఋణాలు సకాలంలో ఇవ్వాలని తెలిపారు. రిజర్వు బ్యాంకు సూచనల మేరకు నూరు శాతం ప్రజలకు డిజిటల్ సేవలు అందించేలా కృషి చేయాలని, దీనికి బ్యాంకులు ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పోటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ 2025-26 ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, ఆర్బీఐ ఎల్డిఓ పల్లవి, నాబార్డ్ డిడిఎం సుజిత్ కుమార్,ఎస్బిఐ ఆర్ఎం జి. లింగస్వామి, యుబిఐ డిజిఎం హనుమంత రెడ్డి, టిజిఎం ఆర్ఎం విజయ్, ఇంచార్జ్ ఇడి ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వాసవి రాణి, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎస్ఎస్‌సి పరీక్షలు



- మండల విద్యాశాఖ అధికారిని గాదే అనితాదేవి

మరిపెడ, మార్చి 21 (మనం న్యూస్): పదవ తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించామని మరిపెడ మండల విద్యాశాఖ అధికారిని గాదే. అనితదేవి తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం 1) తెలంగాణమోడల్ స్కూల్ లో200/200 2) జెడ్పిహెచ్ఎస్ సీతారాంపురం 126/126 3) జడ్.పి.హెచ్.ఎస్ మరిపెడ 135/135, ,4) సోషల్ వెల్ఫేర్ స్కూల్ 178/200,5) టీఎస్ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ 178/178 మంది విద్యార్థులు హాజరయ్యారు అన్నారు. మొత్తం విద్యార్థులు 839 గాను ఇద్దరు పిల్లలు గైర్హాజరు కాగా 837 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ప్రశాంతంగా మొదటి పరీక్ష విద్యార్థులు ప్రశాంతంగా వ్రాశారని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా, ఒత్తిళ్లకు లోను కాకుండా, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు వ్రాసి 100కు 100% ఉత్తీర్ణత సాధించాలని కోరారు.

# ఆకులు రాలుతున్న వేళ...

- నేలకూలుతున్న అన్నలు
- నీరుకారుతున్న విప్లవం
- కేంద్రం పంతం ఫలించేనా
- ఉనికిని కోల్పోతున్న మావోయిస్టులు



చర్ల, మార్చి 21 (మనం న్యూస్) : పచ్చటి అడవులలో ఆకులు రాలుతున్న వేళ అన్నలు నేలకూలుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట గత ఏడాదిన్నరగా మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతోంది. దండకారణ్యంలో వేల సంఖ్యలో పారామిలిటరీ బలగాల బేస్ క్యాంప్ లను ఏర్పాటు చేసి అన్నలపై ముప్పేట దాడికి దిగుతున్నారు. ఊహించని విదంగా శతృదుర్భేద్యమైన మావోయిస్టుల ఇలాఖాలోకి బందూకులతో దూసుకుపోతున్నారు. భద్రతా బలగాల వ్యూహాలు మావోయిస్టులకు అంతుచిక్కకపోగా దడపుట్టిస్తున్నాయి. పటిష్ఠమైన వేగుల వ్యవస్థను నిర్మించుకున్న భద్రతా బలగాలు మావోయిస్టులపై గురిచూసి కొడుతున్నాయి. గత ఏడాది జరిగిన వివిద ఎన్ కౌంటర్లలో 287 మంది మావోయిస్టులు మృతి చెందగా వందల సంఖ్యలో లొంగుబాటులు, అరెస్ట్ లతో మావోయిస్టు పార్టీ డీలాపడింది. ఈ ఏడాది ఇదే వరవడిని కొనసాగిస్తూ 78 రోజులలో 97 మందిని మట్టుబెట్టి విప్లవంను నీరు కార్చేయత్నం ముమ్మరం చేసారు. ఈ క్రమంలో 12 మంది జవాన్లు సైతం కన్నుమూసారు. ఈ ఏడాది ఛత్తీస్ ఘడ్ లో 14 ఎన్ కౌంటర్లు జరగగా అందులో ఐదు భారీ ఎన్ కౌంటర్లు కావడం గమనార్హం. జనవరి 16 న బీజపూర్ జిల్లా పూజారి కాంకేర్ - మారేడుబాక అటవీప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పులలో 12 మావోయిస్టులు మృతి చెందారు. జనవరి 21 న గరియాబంద్ జిల్లా మొయిన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిది కుల్హాదీఘాట్ అటవీప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పులలో కేంద్ర కమిటి సభ్యుడు చలపతి సహా 18 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఫిబ్రవరి 2 వ తేదీన బీజపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిది తోడ్క అటవీప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పులలో 8 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఫిబ్రవరి 9 న బీజపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీప్రాంతంలో జరిగిన అతి భారీ ఎదురుకాల్పులలో 31 మంది మావోయిస్టులతో సహా ఇద్దరు జవాన్లు మృతిచెందారు. తాజాగా మార్చి 20 న బీజపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిది ఆంద్రి అడవులలో జరిగిన ఎదురుకాల్పులలో 26 మంది మావోయిస్టులు ఒక డి ఆర్ జి జవాన్ మృతి చెందారు. ఇదేరోజు కాంకేర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పులలో మరో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. గతంలో జరిగిన ఎదురుకాల్పులు అడవి పచ్చగా ఉన్నప్పుడు జరిగినవి కావడం గమనార్హం. ఇకపై అడవులు ఆకులు రాలి మనుషుల సంచారం ఎక్కడ ఉన్నా ఇట్టే కనిపెట్టేయవచ్చు. ఈ నేపద్యం మావోయిస్టులకు గడ్డుకాలంగా చెప్పవచ్చు. ప్రస్తుత పరిస్దితులను బట్టిచూస్తే భవిష్యత్ మావోయిస్టులకు మరిన్ని చేదు జ్ఞాపకాలను మిగిల్చేలా కనిపిస్తోంది. ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లు, లొంగుబాటులు, అరెస్ట్ లతో మావోయిస్టు పార్టీ ఛత్తీస్ఘడ్ లో ఉనికి కోల్పోయే పరిస్దితి నెలకొందని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఆంద్రీ ఎన్ కౌంటర్ నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ట్వీట్ ప్రభుత్వం నమ్మకాన్ని తెలియచెబుతోంది. 2026 మార్చి 31 నాటికి అంటే సరిగ్గా మరో ఏడాదికి దేశంలో మావోయిజాన్ని నిర్మూలిస్తామని విశ్వాసంతో ఉన్న కేంద్రం ఆదిశగా వడివడిగా అడుగులు వేస్తోందనే భావన కనిపిస్తోంది. కాని మానవ హక్కుల సంఘాలు మాత్రం మావోయిజం నిర్మూలన అంత సులువు కాదని భావిస్తున్నాయి. ప్రతికూల పరిస్దితుల కారణంగా కొన్నాళ్లు స్దబ్దగా ఉన్నా కొద్ది రోజుల తర్వాత పుంజుకుంటుందని విశ్లేషిస్తున్నారు.

## సిసి రోడ్లతోనే గ్రామాలకు మహర్దశ



- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వం
- మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం

కురవి, మార్చి 21( మనం న్యూస్) : కాంగ్రెస్ ప్రభుత్వం తోటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మండల పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ నూకల వేణుగోపాల రెడ్డి తో కలిసి సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ సారధ్యంలో మండలంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిందని బీసీ లదరూ కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉండి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం లో గ్రామాలు అభివృద్ధి చెందు తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రజనీకాంత్. గ్రామ పార్టీ అధ్యక్షులు బానోతు రమేష్. బద్ర నాయక్ గోపా నాయక్. శరావత్ వల్మానాయక్. భానోత్ దీప్లా నాయక్. రవి నాయక్. తన్సింగ్ నాయక్. తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్య పై అధికారులతో సమీక్షించిన షబ్బీర్ అలీ



కామారెడ్డి, మార్చి 21 ( మనం జిల్లా ప్రతినిధి ) ః ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలతో నీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తొ కలిసి కామారెడ్డి పట్టణం, నియోజకవర్గం లో త్రాగునీటి సమస్య పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ఈ వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటి సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. త్రాగునీటి సమస్య పరిష్కరించే దిశగా అధికారులు చేయాలు తీసుకోవాలని అన్నారు. సమస్యలు ఉత్పన్నం కాకముందే ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. కామారెడ్డి మున్సిపల్ ఏరియాలో అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా చేపడుతున్న పనులపై ఆయన సమీక్షించారు. మిషన్ భగీరథ ద్వారా చేపట్టే పైప్ లైన్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఏరియాలో రోజుకు రెండు సార్లు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పట్టణంలో 33/11 కే.వి. అండర్ గ్రౌండ్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించి కేటాయించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, త్రాగునీటి అవసరాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని, అవసరమేరకు ఉన్నతాధికారులకు వివరించి నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కామారెడ్డి పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, రంజాన్ పండుగ నేపథ్యంలో రోజుకు రెండుసార్లు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పట్టణంలో 33/11 కే.వి. సబ్ స్టేషన్ కోసం అవసరమైన భూమిని గుర్తించాలని అదనపు కలెక్టర్ కు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రాజేందర్ రెడ్డి, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆ ఇద్దరి మధ్య వర్గ పోరు

- పోచారం శ్రీనివాస్ రెడ్డి పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు
- కలెక్టరేట్ కు భారీగా తరలివచ్చిన ఏనుగు రవీందర్ రెడ్డి కార్యకర్తలు



నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 21( మనం న్యూస్)ః గత కొన్ని సంవత్సరాలుగా బాన్సువాడ నియోజకవర్గం లో ప్రస్తుతం ఉన్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ల విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. తన అనుచరులకి ఇప్పిస్తున్నారని, ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం కార్యకర్తలు భారీగా నిజామాబాద్ కలెక్టరేట్ కు తరలివచ్చారు. గ్రామ ప్రతిపాదనలు లేకుండానే తన అనుచారులకు కాంట్రాక్ట్ పనులు అప్పగిస్తున్నారంటూ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కు ఫిర్యాదు చేయడానికి నిజామాబాద్ కలెక్టర్ కు తరలివచ్చారు. ప్రధాన గేటు వద్దనే వారిని అడ్డుకొని లోనికి రాకుండా పోలీసులు భారీగా మోహరించారు. తమను లోనికి ఎందుకు అనుమతించ లేదంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ గేటు వద్దకు వచ్చి ఫిర్యాదులను స్వీకరించారు.నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్ట్ పనులుఅప్పగించడం పై విచారణ దత్తమని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాన్సువాడ నియోజకవర్గం నుండి దాదాపుగా150 వాహనాలు 500 మంది వరకు కార్యకర్తలు జిల్లా కలెక్టరేట్ కు తరలి రావడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. చివరికి అదనపు కలెక్టర్ ఫిర్యాదు స్వీకరించడంతో కార్యకర్తలు తమ ఆందోళన విరమించుకొని అక్కడినుంచి వెళ్ళిపోయారు.ఆ ఇద్దరి మధ్య జరుగుతున్న వర్గ పోరులో జిల్లా కలెక్టర్ ఏ వర్గానికి న్యాయం చేస్తారో వేచి చూడాల్సిందే మరి.

# జడ్పీ బాలుర హై స్కూల్ లో పేపర్ తారు మారు

- తెలుగు పేపర్ కు బదులు హిందీ పేపర్
- విద్యార్థులకు ఇచ్చిన హిందీ పేపర్ ను తీసుకుని తప్పును సరి దిద్దిన కలెక్టర్ ,అధికారులు



మంచిర్యాల, మార్చి 21( మనం న్యూస్): మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం నుంచి ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. అయితే మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు పేపర్ కు బదులు హిందీ పేపరు చేరిన సంఘటన మాత్రం సంచలనం సృష్టించింది. తెలుగు పేపర్ కు బదులు హిందీ పేపరు కేంద్రానికి చేరుకుని విద్యార్థులు ఇచ్చిన విషయాన్ని గుర్తించిన సిఎస్ జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లడం వెంటనే కలెక్టర్కు సమాచారం ఇవ్వడంతో అధికారులు బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకొని జరిగిన తప్పును సరిచేసి హిందీ పేపర్ ను విద్యార్థుల వద్ద నుంచి తీసుకుని తెలుగు పేపర్ ను విద్యార్థులకు ఇచ్చారు. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 9:30కు ప్రారంభం కావాల్సిన తెలుగు పరీక్ష 11:30 కు ప్రారంభమైంది. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆగ్రహం వ్యక్తం విచారణకు ఆదేశించారు. ఇక్కడి పరిక్ష కంద్రం సుపెరిందేంట్ ఆలీ తో పాటు కాస్టడియన్ అధికారి పద్మజను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వ్యులు జారీ చేశారు . ఈ సందర్భంగా ఇక మిగతా సెంటర్లో పరీక్ష ప్రశాంతంగా గడిచింది. కాగా ఈరోజు నుంచి ప్రారంభమైన పదవ తరగతి వరకు పరీక్షలు ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి. మంచిర్యాల జిల్లా మూత్రంలో 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4,730 మంది బాలురు,4,468 మంది బాలికల తో పాటు గతంలో పదవ తరగతి రాసి పాస్ కాని 21 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావడానికి అవకాశం కల్పించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా మూడు ఫ్లయింగ్ స్పాట్ బృందాలను నియమించారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష కేంద్రాల వద్ద బందోబస్తు పరీక్ష సమయంలో 144 సెక్షనములు పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేత పరీక్ష సమయానికి అనుకూలంగా విద్యార్థులకు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు టీజీఎస్ఆర్టిసి బస్సు సౌకర్యం నిరంతర విద్యుత్ సరఫరా ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది నియామకం అవసరమైన మందులు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ప్రశ్న జవాబు పత్రాలు సురక్షిత రవాణాకు అన్ని ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ ఇతర అన్యాయపదాలు కూడా చేసినట్లు విద్యాధికారి తెలిపారు. పరీక్ష నిబంధన ప్రకారం పరీక్షా కేంద్రంలో విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి పంపించారు. మొబైల్ ఎలాంటి ఎలక్ట్రిక్ పరికరాలను అనుమతించలేదు విద్యార్థుల హాల్ టికెట్లు కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల విషయంలో ఎవరికైనా సందేహాలు కానీ సమస్యలు కానీ వస్తే జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ లను మొబైల్ నెంబర్లు 7032463114, మరియు 9440688034 లతో ఏర్పాటు చేశారు. ఈ నెంబర్లను సంప్రదించవచ్చునని జిల్లా అధికారి తెలిపారు. గర్మిళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థుల కోసం ఏడు కథలను కేటాయించారు ఒక్కోవదిలో 24 మంది ఒక గదిలో 13 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఇక అదే విధంగా గోదావరి రోడ్ లోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో 254 మంది విద్యార్థులకు 11 గదులను కేటాయించారు. ఒక్క పదిలో 24 మంది చొప్పున ఒక గదిలో 14 మంది విద్యార్థులకు గదులను కేటాయించారు. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాల్సింది ఏమిటంటే పరీక్షా హాల వద్దకు విద్యార్థితో పాటు వారి తల్లిదండ్రులు కూడా పరీక్ష హాజరు టైంలో పరీక్ష రాసిన తర్వాత రావడంతో కొన్ని పరీక్షా కేంద్రాల వద్ద సరైన స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఏది ఏమైనా జిల్లావ్యాప్తంగా జరిగిన పదవ తరగతి వార్షిక మొదటి రోజు పరీక్షల్లో మంచిర్యాల పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సంఘటన మినహా పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

# బొగ్గు ఉత్పత్తిలో చరిత్ర సృష్టించిన భారత్



- ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్

మంచిర్యాల, మార్చి 21( మనం న్యూస్): బొగ్గు ఉత్పత్తిలో భారత్ చరిత్ర సృష్టించింది. ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని అధిగమించింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. 1 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని దాటడం ఒక అద్భుతమైన విజయం, ఇది ఇంధన భద్రత, ఆర్థిక వృద్ధి, స్వావలంబన పట్ల మన నిబద్ధతను హైలైట్ చేస్తుంది . ఈ ఘనత సాధించేందుకు తోడ్పడిన ప్రతి ఒక్కరి అంకితభావం, కృషిని కూడా ప్రతిబింబిస్తుంది. అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది నిజంగా ఒక చారిత్మాక మైలురాయిగా చెప్పవచ్చు. ప్రస్తుతం దేశంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగంతో పాటు ఇతర పారిశ్రామిక అవసరాల కోసం బొగ్గు చాలా ముఖ్యం. అయితే ఈ అవసరాల కోసం మన దేశం ఇతర దేశాలపై ఆధారపడి, అక్కడి నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటోంది. పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో దేశంలోనే ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం అనేది అసాధారణ విషయంగా చెప్పుకోవచ్చు. అని ప్రధాని నరేంద్ర మోదీ తన ట్వీట్ లో హర్షం వ్యక్తం చేశారు.

# జిల్లాలో ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

- 12785 మొత్తం విద్యార్థులు
- 127744 విద్యార్థులు హాజరు
- 41 మంది విద్యార్థులు గైర్హాజరు
- 997.హాజరు నమోదు
- పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



హైదరాబాద్, 21మార్చి, (మనం న్యూస్): పదవ తరగతి పరీక్షలను ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు.మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మహాత్మా గాంధీ రోడ్,క్రీస్తు జ్యోతి విద్యాలయం, భూత్పూర్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరును శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు వివరాలను అధికారుల నుండి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించడంతో పాటు, పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిభిరం, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా హాలులో నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వేసవి ఎండల దృష్ట్యా విద్యార్థులు ఏదైనా అస్వస్థతకు గురైతే, వెంటనే వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ఫోన్లను అనుమతించరాదని అన్నారు. ఎలాంటి మాల్ప్రాక్టీస్కి అవకాశం లేకుండా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి తొలి రోజు పరీక్షలకు మొత్తం12785 మంది విద్యార్థులు నమోదు కాగా, వీరిలో 12744 మంది హాజరై,99.68 హాజరు శాతం నమోదయ్యిందని,41మంది గైర్హాజరైనట్లు తెలిపారు. భూత్పూర్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న భోజనం ను పరిశీలించారు.మధ్యాహ్న భోజనం నాణ్యంగా అందించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు ఉన్నారు.

# అనుమతులను నిర్దేశిత గడువులోగా మంజూరు చేయాలి



- కలెక్టర్ విజయేందిర బోయి

హైదరాబాద్, 21మార్చి (మనం న్యూస్): జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ టి.జి. ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుండి మంజూరు చేయవలసిన అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు.శుక్ర వారం పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి హాజరై ఆమె మాట్లాడారు. టి ప్రైడ్ ద్వారా షెడ్యూల్ కులాల వారికి ఒకరికి ట్రాన్స్పోర్ట్ సెక్టర్ కింద ఒక కార్, ,షెడ్యూల్ తెగల వారికి ఇద్దరికి కార్,ట్రాక్టర్ అండ్ ట్రైలర్స్ వాహనాలకు, పెట్టుబడి సబ్సిడీ మంజూరు కు కమిటీ లో ఆమోదం తెలిపారు.ఇండస్ట్రియల్ ఎస్టేట్ లలో కనీస సదుపాయాలు సంబంధించి చిన్న చిన్న పనులు ఉంటే చేయాలని టి.జి. ఐ. ఐ.సి జోనల్ మేనేజర్ ను ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ పి.ప్రతాప్ రెడ్డి, ఎల్.డి.యం.భాస్కర్, భూగర్భ జల వనరుల శాఖ డి.డి.రమాదేవి, టి.జి. ఐ. ఐ.సి జోనల్ మేనేజర్ శ్రావణ్ కుమార్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు .

# ఎస్సీ వర్గీకరణ..బీసీ రిజర్వేషన్ బిల్లు చట్టబద్ధత చారిత్రకం

- కేసీఆర్ పాలనలో ఎస్సీ, ఎస్టీ,బీసీలకు తీవ్ర అన్యాయం
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దేశానికి రోల్ మోడల్
- తెలంగాణలో మళ్ళీ రేవంత్ రెడ్డియే సీఎం
- మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్



కల్వకుర్తి, మార్చి21(మనం న్యూస్): ఎస్సీ వర్గీకరణ..బీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించడం చారిత్రకమని మాజీమంత్రి చిత్తరంజన్ దాస్ పేర్కొన్నారు.శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని తన నివాసంలో మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని అన్నారు.ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ దిశా నిర్దేశంలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నాడని పేర్కొన్నారు.ఎస్సీ బీసీ వర్గాల మూడు దశాబ్దాల సమస్యలు తీర్చిన ఘనుడు సీఎం రేవంత్ రెడ్డి అని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సాహసోపేతమైన నిర్ణయాల వల్ల దేశంలోనే రోల్ మోడల్ సీఎంగా పేరుపొందారని పేర్కొన్నారు.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మూడు దశాబ్దాలుగా అలుపెరగని ఉద్యమం చేశారని ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పాలకులు ఎవ్వరు కూడా పట్టించుకున్న పాపాన పోలేదని సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనత రేవంత్ రెడ్డికు దక్కిందని అన్నారు.గత పాలనలో ఏ ముఖ్యమంత్రి కూడా పట్టించుకోలేని బీసీ రిజర్వేషన్ల అంశాన్ని రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో బీసీ బిల్లుకు చట్టబద్ధ కల్పించి 42 శాతం రిజర్వేషన్ వచ్చేలా చేశారని ఆయన పేర్కొన్నారు.పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో గత సీఎం కేసీఆర్ ప్రజా పాలనను గాలికి వదిలి కుటుంబ పాలనకు తేరదీశారని దుయ్యబట్టారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తన పాలనలో ఎమ్మెల్యేలకు మంత్రులకు కూడా కలిసే అవకాశం ఇచ్చే వారు కాదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

సాగునీటి ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలను దండుకొని నేడు ప్రజా పాలన గాలికి వదిలి ప్రతిపక్ష హోదాను మరిచి ఫామ్ హౌస్ కు పరిమితమయ్యారని కెసిఆర్ పై నిప్పులు చేరిగారు. తెలంగాణ రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా రంజకమైన బడ్జెట్ అని పేర్కొన్నారు.గతంలో ఎన్నడు లేని విధంగా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం బడ్జెట్ ను రూపొందించిందని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ ను విమర్శించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదని ఆయన పేర్కొన్నారు. వచ్చే 10 ఏండ్లు తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డియే ముఖ్యమంత్రిగా ఉంటాడని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద యాదవ్,కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ కల్వకుర్తి బ్లాక్ అధ్యక్షుడు గోపాల్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు పర్వపాకుల శేఖర్,నాయకులు సైదులుయాదవ్, రామాంజనేయులు,లక్ష్మయ్య గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు



- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, మార్చి 21( మనం న్యూస్): మంచిర్యాల జిల్లా జైపూర్ లోని సింగరేణి సంస్థ థర్మల్ విద్యుత్ ప్లాంట్ కు అదనంగా మంజూరైన మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ పరిధిలో అదనంగా మంజూరైన 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ సంబంధిత శిలాఫలకం ,ఎలీప్యాడ్, బహిరంగ సభ ఏర్పాటు చేసే స్థలాన్ని, సమావేశం మందిరాలను జిల్లా అదనపు కలెక్టర్ సభావతి మోతిలాల్ తో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ , మంచిర్యాల రాజ్యసభ మండల అధికారి శ్రీనివాసరావు, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ వనజా రెడ్డి ,లు కూడా పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జైపూర్ లోని విద్యుత్ ప్లాంట్ లో 9 వేల 500 కోట్ల వ్యయంతో అదనంగా 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ మంజూరైనట్లు తెలిపారు. ఈ విద్యుత్ ప్లాంట్ పనులను రాష్ట్ర ప్రముఖులతో ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సింగరేణి అధికారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గొప్పతనం, చరిత్ర ల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి




మంచిర్యాల, మార్చి 21( మనం న్యూస్): తెలంగాణా రాష్ట్రము లో ఎన్నో ముఖ్యమైన క్షేత్రాలు ఉన్నాయని , వాటి యొక్క గొప్పతనం, చరిత్ర ల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ఆచార్యులు అన్నారు . తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ - ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్, తెలుగు విభాగం-ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'తెలంగాణ క్షేత్రాలు - అక్షర దర్శనం' అనే అంశంపై రెండు రోజుల (21,22 శుక్ర ,శని) జాతీయ సదస్సు శుక్రవారం మంచిర్యాల కాలేజి రోడ్డు లో గల డిగ్రీ కళాశాలలో ప్రారంభించారు. మొదటి రోజు ప్రారంభ సమావేశానికి సభాధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వి చక్రపాణి , ముఖ్యఅతిథిగా ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కే రామకష్ణ లు వ్యవహరించగా , కీలక ఉపన్యాసాలు ఆచార్య సంగన భట్ల నరసయ్య , ఆత్మీయ అతిథిగా డాక్టర్ గండ్ర లక్ష్మణరావు ల తో పాటు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నరేందర్ రెడ్డి, చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి పట్టు వర్ధన్, సదస్సు సంచాలకులు డాక్టర్ శ్రీధర్ హరీష్ కుమార్, కళాశాల అధ్యాపక బందం, అధ్యాపకేతర బందం రాష్ట్రంలోని వివిధ కళాశాల నుంచి వచ్చిన ఆచార్యులు, సహాచార్యులు, అధ్యాపకులు సాహితీవేత్తలు, పత్రికా ప్రముఖులు, పరిశోధకులు ,విద్యార్థినీ,విద్యార్థుల సమూహంతో సభ సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వీ చక్రపాణి మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జాతీయ సదస్సు నిర్వహించడం ఇదే మొదటిసారని, ఈ అవకాశం ఏ కళాశాలకు దక్కలేదని, ఇది మన మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవకాశం రావడం ఎంతో గర్వకారణంగా చెప్పుకోవచ్చు అని అన్నారు . మొదటి రోజు సదస్సులో 35 మంది పరిశోధకులు ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలు క్షేత్రాల పై పరిశోధన పత్రాలను సమర్పించారు.

# ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడమే ప్రధాన లక్ష్యం

- పూర్తిస్థాయిలో ప్రమాదాల నివారణకు చర్యలపై సమీక్షా
- రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ



మంచిర్యాల, మార్చి 21( మనం న్యూస్): ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడమే ప్రధాన లక్ష్యమని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు .శుక్రవారం రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల ,పెద్దపల్లి జోన్ ల పరిధిలోనీ జాతీయ రహదారి ఎన్ .ఎచ్ -63, ఎన్ .ఎచ్ -363 మరియు రాష్ట్ర రహదారి ఎస్.ఎచ్-1, ఎస్.ఎచ్ -24, ఎస్.ఎచ్ -08, మిగతా రోడ్డు లలో 2022 నుంచి 2024 వరకు జరిగిన ప్రమాదాల వివరాలు, చని పోయిన వారి వివరాలు, ప్రమాదం గల కారణాలు, ప్రమాదాల నివారణ తీసు కొన్న చర్యలు, బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, తదితర అంశాలపై ట్రాఫిక్ పోలీస్, సంబందిత పోలీస్ స్టేషన్ ల అధికారులతో రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ 'రోడ్డు సేఫ్టీ' సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు . పోలీస్ అధికారులు, పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరుగు ప్రాంతాలను, బ్లాక్ స్పాట్స్ ను పవర్ గూగుల్ మ్యాపింగ్ ద్వారా సీపీ కి వివరించారు .సిపి మాట్లాడుతూ, రామగుండం పోలీస్ కమిషనర్ పరిధి మొదలు నుంచి చివరి వరకు ప్రయాణించే వారికి ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీ పై ఒక నమ్మకం, భరోసా కలగాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని , బ్లాక్ స్పాట్ల వద్ద పోలీస్, ట్రాఫిక్ అధికారులు, ఇతర సంబందిత అధికారులతో కలిసి స్పాట్స్ సందర్శించి ప్రమాదాలకు సంబందించిన కారణాలు గుర్తించాలని , నివారణ మార్గాలను గుర్తించి పరిష్కార మార్గాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. రేడియం స్టిక్కర్లతో కూడిన సూచికలను ఏర్పాటు చేయాలని, రహదారుల పై అవసరమైన చోట వాహన వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్స్ లను ఏర్పాటు చేయాలని, కెమెరాలు, లైట్లు, స్పీడ్ కెమెరాలు, జంక్షన్ ల వద్ద, పాదచారులు రోడ్డు దాటే దగ్గర జీబ్రా క్రాసింగ్, లైటింగ్, రోడ్డు రిఫ్లెక్టింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని సిపి సూచించారు. మీ మీ పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాలను సందర్శించాలని, ప్రతి విషయం తెలుసుకోవాలి, ఇన్ఫర్మేషన్ వ్యవస్థను పటిష్టం చేయాలి, రోడ్డుపై విజిబుల్ పోలీసింగ్ ఉండాలని , సిసి కెమెరాల ఏర్పాటు కు ప్రాముఖ్యత ఇవ్వాలని , నేర నియంత్రణలో ప్రధాన పాత్ర సీసీ కెమెరాలు పోషిస్తాయన్నారు . ప్రజలు రద్దీ ఉండే ప్రాంతాల్లో విసిబుల్ పోలీసింగ్ ఉండాలని, తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ కాకుండా స్నాచింగ్, రాబరీ, గంజాయి అక్రమ రవాణాను, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించవచ్చని, డ్యూటీ సమయంలో సిబ్బంది, అధికారులు స్వీయ రక్షణ పాటిస్తూ , జాగ్రత్తలు తీసుకోని విధులు నిర్వహించాలన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, ట్రాఫిక్ ఏసిపి నరసింహులు, టాస్క్ ఫోర్స్ ఏసిపి మల్లారెడ్డి, రామగుండం ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఐటీసీ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్, ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, సిసి హరీష్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో జోరుగా నకిలీ పురుగు మందుల దందా..

- దుకాణదారులు ఆడిందే ఆట పాడిందే పాట
- గగ్గోలు పెడుతున్న రైతులు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కామారెడ్డి, మార్చి 21 ( మనం జిల్లా ప్రతినిధి ) : కామారెడ్డి జిల్లాలో నకిలీ పురుగు మందుల జీరో దందా జోరుగా సాగుతోంది. దుకాణదారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఏటా కోట్ల రూపాయల విలువైన నకిలీ పురుగు మందుల జీరో దందా సాగుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన కంపెనీలు పురుగు మందులు బిల్లులు లేకుండా విక్రయిస్తూ జీరో దందా నిర్వహిస్తున్నారు. పట్టణంలో వ్యాపారులు సిండికేట్ గా ఏర్పాటు చేసుకుని వ్యవసాయ శాఖ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని జీరో దందాను సాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పలు ప్రాంతాల నుంచి నకిలీ పురుగు మందులను బిల్లులు లేకుండా తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. వీటితో పాటు వ్యవసాయాధికారుల నామమాత్రపు దాడులు ఇలా వచ్చి అలా వెళ్తున్న అధికారులు, ఇతర జిల్లాల నుంచి బయో పురుగు మందులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గ కేంద్రంలో ఒక్క నకిలీ పురుగు మందుకు యజమానికి సుమారు లిటర్ కు రూ.200లకు వస్తుంది. అదే మందును రైతుకు రూ.2000కు అమ్ముతారు. యజమానికి మార్జిన్ 1800 వరకు వస్తుంది.ఇలా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది.సుమారు రూ.6 కోట్ల మేర జీరో దందా జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా దుకాణదారులు, డీలర్ల మాత్రం ఈ దందాను యధేచ్ఛగా నిర్వహిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల సహకారంతోనే నకిలీ పురుగు మందులను అక్రమంగా నిల్వ చేసి రైతులకు అంటగడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. జీరో దందాతో పాటు నకిలీ మందులు, ఇతర జిల్లాల నుంచి నకిలీ పురుగు మందులు కూడా తెచ్చి ప్రాంతంలోని పలు గ్రామాలకు నకిలీ బయో మందులను వ్యాపారులు రైతులకు విక్రయిస్తున్నారు. ఏటా మండలంలో కోట్లల్లో పైగా వ్యాపారం సాగుతోంది. ప్రధానంగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి ఈ నకిలీ, బిల్లులు లేని నకిలీ పురుగు మందులు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి, జిల్లా వ్యాప్తంగా విక్రయిస్తున్నారు. ఇతర జిల్లాల నుండి అక్రమంగా తరలిస్తూ వీటిని గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు విక్రయిస్తున్నారు. ఓ వైపు జీరోదందా, మరోవైపు నకిలీ పురుగు మందులతో రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయాధికారులు నకిలీ విత్తనాలు, జీరో దందాను అరికట్టడంలో నిర్లక్ష్యం చూపుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.అధికారులు కొంతమంది దుకాణ దారులు డీలర్లు నకిలీ, జీరో దందా జోరుగా నడిపిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొంతకాలంగా ఈ దందా సాగుతున్నట్టు విమర్శలు వస్తున్న ఇప్పటివరకు దాడులు నిర్వహించకపోవడం దేనికి సంకేతం అని అంటున్నారు. బిచ్కుంద మండలం పుల్కల్ గ్రామంలో నకిలి విత్తనాలు వాడిన రైతు ఇబ్రహీం తీవ్రంగా నష్టపోయారు. దీనికి రైతుకు నష్ట పరిహారం రూపాయలలో అంచనా వేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వారిపై ప్రజలు రైతులు బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అరకొరగా తనిఖీలు చేసిన వివరాలు వ్యవసాయాధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. తనిఖీలు చేయడానికి వస్తున్న సమాచారం ముందుగానే తెలుసుకుంటున్న వ్యాపారస్తులు షాపులు క్లోజ్ చేస్తున్నారు. ఇలా తెలియడం పై వ్యాపారస్తులు ,వ్యవసాయ అధికారులు కుమ్మక్కై వ్యవహరిస్తున్నారు అని విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత పై అధికారులు స్పందించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



# పొదుపు సొమ్ముతో ఊడయించిన బంధన్ బ్యాంక్ మేనేజర్

- రూ. 20లక్షల పొదుపు సొమ్ముతో పారిపోయిన బంధన్ బ్యాంకు మేనేజర్..
- బంధన్ బ్యాంకు పొదుపు సొమ్మును మింగేసిన మేనేజర్
- లబోదిబో మంటున్న ఖాతాదారులు ..
- మా డబ్బులు ఇప్పించాలని బ్యాంకు ఎదుట మహిళల ఆందోళన



దేవరకొండ, మార్చి 21(మనం న్యూస్)ః దేవరకొండ పట్టణంలోని బంధన్ బ్యాంక్ మేనేజర్ మహిళ లను బడా మోసానికి గురిచేశాడు. పొదుపు సంఘాల మహిళలు కట్టిన సుమారు 20లక్షల రూపాయల డబ్బుతో బ్యాంకు మేనేజర్ ఉడాయించాడు. మా డబ్బు ఇప్పించా లని కోరుతూ పలువురు మహిళలు బ్యాంక్ ఎదుట ఆండో ళనకు దిగారు. మోసం వెలుగు చూసిందిలా... కోల్ కత్తా లో ప్రధాన కార్యాలయం ఉన్న బంధన్ బ్యాంకు దేవర కొండ శాఖలో మొత్తం 104 గ్రూపులు, 1309 మంది సభ్యులు పొదుపు చేసుకున్నారు. బ్యాంకు నుంచి తమ వ్యక్తిగత అవసరాల కోసం రుణాలు తీసుకొని వారం వారం డబ్బులు చెల్లించేవారు. ఈ క్రమంలో నవంబర్ 23న బంధన్ బ్యాంక్ శాఖలో కొండమల్లేపల్లి చెందిన సాయి తేజ మహిళా సంఘం పేరుతో ఒక్కొక్కరు రూ. 50,000 చొప్పున లోను తీసుకున్నారు. 5000 రూపాయలు ఖర్చులకు పోను 18 మంది సభ్యులకు ఒక్కొక్కరికి 45 వేల రూపాయలను బ్యాంకు సిబ్బందికి చెల్లించారు. తీసుకున్న డబ్బులకు గాను ఒక్కో సభ్యురాలు వారానికి రూ.1400 చొప్పున 48 వారాలు బ్యాంకు కట్టాల్సి ఉంది. బ్యాంకు నిబంధన ప్రకారం బాధితులు బ్యాంకు రికవరీ ఏజెంట్ అంజికి పూర్తి డబ్బులు చెల్లించారు. తిరిగి తమకు కొత్తలోను ఇవ్వాలని ఆరు నెలలుగా మహిళలు తిరుగుతున్నారు. మహిళలు బ్యాంకుకు వెళ్లి విచారించగా వారి పేర్లపై అప్పు ఉన్నట్లు ప్రస్తుత అధికారులు చెబుతున్నారు. దీంతో మహిళలు తమ దగ్గర డబ్బులు వసూలు చేసిన అంజిని నిలదీయగా తాను వసూలు చేసిన డబ్బులను బ్యాంకు మేనేజర్ హేమంత్ షి కి అప్పగించానని అతను డబ్బులు వాడుకు న్నాడని రికవరీ ఏజెంట్ అంజి చెప్పాడు. సస్పెన్షన్ చేసి చేతులు దులుపుకున్న అధికారులు దేవరకొండ శాఖలో అవకతవకలు జరిగాయని గుర్తించిన బ్యాంకు ఉన్నతాధికారులు 20 రోజుల క్రితం బ్యాంకుకు వచ్చి అవకతవకలు జరిగాయని నిర్ధారించి బ్యాంక్ మేనేజర్ హేమంత్ శ్రీ, క్యాషియర్ శ్రవణ్, సిబ్బంది రమావత్ పవార్, వంగూరి ఆంజనేయులు, రమావత్ చింటూ లను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. తమకు కొత్తలోనూ ఇవ్వకపోవడంతో పాటు బ్యాంకులో రూ.1,80,000 అప్పు ఉందని బ్యాంకు అధి కారులు చెబుతున్నారని మహిళలు ఆరోపించారు. బ్యాంకులో అవకతవకలు జరిగాయని సిబ్బంది తమకు చెప్పకుండా వారిని సస్పెండ్ చేయడంతో బ్యాంక్ మేనేజర్ హేమంత్ షి కోల్కతాకు పారిపోయాడని మహిళలు చెప్పారు. ప్రస్తుతం ఉన్న బ్యాంకు మేనేజర్ కు తమ సమస్య గురించి చెబితే తాను కొత్తగా వచ్చానని తనకేమీ తెలియదని చెబుతున్నారని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేకూరేంతవరకు ఆందోళన చేస్తామని మహిళలు బ్యాంకు ఎదుట బైఠా యించారు. బంధన్ బ్యాంకు పై చర్యలు తీసుకోవాలి తమను మోసం చేసిన బంధన్ బ్యాంక్ పై చర్యలు తీసుకో వాలని కోరుతూ శుక్రవారం దేవరకొండ పోలీస్ స్టేషన్ కు చేరుకున్న బాధిత మహిళల నుండి పిటిషన్ తీసుకునేందుకు పోలీసులు తాత్సారం చేస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. బ్యాంకు యాజమాన్యం విచారణ జరిపి సిబ్బందిని సస్పెండ్ చేసి కాబట్టి ఈ విషయమై లోతుగా విచారణ చేపట్టి న్యాయం చేస్తామని పోలీసులు చెబుతు న్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# టాక్స్ చెల్లించని ప్రాపర్టీస్ సీజ్

## 10 రోజుల్లో రూ. 3 కోట్ల వసూలుకు చర్యలు

- సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



మిర్యాలగూడ మార్చి 21 (మనం న్యూస్) : మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో కమర్షియల్, సెమీ కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాపర్టీస్ బకాయిలను చెల్లించని డీ ఫాల్టర్స్ జాబితాను సిద్ధం చేసి మున్సిపల్ యంత్రాంగం జారీచేసిన రెడ్ నోటీస్ లకు స్పందించని ప్రాపర్టీస్ ను శుక్రవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ స్వయంగా వెళ్లి... మున్సిపల్ యంత్రాంగం, పోలీసుల సమక్షంలో సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ మాట్లాడారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో ప్రాపర్టీ టాక్స్ రూ. 10 కోట్లు లక్ష్యం కాగా రూ. 7 కోట్ల వరకు వసూలు అయిందన్నారు. పెండింగ్ లో ఉన్న రూ. 3 కోట్ల టాక్స్ వసూలుకు పదిరోజులే గడువు మిగిలి ఉందన్నారు. నోటీసులకు స్పందించని... పట్టణంలోని హెచ్ పీ పెట్రోల్ బంక్, మదీనా కాంప్లెక్స్, యమహా షోరూంతో పాటు మొత్తం 10 ప్రాపర్టీస్ సీజ్ చేయడంతో పాటు రూ. 14 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. ప్రాపర్టీ టాక్స్ టార్గెట్ పూర్తయితేనే... సెంట్రల్ గవర్నమెంట్ నుంచి ఫండ్స్ కేటాయింపు జరుగుతుందని... బకాయిలు ఉంటే మిర్యాలగూడ మున్సిపాలిటీకి ఫండ్స్ రావని చెప్పారు. ప్రాపర్టీ ఓనర్లు తక్షణమే బకాయలు చెల్లించి మిర్యాలగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డీఏవో శ్రీనివాస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, ఎమ్మార్వో లు హరిబాబు, జవహర్ లాల్, సురేష్ కుమార్ ఉన్నారు.

## పరీక్షలు బాగా రాయండి అని విద్యార్థులను కోరిన జిల్లా కలెక్టర్



భువనగిరి, మార్చి 21(మనం న్యూస్): శుక్రవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అయిన నేపథ్యంలో శుక్రవారం భువనగిరి పట్టణంలోని గంజ్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సందర్శించారు. పదవ తరగతి పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. అన్ని గదులను కలెక్టర్ కలియ తిరిగి ఎలక్ట్రిసిటీ, తాగునీరు తదితర మౌలిక వసతులను క్షుణ్ణం గా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెండెంట్ కి పలు సూచనలు ఇచ్చి సజావుగా అన్ని పరీక్షలు జరిగేలా మానటరింగ్ చేయాలన్నారు. పదవ తరగతి మొదటి పరీక్ష రోజు మొత్తం 8627 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 8616 విద్యార్థులు హాజరుకాగా 11మంది గైర్హజరు అయినట్లు తెలియజేయడం జరిగింది.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- రోగులకు అందుతున్న వైద్యం పట్ల హర్షం
- డాక్టర్ భవాని ఇతర సిబ్బందిని అభినందించిన కలెక్టర్



నల్లగొండ,మార్చి 21( మనం ప్రతినిధి )ః నాంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ద్వారా మంచి వైద్య సేవలందిస్తున్నందుకుగాను పీహెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ భవాని ని,సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నాంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపి రిజిస్టర్,ఈ డి డి,ఏ ఎన్ సి తో పాటు అన్ని రిజిస్టర్ లను తనిఖీ చేయడమే కాకుండా ,ఏ ఆసుపత్రిలో లేనివిధంగా నాంపల్లి పీ హెచ్ సి లో 7 మంది ఇన్ పేషెంట్లు ఉండడం చూసి జిల్లా కలెక్టర్ ఆసుపత్రికి వచ్చిన ఇన్ పేషెంట్లతో మాట్లాడారు. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయని ?డాక్టర్ అందర్నీ పరీక్షిస్తున్నారా? అని అడిగారు .డాక్టర్ భవాని మేడం మంచి వైద్య సేవలు అందిస్తున్నారని అందువల్ల తాము నాగర్ కర్నూల్ నుండి ,హైదరాబాద్ నుండి వచ్చామని ఇద్దరు పేషెంట్లు కలెక్టర్ కు తెలిపారు. కాగా శుక్రవారం జిల్లా కలెక్టర్ హెచ్ సి ని సందర్శించే సమయానికే 73 మంది ఓపి పేషెంట్లు వైద్య సేవలు పొందడం పట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ భవానిని అభినదించారు.డాక్టర్ తో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి రోగులు ఆసుపత్రికి వస్తున్నారని? అడిగారు. బాలికల హాస్టల్ కు రెగ్యులర్ గా వెళ్తున్నారా ? అక్కడ సమస్యలు ఏంటని ప్రశ్నించగా? విద్యార్థినిలు చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారని డాక్టర్ భవాని సాగర్ జిల్లా కలెక్టర్ తెలుపగా, బాలికలు రక్తహీనతతో బాధపడకుండా వారికి హెల్త్ ఎడ్యుకేషన్ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఆస్పత్రి పరిధిలో ఇప్పటివరకు జరిగిన శిశు మరణాల సంఖ్యను అడిగగా గత సంవత్సరం డిసెంబర్ వరకు 6 కేసులు నమోదు కాగా, అనంతరం ఈ మూడు నెలల్లో ఎలాంటి శిశు మరణాలు లేవని డాక్టర్ తెలిపారు.శిశు మరణాలు లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని జిల్లా కలెక్టర్ అన్నారు. గర్భిణీ మహిళలు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని , రక్తహీనత లేకుండా మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు ఎండకు వెళ్లకుండా తగువిధంగా తాగు నీటితో పాటు, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి ఆటో క్లేవ్, ఫీటల్ డాప్లర్ ,సర్జికల్ పరికరాలను మంజూరు చేశారు .అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వంటగది, డైనింగ్ ,తరగతి గదులు, భోజనం అన్నిటిని పరిశీలించారు. వంటగదితోపాటు, డైనింగు, పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ,ప్రత్యేకించి గ్యాస్ స్టవ్ ను రోజు శుభ్రం చేయాలని సూచించారు. 5 వ తరగతి, 10 వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినిలు ప్రత్యేకంగా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని బాగా చదవాలని, క్రమ పద్ధతిలో లక్ష్యసాధనకు కృషి చేయాలని అన్నారు. విద్యార్తినిలకు పలు ప్రశ్నలు వేయడం ద్వారా జవాబులు రాబట్టి వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ వెంట నాంపల్లి తహసిల్దార్ జి .దేవా సింగ్, ఎంపీడీవో శ్రీనివాస శర్మ, ఎంపీఓ ఝాన్సీ, తదితరులు ఉన్నారు.

# క్షయ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలి



- జిల్లా క్షయనివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

నల్లగొండ, మార్చి 21( మనం న్యూస్ )ః క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు.ప్రపంచ క్షయ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా క్షయనివారణ కార్యాలయం , రివర్ నిమ్స్ సంయుక్తంగా సహాకారంతో టి.బి. నిర్మూలన, అవగాహన ముందు జాగ్రత్తలపై అన్ని జిల్లా స్థాయిలో నర్సింగ్, డిగ్రీ, పారామెడికల్ విద్యార్థినిలకు జిల్లా స్థాయిలో ముగ్గుల పోటిని జిల్లా ప్రభుత్వ అసుపత్రి ప్రాగంణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులలో జాతీయ క్షయనివారణ కార్యాక్రమం అవగాహన పెంచడం ప్రచారం కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అన్నారు.ప్రజలలో అవగాహన కల్పించడం కోసం విద్యార్థిని విద్యార్థుల ప్రయత్నం చేయాలని అయన విద్యార్థులను కోరారు. ఈ పోటీలో జిల్లాలోని వివిధ కళాశాలల నుండి 30కి పైగా టీంలు పాల్గోనడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతినిధి డా, బ్లెస్సీ ఎస్తర్, డా,రవి ప్రసాద్, డా,సుధ బుసిరెడ్డి, డా, రమేష్, డా,హరిక్రిష్ణ, డా,లావణ్య నల్లగొండ ఇన్సిట్యుట్ అఫ్ మెడికల్ సైన్సెస్ ముఖ్య అధికారి దీపక్ పాల్గొన్నారు.

## ఐటిఐ కళాశాల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



చండూరు, మార్చి 21(మనం న్యూస్)ః చండూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట వద్ద ఐటిఐ కళాశాల నిర్మాణం కోసం గుర్తించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం తనిఖీ చేశారు. 361 సర్వే నెంబర్ లో సుమారు 2 ఎకరాల స్థలంలో ప్రతిపాదిత ఐటిఐ కళాశాలను నిర్మించే నిమిత్తం ప్రభుత్వం స్థలాన్ని గుర్తించాలని ఆదేశించిన మీదట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చండూర్ ఆర్డీవో, తహసిల్దారులు 361 సర్వే నంబర్లో స్థలాన్ని గుర్తించగా, ఆ స్థలాన్ని పరిశీలించి ఐటిఐ కళాశాల ఏర్పాటుకు అనువైన పరిస్థితులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్ డి ఓ తో మాట్లాడుతూ ఐటిఐ కళాశాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. చండూర్ ఆర్డీవో శ్రీదేవి, తహసిల్దార్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన సూపరింటెండెంట్

నల్లగొండ , మార్చి 321 (మనం న్యూస్ )ః జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి , మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భం గా వారు ఆసుపత్రిలోని సర్జరీ వార్డును పరిశీలించి ఘడియ గౌరారం గ్రామం నుండి వచ్చిన తగరం అనిల్ కుమార్ ను, నల్లగొండ పట్టణం నుండి వచ్చిన 80 ఏళ్ల బక్కమ్మను సర్జరీ విభాగం వైద్యులు అందించిన వైద్య సేవల గురించి, వార్డులో పారిశుద్ధ్యం ఆహార సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. సర్జరీ చేయించుకున్న వీరు ఆసుపత్రి సిబ్బంది అందరూ మమ్మల్ని చాలా చూసుకున్నారని సూపరింటెండెంట్ మరియు వైస్ ప్రిన్సిపాల్ కు తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటుతో పేదలకు మెరుగైన చికిత్స సేవలు అందిస్తున్న సిబ్బందిని సూపరింటెండెంట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి,మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, సర్జరీ విభాగాధిపతి డాక్టర్ అన్వేశ్, ఇంటరన్స్ నర్సింగ్ సిబ్బంది ఉన్నారు.



## పరీక్షా కేంద్రాలు పరిశీలించిన జిల్లా ఎస్పి



సూర్యపేట, మార్చి 21 (మనం ప్రతినిధి)ః పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ నర్సింహ శుక్రవారం జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రాలయిన ప్రభుత్వ పాఠశాల జెడ్పి బాలికలు, నెంబర్.2 అంజిలి స్కూల్ ల కేంద్రాలు సందర్శించి పరీక్షా సరళి పరిశీలించారు. పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా లోపాలు ఉండకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం అన్నారు. పరీక్షా సమయంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ను సమర్థంగా నియంత్రించాలి అని పోలీసు అధికారులను ఆదేశించారు.విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని, ఎవ్వరూ కూడా అవకతవకలకు పాల్పడవద్దని కోరారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు రావాలని అన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు.ఎస్పి వెంట పట్టణ ఎస్ ఐ.ప్రవీణ్, బందోబస్తు సిబ్బంది ఉన్నారు.

# భయపెడుతున్న బర్డ్ ఫ్లూ

- పోచంపల్లి మండలంలోనీ కోళ్ల ఫారంలో గుర్తింపు
- ఫారంలోనీ కోళ్ళని చంపేసిన అధికారులు
- భయాందోళనలో ప్రజలు




భూదాన్ పోచంపల్లి, మార్చి 21 (మనం న్యూస్): పోచంపల్లి మండలంలో బర్డ్ ఫ్లూ కేసులు కలకలం రేపాయి. మండలంలోనీ దోతిగూడెం గ్రామంలో గల శ్రీనివాస పౌల్ట్రీ ఫామ్ లో ఈ నెల 12 న 500 కోళ్లు ఆకస్మాత్తుగా మృతి చెందాయి. అయితే పౌల్ట్రీ ఫార్మ్ ఓనర్ సుదర్శన్ రెడ్డి వెంటనే పివిసి పోచంపల్లి డాక్టర్ శ్రీనివాస్ కి సమాచారం అందించారు. వెంటనే డాక్టర్ స్పందించి పౌల్ట్రీ ఫార్మ్ ను విసిట్ చేసి చనిపోయిన కోళ్లను పరీక్షించి, అందులో ఒక నాలుగు కోళ్లను వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ కి తదుపరి వ్యాధి నిర్ధారణ కొరకు పంపడం జరిగింది. స్టేట్ లెవల్ ఇన్స్టిట్యూట్ వాళ్లు నేషనల్ లెవెల్ హై సెక్యూరిటీ అనిమల్ డిసీస్ భూపాల్ మధ్యప్రదేశ్ స్టేట్ కి ఈ చనిపోయిన కోళ్ల శాంపుల్స్ ని తదుపరి వ్యాధి నిర్ధారణ కోసం మధ్యప్రదేశ్ భోపాల్ పంపడం జరిగింది. ఈ ల్యాబ్ వారు విబిఆర్ఐ ఇన్స్టిట్యూట్ పంపించిన శాంపుల్స్ ని టెస్ట్ చేసి బర్డ్ ఫ్లూ పాజిటివ్గా కన్ఫర్మ్ చేశారు. అనంతరం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి డైరెక్టర్ తెలంగాణ స్టేట్ గవర్నమెంట్కి బర్డ్ ఫ్లూ పాజిటివ్ రిపోర్ట్ పంపించి నెక్స్ట్ చేయవలసిన నివారణ చర్యలు శాస్త్రీయ పద్ధతి ప్రకారం చేయమని ఆదేశించడం జరిగింది. తదుపరి డైరెక్టర్ నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ కి రిపోర్ట్ని చూపించి వారి నోటిఫికేషన్ ద్వారా శుక్రవారం పి. సుదర్శన్ రెడ్డి పౌల్ట్రీ ఫార్మ్ ని సందర్శించి మొదట పౌల్ట్రీ ఫామ్ లో ఉన్న కోళ్ళని మొత్తం లెక్కించి, తర్వాత వాటిని చంపడం జరిగింది. మరియు పౌల్ట్రీ ఫామ్ లో ఉన్న గుడ్లను, పౌల్ట్రీ ఫీడ్ ని లెక్కించి ప్రొసీజర్ ప్రకారం డిస్పోస్ చేశారు. ఈ ప్రోగ్రాం మొత్తం డాక్టర్ పి జానయ్య, జిల్లా పశువైద్యాధికారి యాదాద్రి భువనగిరి ఆధ్వర్యంలో అసిస్టెంట్ డైరెక్టర్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ మరియు ఇతర పశువైద్య సిబ్బంది మొత్తం 32 రాపిడ్ రెస్పాన్స్ టీములుగా ఏర్పడి ఈ ప్రోగ్రామ్ ని నిర్వహించారు. ఈ ప్రోగ్రాం లో హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది, రెవిన్యూ డిపార్ట్మెంట్ సిబ్బంది, పంచాయతీ రాజ్ సిబ్బంది మరియు పోలీస్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు. అయితే దీనిపై ప్రజల్లో భయాందోళన నెలకొంది.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ. 9,480 వేల నగదు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం

సిద్దిపేట అర్బన్, మార్చి 21, మనం న్యూస్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురిని అదువులోకి తీసుకున్న సంఘటన సిద్ధిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్కటూరు గ్రామ శివారులో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, త్రీ టౌన్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. కాగా వారి వద్ద నుండి రూ.9,480ల నగదు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో వెలికట్టకు చెందిన పెరుగు కిష్టయ్య, పొన్నాలకు చెందిన లెంకల కనకయ్య, మర్పడగకు చెందిన వల్లపు కనకయ్య, దుద్దెడ కు చెందిన మహమ్మద్ నహీంలు ఉండగా వరారీలో నాంచారుపల్లికి చెందిన రాము, వెల్కటూరుకు చెందిన కిషన్, సిద్దిపేటకు చెం దిన చారిలు ఉన్నారని, వారిని త్వరలోనే వట్టుకుంటామని తెలిపారు.



# సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ పరిశీలించిన ఎస్పీ

సూర్యాపేట మార్చి 21 (మనం ప్రతినిధి)ఃజిల్లా పోలీస్ కార్యాలయం నందు నిర్వహిస్తున్న సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ను శుక్రవారం జిల్లా ఎస్పి నరసింహ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...సోషల్ మీడియా పై పోలీసు ప్రత్యేకంగా నిఘా.సోషల్ మీడియా వినియోగించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి.మార్ఫింగ్ చిత్రాలు, నకిలీ పత్రాలు, ప్రజలను రెచ్చగొట్టే సమాచారం, ఇతరుల మనోభావాలు కించపరిచే సమాచారం వ్యాప్తి చేయడం చట్ట రీత్యా నేరం.ఐటి చట్టం ప్రకారం జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు ఒక సారికి కేసులో చిక్కుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు, ఉన్నత చదువులు, విదేశాలకు వెళ్లడంలో సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం నందు వివిధ విభాగాలను తనిఖీ చేశారు. కార్యాలయంలో గల సైబర్ సెక్యూరిటీ సెల్, ఐటి సెల్, కమాండర్ కంట్రోల్ సెంటర్, సోషల్ మీడియా మానిటరింగ్ యూనిట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.... జిల్లా పోలీస్ కార్యాలయం నందు కమాండ్ కంట్రోల్ సెంటర్, ఐటి సెల్, సైబర్ సెక్యూరిటీ సెల్, సోషల్ మీడియా మానిటరింగ్ యూనిట్లను బలోపేతం చేశాం అన్నారు. ప్రతి సామాజిక మాధ్యమాలపై జిల్లా పోలీస్ శాఖ నిఘా పటిష్ఠం చేసినది అన్నారు. దీనికోసం పరిజ్ఞానం ఉన్న సిబ్బందిని కేటాయించామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్ కలిగి ఇంటర్నెట్ ఆధుబాటులో ఉన్నది, జీవన శైలిపై సోషల్ మీడియా ప్రభావం పెరిగిపోయినది, సమాచారాన్ని చేరవేసుకోవడానికి సామాజిక మద్యమాలు వాట్సాఫ్, ఫెస్బుక్, ఇంస్టాగ్రామ్, ఎక్స్ ఇలా చాలా వేడుకలు అందుబాటులో ఉన్నాయి అని, వీటివల్ల లాబాలు, నష్టాలు ఉన్నాయి అన్నారు. ఫోన్, ఇంటర్నెట్ ఉన్నదికధా అని చాలా మంది యువత, ప్రజలు అవగాహన లేకుండా సోషల్ మీడియాలో అనవసరంగా అసభ్యకర పోస్టులను, ఇతరులను కించపరిచేలా



సమాచారం పంపిస్తున్నారు, ఇధి ఇన్ఫర్మేషన్ టెక్నాలగి చట్టం ప్రకారం నేరం, చాలా మంది జైలుకు వెళ్ళిన సందర్భాలు ఉన్నాయని ఎస్పీ గారు అన్నారు. సోషల్ మీడియా పోస్టుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తప్పుడు పోస్టులు పెడితే ఎలాంటి పరిస్తుతులు ఎదురౌతాయో అనే కనీస అవగాహన ప్రతిఒక్కరి ఉండాలి అన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేయకూడదు. తప్పుడు సమాచారం, ఇతరులపై అసభ్యకర, అసత్య సమాచారం ప్రచారం చేయకూడదు, నకిలీ పత్రాలు, మార్ఫింగ్ చిత్రాలు, వీడియోలు వ్యాప్తికి చేయకూడదు అన్నారు. ఇలాంటి వాటికి పాల్పడితే బారతీయ కొత్త న్యాయ చట్టాల ప్రకారం సమాచార సాంకేతికత చట్టం కింద కేసులు నమోదుచేయడం జరుగుతుంది. కేసు నేరం రుజువైనట్లయితే జైలుశిక్ష, జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఒకసారి ఇలాంటి కేసులో చిక్కుకుంటే చదువులు, ఉద్యోగాల నిమిత్తం విదేశాలకు వెళ్లేవారు పోలీసుల నుంచి నిరభ్యంతర ధ్రువపత్రాన్ని (ఎన్వోసీ) పొందలేరు, ఉద్యోగాలు పొందడంలో, పై చదువుల విషయంలో సమస్యలు వస్తాయి. ఒక్కసారి కేసు నమోదైందంటే వారిపై పోలీసుల నిఘా ఉంటుంది. దీనివల్ల పిల్లల తల్లిదండ్రులకూ ఇబ్బందే. పిల్లలు ల ఫోన్ వాడుతుంట్లైతే తల్లిదండ్రులు వారి ఒక నిఘా ఉంచాలి. ఇంటర్నెట్ ను జ్ఞానాన్ని పొందడానికి సద్వినియోగం చేసుకోవాలి కానీ అవగాహన లోపం వల్ల సమస్యల్లో చిక్కుకోవద్దు అని ఎస్పి గారు కోరారు.ఎస్పి వెంట ఏ ఆర్.అధనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, ఆర్ ఐ. నరసింహ, ఆర్ఎస్ఐ లు రాజశేఖర్, సాయిరాం, సిబ్బంది ఉన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యంగా పాదయాత్రలు

- **మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**



**నిజామాబాద్, మార్చి 21(మనంన్యూస్)**: ఏఐసీసీ పిలుపు పిసిసి ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,మాజీ ఎమ్మెల్యే ఆరికల నర్సారెడ్డి, సిరిసిల్ల గ్రంథాలయ చైర్మన్ సంతోష్, నుడ చైర్మన్ కేశ వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ జై బాపు జై భీం జై సంవిధన్ అనే కార్యక్రమం అందరి భవిషత్ కొరకు చేపట్టడం జరిగిందని, దేశ ప్రజలకు సమాన హక్కులు సమన్యాయం కల్పించిన రాజ్యాంగాన్ని కాలరాస్తూ అన్ని రంగాలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి నాయకుల తీరును ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో మండలంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు నిర్వహించే విధంగా కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ తీసుకుంది అని, అందులో భాగంగా ఈ నెల 19వ తేదీన రాష్ట్రస్థాయిలో, ఈరోజు జిల్లా స్థాయిలో, 28వ తేదీ వరకు మండల స్థాయిలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర సన్నాహక సమావేశాలు నిర్వహించి గ్రామ గ్రామాన పాదయాత్రలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాలరాస్తూ ప్రజలకు అన్నిటి పైన ఆంక్షలు పెడుతూ ప్రజల హక్కులను భంగం చేస్తుంది అని, రాజ్యాంగ సిద్ధాంతాలకు తూట్లు పొడుస్తూ పరిపాలన కొనసాగిస్తుందని దానిని అడ్డుకోవాల్సిన బాధ్యత భారత పౌరులు అందరి పైన ఉంది అని, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అప్రజాస్వామిక పనులను ఎండగాడుతూ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరే వేసే విధంగా పాదయాత్రలు కొనసాగాలని మండల అధ్యక్షులకు కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ నాయకులు తమ సమయాన్ని కేటాయించి ప్రజలకు రాజ్యాంగ విలువలు అందించే విధంగా అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు చేరవేసే విధంగా ప్రతి మండలంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు చేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బలమూరు వెంకట్ మాట్లాడుతూ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం అనేది కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎంతో ముఖ్యమైనది అని, రాజ్యాంగ పరిరక్షణ అనేది మన బాధ్యత అని రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు చేయడం ద్వారా దేశంలో బిజెపి చేస్తున్న కుట్రలు ప్రజలకు వివరించడంతో పాటు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని, అదేవిధంగా గ్రామ గ్రామాన క్షేత్రస్థాయిలో పాదయాత్రలు చేస్తూ ప్రజలకు వద్దకు వెళ్లడం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వాటిని పరిష్కరించే విధంగా దోహదపడడానికి ఉపయోగపడుతుంది అని అదేవిధంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా తరువాత కాంగ్రెస్ నాయకులకు ప్రజలకు మధ్య వచ్చిన కొంత దూరాన్ని తగ్గించే విధంగా పాదయాత్ర ఉపయోగపడుతుంది అని ఆయన అన్నారు కావున ప్రతి మండలంలో ఈ నెల 28వ తేదీ వరకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు నిర్వహించి తెలంగాణ రాష్ట్రంలో అన్నిటికంటే ముందు నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ రూరల్ బాల్కొండ నియోజకవర్గంలో ఈ కార్యక్రమము పూర్తిచేసే విధంగా కంకణ బద్ధులమై పని చేయాలని ఆయన అన్నారు. నిజామాబాద్ రూరల్ బాల్కొండ నియోజకవర్గంలోని అందరూ నాయకులను సమన్వయపరుస్తూ అందరితో మాట్లాడుతూ కార్యక్రమాన్ని పూర్తి చేస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బాల్కొండ ఇంచార్జి సునీల్ రెడ్డి,ఆర్మూర్ ఇంచార్జి వినయ్ రెడ్డి,ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ ఏబీ శ్రీనివాస్,పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి,డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి,మార్క్ ఫెడ్ చైర్మన్ మర గంగారెడ్డి,ప్రచార కమిటీ మెంబర్ జావేద్ అక్రమ్,మాజీ పీసీసీ కార్యదర్శి రం భూపాల్,మాజీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపి,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్,రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్,జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం,జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి,జిల్లా ఫిషర్మాన్ అధ్యక్షులు శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు అవెజ్ ఖాన్,ఈసా,సుమన్,సాకినాల శివ కుమార్, పి గంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,వివిధ మండలాల అధ్యక్షులు,జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఎంపీ రవిచంద్రకు రాష్ట్రపతి ముర్ము ఆహ్వానం



**వరంగల్ బ్యూరో, మార్చి 21(మనం న్యూస్)**: రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,కే.ఆర్.సురేష్ రెడ్డి,దీవకొండ దామోదర్ రావు తదితర ఎంపీలతో కలిసి రాష్ట్రపతి భవన్ లో శుక్రవారం ఉదయం అల్పాహారం తీసుకున్నారు.పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న సందర్భంగా ఆనవాయితీ ప్రకారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభల సభ్యులను ఆహ్వానించి అల్పాహార విందునిచ్చారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర రాజ్యసభలో తన సహచర సభ్యులు సురేష్ రెడ్డి, దామోదర్ రావులతో పాటు రాష్ట్రపతి ముర్మును కలిశారు, అల్పాహారం,తేనీరు తీసుకున్నారు.

## వడ దెబ్బ తగలకుండా తగు చర్యలు చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జనగామ ప్రతినిధి, మార్చి 21(మనం న్యూస్)**: వడ దెబ్బ తగలకుండా చేపట్టాలిసిన కార్యాచరణ మీద అన్ని మండలాలో వివిధ శాఖల కు చెందిన అధికారులతో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో..శుక్రవారం లింగాల ఘనపూరం ఎంపీడీఓ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశం లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ , పరిశుభ్రత నియమాలు పాటిస్తూ.. జన సంద్రం ఉండే చోట చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు మండలంకి సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్స్, మందులను అందుబాటులో పెట్టుకోవాలన్నారు మార్చ్, ఏప్రిల్, మే.. మూడు నెలలు అతి జాగ్రత్త గా ఉండాలన్నారు మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్సై,ఎంపీడీఓ, మెడికల్ అధికారి తో కలిపి టాస్క్ ఫోర్స్ కమిటీ ని నియమించామని.... వడ దెబ్బకు గురి అవుతే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. వడ దెబ్బకు ఏ ఒక్కరు గురి కాకుండా... ఏ ఏ సమయం లో బయటికి రావాలో ఎప్పటికప్పుడు ప్రజలకి అవగాహన కల్పించాలన్నారు అనంతరం... ఈ జి ఎస్ పనుల గురించి...మండలానికి ఉన్న టార్గెట్ ప్రకారం గా ఉపాధి హామీ పనులను పూర్తి చేయాలన్నారు క్లస్టర్ లెవల్ మీటింగ్ లను ఎప్పటికప్పుడు పెట్టుకోవలన్నారు సాగు నీరు సమస్యలు దృష్టికి రాగానే .. వెంటనే వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయి సందర్శన చేసి ... సమస్యను పరిష్కరించి వాస్తవలను రైతులకు తెలియజేయాలన్నారు. మండలం లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు అవగాహన కల్పించి రాయితీ ని వినియోగించు కునేలా ప్రోత్సహించాలన్నారు. ఎవరైతే రుసుము చెల్లించారో... అట్టి వాటికి క్షేత్ర స్థాయి పరిశీలనను పూర్తి చేసి ప్రొసీడింగ్ ఇవ్వాలన్నారు టాక్స్ కలెక్షన్ ఎంత అయ్యింది అని... పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రెడ్ నోటీస్ ను ఎంత మందికి ఇచ్చారు అని పంచాయతీ రాజ్ సెక్రటరీ లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. టాక్స్ తో పాటు నీటి పన్ను ను కూడా వంద శాతం వసూలు చేయాలన్నారు. ఈ సమావేశం లో మండల తహసీల్దార్ రవీందర్, స్పెషల్ అధికారి హతీరాం,ఎంపీడీఓ జలెంధర్ రెడ్డి,మెడికల్ అధికారి రవి తేజ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి...ప్రజావాణి దరఖాస్తు లను త్వరగా పరిష్కరించాలని, అలాగే ధరణి లో పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలనీ తహసీల్దార్ రవీందర్ కి తెలిపారు.

## టెన్త్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్



**మహబూబాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి)**: శుక్రవారం నుండి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల సరళిని మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో (8183 )కి గాను పరీక్షలకు హాజరైన వారి సంఖ్య (8176) కాగా (7) గైహాజరయ్యారు, 99.91, శాతం నమోదు అయ్యింది. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి, కేసముద్రం, కురవి, మహబూబాబాద్ మండలాలలో పరీక్షలను పరిశీలించారు.

## పదవ తరగతి పరీక్షల సరళిని తనిఖీ చేసిన కలెక్టర్

**వరంగల్ ప్రతినిధి, మార్చి 21 మనం న్యూస్**: పదవ తరగతి పరీక్షల కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు.శుక్రవారం వరంగల్ నగరంలోని ప్లాటినం జూబ్లీ పాఠశాల, గీసుగొండ మండలంలోని గీసుగొండ జెడ్పి హెచ్ ఎస్, ధర్మారం జిల్లా పరిషత్తు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో కల్పించిన మౌళిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు.ఎలాంటి మాల్ ప్రాక్టీసుకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, కాలిక్యులేటర్లు అనుమతించొద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు, సిబ్బందిని నిశిత పరిశీలన తదుపరి తర్వాతనే




అనుమతించాలని ఆయన తెలిపారు.పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణాలో పోలీస్ ఎస్కార్ట్ తో చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ అన్నారు.మొదటి రోజు నిర్వహించిన పదవతరగతి పరీక్షకు 9238 మంది విద్యార్థులకు గాను 9223 మంది. 99.8 శాతంతో హాజరు, 15 మంది గైరుహాజరు అయినారనిజిల్లా విద్య శాఖ అధికారి పేర్కొన్నారు.కలెక్టర్ వెంట జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ అరుణ, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు ఉన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్, మార్చి 21( మనం న్యూస్)**: పదవ తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుండి ప్రారంభమవగా, తొలి రోజునే కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? స్ట్రాంగ్ రూం ల నుండి ఎన్ని గంటలకు ప్రశ్న పత్రాలు కేంద్రానికి చేరుకున్నాయి, ఆ సమయంలో పోలీస్ ఎస్కార్ట్ ఉందా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వసతి అందుబాటులో ఉందా? లేదా? అని గమనించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా, పక్కాగా పరీక్షలు జరిపించాలని అన్నారు.

## నేషనల్ సికిల్ సెల్ అ నీమియా ఎలిమినేషన్ మిషన్ పై అవగాహన కల్పించాలి

- **డాక్టర్ జి మురళీధర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి**



**మహబూబాబాద్, మార్చి 21(మనం న్యూస్)**: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తెలంగాణ ఆదేశానుసారం శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలోని లయన్స్ క్లబ్ లో జిల్లా లెవెల్ టి ఓ టి శిక్షణ 'జాతీయ సికిల్ సెల్ అనీమియా' పై అవగాహన మరియు ఒకరోజు శిక్షణా కార్యక్రమం జిల్లాలోని వైద్యాధికారులందరికీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ మాట్లాడుతూ, సికిల్ సెల్ వ్యాధి లేదా 'సికిల్ సెల్ అనీమియా ' అనేది ఒక వంశానుగత రక్త రుగ్మత, సాధారణంగా మనిషి రక్తంలోని ఎర్ర రక్త కణాలు గుండ్రని ఆకారంలో ఉంటాయని, ఈ కణాలు రక్తనాళాల ద్వారా శరీరమంతా ప్రయాణిస్తూ వివిధ అవయవాలకు ప్రాణవాయువును (ఆక్సిజన్ )ను సరఫరా చేస్తుంటాయని, కొంతమందిలో జన్యు సంబంధ మార్పుల వల్ల ఎర్ర రక్త కణాలు కొడవలి (సికిల్ )ఆకారంలోకి మార్పు చెందుతాయని, ఈ సికిల్ సెల్ ఉన్న వారి రక్త కణంలోని ఒక జన్యువు సికిల్ సెల్ గాను ఒకటి మామూలుగాను ఉన్నట్లయితే అటువంటి వారిని సికిల్ సెల్ క్యారియర్లు వీళ్ళకి మామూలుగా ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవని అయితే వివాహం చేసుకున్న దంపతుల ఇద్దరికీ ఇటువంటి లక్షణాలు ఉన్నట్లయితే వారికి పుట్టే పిల్లలు రక్త కణంలోని రెండు జన్యులు వంపు తిరిగి ఉంటాయి, అటువంటి పిల్లలకు పుట్టుకతోనే సమస్యలు మొదలవుతాయని సాధారణ రక్తకణాల జీవితకాలం 120 రోజులు అయితే సికిల్ సెల్ రక్త కణాల జీవితకాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే ఉంటాయని జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే ఉంటాయని సికిల్ రక్త కణాలు నశించి పోయేంత వేగంగా కొత్త ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతకు గురి అవుతారని పేర్కొన్నారు. ఈ వ్యాధి ఉన్నవారు తగిన చికిత్స తీసుకోకపోతే తీవ్రమైన సమస్యలతో బాధపడుతారని పేర్కొంటూ, సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు సాధారణంగా ఆరు నెలల వయసులో ప్రారంభమవుతాయని అవి ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి భిన్నంగా ఉంటాయని, అవి కాలక్రమంగా మారవచ్చు అని పేర్కొంటూ, ముఖ్యంగా రక్తహీనత దీర్ఘకాల కామెర్లు (జాండీస్ )ఉండడం, కీళ్ల దగ్గర,ఛాతి దగ్గర మరియు నడుము వద్ద తీవ్రమైన నొప్పులు ఉండుట చేతులు, కాళ్ళ వాపు, ఇన్ఫెక్షన్లు తరచుగా వస్తూ ఉంటాయని యుక్త వయస్సు లేదా పెరుగుదలలో జాప్యం ఉంటుందని,దృష్టి సమస్యలు కూడా రావచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, ప్రోగ్రామ్ ఆఫీసర్ సికిల్ సెల్ డాక్టర్ శ్రవణ్ కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విజయకుమార్, డాక్టర్ గణేష్ పీడియాట్రిషన్ నిమ్స్, డాక్టర్ రమేష్ టెక్నికల్ ఆఫీసర్ ఎన్ హెచ్ ఎం, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, కె.వి.రాజు, పురుషోత్తం శారద హెల్త్ ఎడ్యుకే టర్స్, సబ్ యూనిట్ ఆఫీసర్స్ రామకృష్ణ, వడ్డెబోయిన శ్రీనివాస్, డీఈవో ఉమాకర్, అరుణ్ వైద్యాధికారులు పాల్గొన్నారు.

## యువత చెడు అలవాట్లకు పోకుండా ఉన్నత లక్ష్యాల వైపు అడుగు వేయాలి

**కామారెడ్డి, మార్చి 21 ( మనం ప్రతినిధి )**: కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ఎస్ ఎస్ ఎల్ డిగ్రీ కళాశాల నందు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాన్సువాడ ఎక్సైజ్ సీఐ యాదగిరి రెడ్డి మాట్లాడుతూ., మాదకద్రవ్యాలు అయినా గంజాయి, కొకైన్, హెరాయిన్, ఆల్కహాల్, సిగరెట్ వంటివి యువతరం బంగారు భవిష్యత్తును నాశనం చేసి చివరకు ప్రాణాలు హరించే స్థాయికి తీసుకువస్తాయని కావున అలాంటి చెడు అలవాట్లకు పోకుండా యువతరం ఉన్నత లక్ష్యాల వైపు అడుగు వేయాలని అన్నారు మన బాన్సువాడ చుట్టుపక్కల ఏరియాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు కానీ గంజాయి సేవించిన వాళ్ళు ఉంటే తమకు సంప్రదించి వారికి రిహబిలేషన్ సెంటర్లకు కౌన్సిలింగ్ ఇప్పించే బాధ్యతను తాము తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ వై కె ఎస్ వాలంటీర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ., ప్రపంచంలో ఎక్కడా లేని యువతరం మన భారత దేశంలో మాత్రమే ఉంది అలాంటి యువతరం సరైన మార్గంలో నడిచి నప్పుడే దేశ అభివృద్ధి ఖండాలు దాటుతుంది కానీ నేటి యువతరం క్షణిక సంతోషం కోసం మాదొక




ద్రవ్యాలకు అలవాటై తమ లక్ష్యాలను మరిచిపోయి మత్తులో తూగుతూ దేశ అభివృద్ధిని తుంగలో తొక్కుతూ ప్రభుత్వాలకు సవాళ్లుగా మారుతుంది. ప్రభుత్వాలు ఎన్ని నివారణ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసిన అడ్డదారిన అక్రమార్కులు యువతను మత్తుల్లో ముంచుతూ కోట్లకు పడగలెత్తుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలనకై ఎంతో కృషి చేస్తుంది యువతరం ఇకనైనా మారి తమ బంగారు భవిష్యత్తును ఉన్నత లక్ష్యాల వైపుకు వేసేలా కృషి చేయాలని ఈ కార్యక్రమాన్ని నెహ్రూ యువ కేంద్రం నిర్వహించింది అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్ గౌడ్, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్ సునీల్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిప్లేన్ చైర్మన్ గా ఈగ సంజీవరెడ్డి



**నిజామాబాద్, మార్చి 21( మనం న్యూస్)**: అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏతిక్స్ మరియు డిసిప్లేన్ చైర్మన్ గా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అయినా ఈగ సంజీవరెడ్డి నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ ఒక్క ప్రకటన లో తెలిపారు. ఈగ సంజీవరెడ్డి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏతిక్స్ మరియు డిసిప్లేన్ చైర్మన్ ఎంపిక పట్ల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ అంద్యాల లింగయ్యా, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, భూమారెడ్డి,ఉపాధ్యక్షులు భక్త వత్సలాము, ప్రవీణ్ రెడ్డి, గాధరి సంజీవ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు విజయ కాంత్ రావ్, రాజగౌడ్, అబ్దుల్ ఒమార్ మరియు మనోజ్ కుమార్, సురేష్, రమేష్, అబ్బన్న, జావీద్,పలు క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## 10వ తరగతి వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 21 (మనం న్యూస్)**: జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆర్.బి.హెచ్.వి., జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, తహశిల్దార్ రఫతుల్లా లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. త్రాగునీరు, విద్యుత్ సరఫరా, ఆర్.టి.సి. బస్సులు, ప్రశ్నా, జవాబు పత్రాల రవాణా, బందోబస్తు, పారిశుద్ధ్యం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ.ఆర్. ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ కొరకు 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షల మొదటి రోజు 9 వేల 183 మంది హాజరు కావలసి ఉండగా 9 వేల 163 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని, ఒకసారి అనుత్తీర్ణులైన వారు 6 మంది హాజరు కావలసి ఉండగా ఇద్దరు హాజరయ్యారని, 99.74 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని తెలిపారు.

### విధులలో నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు

మొదటి రోజున జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష 2 గంటల అలస్యంగా ప్రారంభమైందని తెలిపారు. రోజు వారిగా, ప్రశ్నాపత్రాల సెట్ల వారిగా పోలీస్ స్టేషన్ నుండి ప్రశ్నాపత్రాలను బందోబస్తు మధ్య ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలకు తరలించడం జరుగుతుందని, ఆఖరి నిమిషం వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునే ప్రశ్నాపత్రాల వివరాలు ఎవరికి తెలియదని తెలిపారు. మంచిర్యాల పోలీస్ స్టేషన్ నుండి స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తరలించవలసి ఉంటుందని, ఈ క్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం-03015 కు తరలించే ట్రంక్ బాక్సుల్లో రెండవ రోజు పరీక్ష సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఉన్నాయని గమనించి, పరీక్షా కేంద్రానికి రావలసిన ప్రశ్నాపత్రాల బాక్సును వెతకడంలో 1.30 గంటల సమయం పట్టిందని, ఉన్నతాధికారుల అనుమతి పొంది, పరీక్షా కేంద్రానికి తరలించి, విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను అందించడంలో మొత్తం 2 గంటల ఆలస్యం జరిగిందని, విద్యార్థులు పరీక్ష వ్రాసేందుకు ఉదయం 11.30 గంల నుండి మధ్యాహ్నం 2.30 గంలల వరకు నిబంధనల ప్రకారం 3 గంటల సమయం ఇవ్వడం జరిగిందని, 2 గంటల ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైనందున విద్యార్థులకు స్నాక్స్ అందించడం జరిగిందని తెలిపారు. ట్రంక్ బాక్సో గుర్తించి రెండవ రోజు పరీక్ష ప్రశ్నాపత్రాలను తెరువలేదని, రాష్ట్ర ప్రభుత్వ



సీల్తో పోలీస్టే స్టేషన్లో అలాగే భద్రపర్చబడి ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, ఒక ప్రశ్నాపత్రానికి బదులు మరొక ప్రశ్నాపత్రం ఇచ్చారని, పేపర్ లీక్ అయింది అంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తెలిపారు. విధులలో నిర్లక్ష్యం, అలసత్వం వహించిన పరీక్షా కేంద్రం ముఖ్య పర్యవేక్షకులు మీర్ సప్టర్ అలీఖాన్, శాఖ అధికారి ఎన్.ఆర్. పద్మజ లను సస్పెండ్ చేయడం జరిగిందని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి పొరపాట్లు పున:రావృతం కాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ రికార్డు బద్దలవుతుందా?



ఐపీఎల్ అంటే భారీ సిక్సర్ లు, కళ్లు చెదిరే క్యాచ్ లు, అదిరిపోయే వికెట్లు మాత్రమే కాదు.. అంతకుమించి అనిపించే రికార్డులు కూడా. 17 సీజన్ల ఐపీఎల్ లో ఇప్పటివరకు చాలా రికార్డులు నమోదయ్యాయి. అలాంటివాటిలో గత కొన్నేళ్లుగా ఎవరూ టచ్ చేయని, సమీప భవిష్యత్తులో అవకాశం లేని రికార్డులు ఓ సిరీస్ లో అందించే ప్రయత్నమే ఇది.

ఐపీఎల్ లో రికార్డులు అంటే గుర్తొచ్చే తొలి పేరు విరాట్ కోహ్లీ. ఈ సిరీస్ ఆయనతోనే స్టార్ట్ చేస్తున్నాం. ఐపీఎల్ పరుగుల విషయంలో ఇప్పట్లో ఎవరూ దరి చేరలేని ఎత్తులో ఉన్నాడు విరాట్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున 252 మ్యాచ్ లు ఆడి 8,004 పరుగులు చేశాడు. ఈ రికార్డును ఇప్పట్లో కొట్టే ప్లేయర్ దరిదాపుల్లో ఎవరైనా ఉన్నారా? కనిపించడం లేదు.

టాప్- 10 జాబితాలో రెండో స్థానంలో ఉన్న శిఖర్ ధావన్ (6769) దాదాపు ఐపీఎల్ కి దూరమైనట్లే. కాబట్టి అతడికి ఆ అవకాశం లేదు. ఈ అవకాశం ఉన్న మరో వ్యక్తి రోహిత్ శర్మ (6628). అయితే హిట్ మ్యాన్ వరుస సీజన్లలో భారీ పరుగులు చేయాలి. వయసు రీత్యా అతడు ఎక్కువ సీజన్లు కొనసాగే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లీ రికార్డును ఇప్పట్లో కొట్టేవాళ్లే లేరు.

## ఉప్పల్ లో ఐపీఎల్ మ్యాచ్



## 2700 మంది పోలీసులతో భారీ భద్రత

మార్చి 22 నుంచి ఐపీఎల్ 2025 ప్రారంభం కానున్న వేళ రాచకొండ పోలీసులు అప్రమత్తమయ్యారు. మార్చి 23న ఉప్పల్ మైదానంలో సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే మ్యాచ్ కు ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశారు. మొత్తంగా 2700 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ స్టేడియంలో 450 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

స్టేడియంలోనే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏసీపీ సారథ్యంలో భద్రతను పర్యవేక్షించనున్నారు. మరోవైపు, స్టేడియం ఎంట్రన్స్ వద్ద స్నిపర్ డాగ్స్, బాంబ్ స్క్వాడ్ తో తనిఖీలు చేపట్టనున్నారు. క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే మహిళల కోసం మహిళా భద్రతా విభాగం బృందాలను ఏర్పాటు చేశారు. అభిమానుల కోసం ఐదు చోట్ల ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి వాటర్ బాటిల్స్, ల్యాప్ టాప్, అగ్గిపెట్టెలు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. ఐపీఎల్ మ్యాచ్ ఉన్న రోజుల్లో నగరంలో అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు నడవనున్నాయి.

## నష్టాలు రాలేదు: పీసీబీ




ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా టీమ్ఇండియా నిలిచిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ ఆతిథ్యంలో ఈ టోర్నీ జరిగింది. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు భారీ నష్టాలు వచ్చాయని కథనాలు వచ్చాయి. అయితే, తమకు లాభాలు వచ్చాయని తాజాగా పీసీబీ వెల్లడించింది. దాదాపు 10 మిలియన్ డాలర్ల (పాక్ రూపాయల్లో 280 కోట్లు) ఆదాయం వచ్చిందని తెలిపింది. లాహోర్, కరాచీ, రావల్పిండి స్టేడియాల ఆధునికీకరణ చేసేందుకు పెద్ద మొత్తం ఖర్చు చేయడంతో నష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చిందనేది అవాస్తవమని కొట్టిపడేసింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధికారిక ప్రతినిధి ఆమిర్ మిర్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జావెద్ ముర్తాజా ఖర్చులు, ఆదాయం విషయంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని మీడియాకు వెల్లడించారు.

## ఐపీఎల్ లో మొదటి రెండు మ్యాచ్ లకు కేఎల్ రాహుల్ దూరం

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఐపీఎల్ 2025 మొదటి రెండు మ్యాచ్ లకు దూరం కానున్నాడు. అతని భార్య అథియా శెట్టి మొదటి బిడ్డకు జన్మనివ్వనుండటమే దీనికి కారణం. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా మహిళా జట్టు కెప్టెన్ అలిస్సా హీలీ ఓ యూట్యూబ్ ఛానల్ వేదికగా తెలిపారు. 'హ్యారీ బ్రూక్ ఐపీఎల్ ఆడటం లేదు. ఢిల్లీ క్యాపిటల్స్ లో అతడి స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారో చూడాలి. అలాగే కేఎల్ రాహుల్ కూడా మొదటి రెండు మ్యాచ్ లు ఆడలేకపోవచ్చు. అతడు తండ్రి కాబోతుండటమే దీనికి కారణం. జట్టు యువ ఆటగాళ్లతో బలంగానే ఉంది. అయినప్పటికీ కేఎల్ రాహుల్ టీ20 ల్లో చాలా కీలకపాత్ర పోషిస్తాడు. అతని ఆట అద్భుతంగా ఉంటుంది' అని ఆమె అన్నారు. కేఎల్ రాహుల్ ఐపీఎల్ 2025 మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం రూ.12 కోట్లకు తీసుకుంది. అంతకు ముందు రాహుల్ ను లఖ్ నవూ సూపర్ జెయింట్స్ వదులుకుంది. గత సీజన్ లో ఢిల్లీ క్యాపిటల్స్ కు సారథిగా వ్యవహరించిన రిషబ్ పంత్ ను ఢిల్లీ వదులుకుంది. అతణ్ని వేలంలో లఖ్ నవూ సూపర్ జెయింట్స్ రూ.27కోట్ల భారీ మొత్తం వెచ్చించి కొనుగోలు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్ నవూ సూపర్ కింగ్స్ మార్చి 24న విశాఖపట్నం వేదికగా పోటీ పడనున్నాయి. కానీ ఈ మ్యాచ్ కు కేఎల్ రాహుల్ అందుబాటులో ఉండటం అనుమానమే.

## యాక్టింగ్ తో అదరగొట్టిన గౌతమ్..



నటుడు మహేశ్ బాబు తనయుడు గౌతమ్ గత కొంతకాలంగా అమెరికాలో ఉంటోన్న విషయం తెలిసిందే. న్యూయార్క్ లోని ప్రముఖ యూనివర్సిటీలో అతడు నటనలో శిక్షణ తీసుకుంటున్నాడు. ఇందులోభాగంగానే తనలోని యాక్టింగ్ స్కిల్స్ ను బయటపెడుతూ ఇటీవల అతడు ఒక స్కిట్ లో పాల్గొన్నాడు. తోటి విద్యార్థితో కలిసి అతడు చేసిన ఈ స్కిట్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. వీడియో ఆరంభంలో చిరునవ్వుతో ప్రశాంతంగా కనిపించిన గౌతమ్.. కొద్ది క్షణాల్లోనే ఆగ్రహావేశాలకు లోనై సంభాషణలు చెబుతూ కనిపించారు. దీనిని చూసిన నెటిజన్లు గౌతమ్ పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. గౌతమ్ యాక్టింగ్ భలే చేస్తున్నాడంటూ మెచ్చుకుంటున్నారు.

గౌతమ్ ఇప్పటికే గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. తన తండ్రి బాటలోనే నటుడిగా రాణించాలని ఆశిస్తున్నాడు. ఇందులోభాగంగానే యాక్టింగ్ లో శిక్షణ తీసుకుంటున్నాడు. కొంతకాలం క్రితం లండన్ లో తొలి స్టేజ్ ప్రదర్శన ఇచ్చాడు. ఈవిషయాన్ని తెలియజేస్తూ నమ్రత ఇన్ స్టాలో పోస్ట్ కూడా పెట్టారు. ''గౌతమ్ ఫస్ట్ థియేటర్ స్టేజ్ పెర్ఫామెన్స్ అద్భుతంగా ఉంది. చూసిన వారంతా ఎంజాయ్ చేశారు. చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు 'జాయ్ ఆఫ్ డ్రామా' నిర్వహించే సమ్మర్ ప్రోగ్రామ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. స్నేహితులు, కుటుంబంతో కలిసి ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు. గౌతమ్ బాల నటుడిగా తెరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. మహేశ్ హీరోగా తెరకెక్కిన '1 నేనొక్కడినే' లో కనిపించి అలరించాడు. మరోవైపు, మహేశ్ కుమార్తె సితార సైతం వరుస వాణిజ్య ప్రకటనలు చేస్తోంది. ఇప్పటికే నగల దుకాణానికి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించిన తను.. తండ్రితో కలిసి తాజాగా దుస్తుల బ్రాండ్ ప్రకటనలో యాక్ట్ చేసింది.

## పర్మిషన్ లేకుండా కారవాన్ లోకి..



'అర్జున్ రెడ్డి' తో కెరీర్ ఆరంభంలోనే విజయాన్ని అందుకున్నారు నటి షాలినీ పాండే. ఈ సినిమా తర్వాత ఆమె తెలుగు, తమిళంలో పలు సినిమాలు చేశారు. ప్రస్తుతం బాలీవుడ్ లో వరుస ప్రాజెక్టు చేస్తోన్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. కెరీర్ ఆరంభంలో ఒక దర్శకుడి తీరు వల్ల తాను ఇబ్బందిపడినట్లు చెప్పారు. అతడిపై తాను కేకలు వేశానని తెలిపారు. ఆ సమయంలో అలా చేసి మంచి పనే చేశానని వెల్లడించారు.

''జబల్ పుర్ కు చెందిన నేను.. సినిమాల్లో రాణించాలనే ఆశతో కుటుంబాన్ని వదిలేసి వచ్చాను. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఫేస్ బుక్ లో నా ఫొటోలు చూసి 'అర్జున్ రెడ్డి'లో అవకాశం ఇచ్చారు. ఆయన టీమ్ నుంచి నాకు ఫోన్ వచ్చినప్పుడు నిజమేనా? కాదా? అని కూడా ఆలోచించలేదు. ఫొటోలు అడిగారు పంపించేశాను. అలా, 'అర్జున్ రెడ్డి'తో హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకున్నా. ఇన్నేళ్ల ప్రయాణంలో దర్శక-నిర్మాతలు, నటీనటులు నాకెంతో సపోర్ట్ గా నిలిచారు. ఆయా సినిమాలకు సంబంధించి నా అభిప్రాయాలనూ వారు గౌరవించారు. అయితే, ఈ ప్రయాణంలో నేనూ సవాళ్లు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. కెరీర్ ఆరంభంలో దక్షిణాదిలో ఓ సినిమా చేస్తున్నప్పుడు.. దర్శకుడి ప్రవర్తన వల్ల ఇబ్బందిపడ్డా. కారవాన్ లో నేను దుస్తులు మార్చుకుంటున్న సమయంలో పర్మిషన్ లేకుండానే దర్శకుడు డోర్ తీశాడు. నాకెంతో కోపం వచ్చింది. వెంటనే ఆయనపై కేకలు వేశా. దాంతో ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయాడు. చుట్టూ ఉన్న వాళ్లు అలా ఆగ్రహం వ్యక్తం చేయడం కరెక్ట్ కాదన్నారు. నాకు మాత్రం తప్పుగా అనిపించలేదు. ఆ తర్వాత నాకెప్పుడూ ఆ విధమైన సమస్యలు ఎదురుకాలేదు. ఒకవేళ ఎదురైనా ముఖంపైనే కోప్పడకుండా వారికి ఏవిధంగా సమాధానం చెప్పాలో తెలుసుకున్నా'' అని షాలినీ పాండే వివరించారు.

షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్ సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్ ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సిరీస్ చిత్రీకరణ సందర్భంగా షబానా అజ్మీ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని అన్నారు. సీనియర్ నటి అయినప్పటికీ ఆమె అందరితో కలివిడిగా ఉంటారని.. స్ఫూర్తినింపేలా మాట్లాడతారని చెప్పారు. కెరీర్ పరంగా తాను విభిన్నమైన ప్రాజెక్ట్ లు.. సవాలు చేసే పాత్రల్లో నటించాలని ఉందని షాలినీ పాండే తెలిపారు.



## మీ ప్రేమాభిమానాలను పొందడం అదృష్టం

### బ్రిటన్‌లోని అభిమానులతో చిరంజీవి భేటీ



బ్రిటన్ పార్లమెంటు సత్కారం అందుకున్న అగ్ర కథానాయకుడు చిరంజీవి.. నేడు అక్కడి అభిమానులతో సమావేశమయ్యారు. అభిమానుల ఇళ్లకు వెళ్లాలని ఉందని ఆయన మనసులోని మాట బయటపెట్టారు. 'మీరందరూ నా తమ్ముళ్లు, చెల్లెళ్లే.. జీవితంలో మీరు ఏం సాధించినా అది నేను సాధించినట్లే. జీవితంలో ఏదో ఒక సమయంలో సినిమా చూసి, లేదా ఏదో ఒక మాట విని మీరందరూ స్పందించిన వారే. నన్ను స్ఫూర్తిగా తీసుకున్న వారే. మీ అందరి ప్రేమాభిమానాన్ని పొందుతున్నా. ఇంతకంటే నా జీవితానికి ఏం కావాలి. ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లకు వెళ్లి.. వారితో ప్రేమగా మాట్లాడి.. చెల్లెమ్మలు వండిన వంటకాలను తినాలని ఉంది. ఆ అవకాశం ఎలా వస్తుందో తెలియదు. కానీ, భవిష్యత్తులో ఆ అవకాశం వస్తే బాగుంటుంది. ఒక క్రమ పద్ధతి లేకుండా ఈరోజు నాకు మనసులో ఏం అనిపిస్తే అది మాట్లాడేస్తున్నా. నా మాటలను మీరు అర్థం చేసుకుంటారని భావిస్తున్నా' అని చిరంజీవి తెలిపారు. అనంతరం ఆయన ప్రధాని మోదీ మాటలను గుర్తు చేసుకుంటూ.. 'పవన్ ప్రమాణస్వీకారం రోజున ప్రధాని మోదీ గారు అన్న మాటలు నాకింకా గుర్తున్నాయి. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత పవన్ ఇంటికొచ్చినప్పటి వీడియోను ఆయన చూసినట్లు చెప్పారు. తమ్ముడిని ఆహ్వానించి, ఆశీర్వదించిన తీరు ఆయన హృదయాన్ని తాకిందన్నారు. అది చూసి కన్నీళ్లు వచ్చాయని తెలిపారు. అన్నదమ్ములు ఎలా ఉండాలో మీరు చూపించారని ఆయన మెచ్చుకున్నారు' అని వెల్లడించారు.

## వార్నర్ అంత తీసుకున్నాడా..?

హీరో నితిన్ నటించిన లేటెస్ట్ మూవీ రాబిన్ హుడ్ మార్చి 28న గ్రాండ్ రిలీజ్ కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు వెంకీ కుడుముల డైరెక్ట్ చేయగా పూర్తి కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ చిత్రం అలరించనుంది. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ చిత్ర పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఇక ఈ సినిమాలో భారీ తారాగణం నటిస్తోంది. ఇందులో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ కూడా ఓ కేమియో పాత్రలో నటిస్తున్నాడు. అయితే, ఈ సినిమాతో వార్నర్ ఇండియన్ సినిమాలోకి



అడుగుపెడుతున్నాడు. కాగా, ఈ సినిమాలో ఆయనది కేవలం కేమియో పాత్ర కాదని.. మంచి స్కోప్ ఉన్న పాత్ర అని తెలుస్తోంది. దాదాపు 5 నిమిషాల నిడివి ఉన్న పాత్రలో వార్నర్ కనిపిస్తాడని తెలుస్తోంది. అయితే, ఈ సినిమాలో నటించినందుకు గాను డేవిడ్ వార్నర్ ఏకంగా రూ.2.5 కోట్ల మేర రెమ్యునరేషన్ తీసుకున్నట్లు తెలుస్తోంది. తన పాత్ర ఈ సినిమాలో ఎలాంటి ప్రభావం చూపుతుందో అని అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోండగా మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేశారు.

## కళ్యాణ్ రామ్ కోసం మరోసారి ఎన్టీఆర్?

ప్రస్తుతం మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా పలు భారీ సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రాల్లో వార్ 2, తర్వాత దర్శకుడు ప్రశాంత్ నీల్ తో సినిమా కూడా ఒకటి. మరి ఈ రెండు సినిమాలపై కూడా భారీ హైప్ నెలకొన్న సంగతి తెలిసిందే. ఇంకోపక్క తన సోదరుడు నందమూరి కళ్యాణ్ రామ్ కూడా పలు సినిమాలు చేస్తూ బిజీగా ఉండగా తాను చేసిన లేటెస్ట్ సినిమానే అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమాతో వస్తున్నారు. ఇక ఈ సినిమాపై రీసెంట్ టీజర్ తో సాలిడ్ బజ్ నెలకొనగా ఈ చిత్రాన్ని వేసవి రేస్ లోనే మేకర్స్ ఫిక్స్ చేశారు. అయితే కళ్యాణ్ రామ్ కోసం పలు సినిమాల ప్రీ రిలీజ్ కోసం తారక్ వచ్చిన సంగతి తెలిసిందే. మరి ఇలా నెక్స్ట్ ఈ సినిమా ఈవెంట్ కి కూడా అన్న కోసం తారక్ వస్తాడని తెలుస్తుంది. ఈసారి ఈవెంట్ ని హైదరాబాద్ లోనే ప్లాన్ చేస్తుండగా ఇక్కడ ఎన్టీఆర్ ని తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

## వీరమల్లుపై సాలిడ్ అప్డేట్ ఇచ్చిన మేకర్స్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో తన అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం హరిహర వీరమల్లు కూడా ఒకటి. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ నిధి అగర్వాల్ నటించిన ఈ చిత్రాన్ని దర్శకుడు జ్యోతికృష్ణ తెరకెక్కిస్తుండగా మంచి అంచనాలు ఈ సినిమాపై కూడా ఉన్నాయి. ఇక ఈ చిత్రం నుంచి ఆల్రెడీ వచ్చిన పాటలు మంచి హిట్ అయ్యాయి.

అలానే మేకర్స్ ఒకో అప్డేట్ ని కూడా ఎప్పటికపుడు అందిస్తుండగా ఇపుడు లేటెస్ట్ గా మరో సాలిడ్ అప్డేట్ ని అందించారు. దీనితో ఈ చిత్రం డబ్బింగ్ పనులు ఇపుడు స్టార్ట్ చేసేసినట్టుగా మేకర్స్ తెలిపారు. ఫుల్ స్వింగ్ లో ఈ పనులు జరుగుతున్నాయట. ఇక పవన్ కేవలం ఇంకొన్ని డేట్స్ ఇవ్వాల్సి ఉండగా ఇవి ఇస్తే సినిమా పూర్తయ్యిపోతుందని చెప్పవచ్చు. గత ఎన్నికల సమయంలో మొదలు పెట్టిన సినిమా ఇది మరో ఎన్నికలు కూడా అయ్యాయి కానీ ఇంకా రిలీజ్ కాలేదు. మే 9న రిలీజ్ అని ఫిక్స్ చేశారు. మరి అక్కడైనా వస్తుందో లేదో చూడాలి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.